అనుదినం... జనస్వరం

Dwaraka

నవతెలంగాణ

సమగ్ర తెలుగు దినపత్రిక

బుధవారం 24-1 -2018

సంపుటి : 4 సంచిక : 26 | Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar, Mahaboobnagar, Warangal | www.navatelangana.com | 12 + 16 పేజీలు వెల : 5.00



మోడీ, యోగికి రక్తంతో లేఖ...

- న్యాయం చేయాలని లైంగికదాడి బాధితురాలి వేడుకోలు

2లో



సుప్రీం న్యాయమూర్తులుగా ఇందు మల్హోత్రా.. కేఎం.జోసెఫ్

2లో



చిన్న ఉద్యోగం దొరికే పరిస్థితి లేదు

- అంతర్జాతీయ కార్మిక సంస్థ

9లో

ప్రమాదంలో

ప్రపంచీకరణ..

రక్షణాత్మక చర్యలతో తీవ్ర విఘాతం



దావోస్‌లో ప్రపంచ ఆర్థిక సదస్సులో మాట్లాడుతున్న ప్రధానమంత్రి నరేంద్రమోడీ


- ఈ ధోరణి ఉగ్రవాదమంత ప్రమాదకరం
- కొన్ని పాశ్చాత్య దేశాల విధానాలు సరికాదు
- సమయానుకూల చురుకైన విధానాలే ఇందుకు పరిష్కారం
- పర్యావరణాన్ని కాపాడుకోకుంటే ముప్పే
- భిన్నత్వంలో ఏకత్వమే భారత్‌ను నడిపిస్తోంది
- అందరికీ అభివృద్ధి ఫలాలే లక్ష్యంగా చర్యలు: ప్రధాని మోడీ

ప్రపంచీకరణ వ్యతిరేక విధానాలు నుంచి మొదలు కొని టెక్నాలజీలో వేగంగా వస్తున్న మార్పులు, పర్యావరణ సమస్యలు ప్రపంచానికి ప్రమాదకరంగా మారుతున్నాయని అన్నారు. ఇటీవలి కాలంలో కొన్ని దేశాలు ప్రపంచీకరణ స్ఫూర్తికి విఘాతం కలిగించేలా రక్షణాత్మక విధానాలను పాటిస్తుండడాన్ని ఆయన దావోస్ వేదికపై ఆక్షేపించారు. ఇటీవల రక్షణాత్మక దోరణులను అంతకంతకు పెంచుకొంటూ పోతున్న అమెరికా, బ్రిటన్‌ల పేర్లను ప్రస్తావించకుండా మోడీ ఈ వ్యాఖ్యలు చేశారు.

దావోస్:అగ్రరాజ్యం అమెరికాతో సహ ఇటీవల కొన్ని పాశ్చాత్య దేశాలు అవలంభిస్తున్న రక్షణాత్మక ధోరణులను ప్రధాని మోడీ మొట్టమొదటిసారిగా అంతర్జాతీయ వేదికపై ప్రస్తావించారు. దావోస్ వేదికగా జరగుతున్న ప్రపంచ ఆర్థిక సదస్సులో ఆయన మాట్లాడుతూ ప్రపంచం నేడు పలు ...9లో



దావోస్‌లో ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతో, ఏపీ ఐటీమంత్రి లోకేశ్‌తో తెలంగాణ ఐటీమంత్రి కేటీఆర్




మాక్‌డ్రిల్‌లో ప్రమాదం

- ఐదుగురు అక్టోపస్ కమాండోలకు గాయాలు
- ఒకరి పరిస్థితి విషమం

వివరాలు 3లో

సమస్యలపై రణం



టీ మాస్ ఫోరం రాష్ట్ర ఛైర్మెన్‌గా ఎన్నికైన ప్రొఫెసర్ కంచ ఐలయ్యను అభినందిస్తున్న గద్దర్

- సర్కారుకు 15 రోజుల గడువు...
- ఈలోగా పరిష్కరించాలి.. లేదంటే మరో కార్యాచరణ : టీ మాస్ ఫోరం హెచ్చరిక
- నువ్వు మాతో కలిసి పనిచేయటానికి సిద్ధమేనా..? : పవన్ కళ్యాణ్‌కు ఫోరం నేతల సూటి ప్రశ్న
- 26న అంబేద్కర్ విగ్రహాల వద్ద ప్రతిజ్ఞలు

వివరాలు 9లో

వంద మున్సిపాలిటీలు!

- మొదలైన స్పెషలాఫీసర్ల అన్వేషణ
- వారం రోజుల్లో నివేదిక
- కొత్త పంచాయతీరాజ్ చట్టానికి ముందే ప్రక్రియ పూర్తి

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

రాష్ట్ర ప్రభుత్వం కొత్త మున్సిపాలిటీల ఏర్పాటుకు వేగంగా అడుగులు వేస్తున్నది. ఈ ప్రక్రియ పూర్తయితే రాష్ట్రంలో కార్పొరేషన్లు, మున్సిపాలిటీలు వందకు పెరగనున్నాయి. ప్రస్తుతం రాష్ట్రంలో గ్రేటర్ హైదరాబాద్, గ్రేటర్ వరంగల్, కరీంనగర్ కార్పొరేషన్లకు కలుపుకుని 73 మున్సిపాలిటీలు ఉన్నాయి. కొత్తగా మరో 26 మున్సిపాలిటీలు పెరగనున్నాయి. కొత్త మున్సిపాలిటీల ఏర్పాటుకు ఉన్న అవకాశాలను అధ్యయనం చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం ఉమ్మడి జిల్లాలకు ఒకరి చొప్పున స్పెషలాఫీసర్లను నియమించినట్టు సమాచారం. స్థానిక పరిస్థితులను పరిశీలించడంతోపాటు ఆయా జిల్లాల కలెక్టర్లను కలిసి నివేదిక రూపొందిస్తారు. ఇప్పటికే కొత్త మున్సిపాలిటీల కోసం అన్వేషణ మొదలు పెట్టారు. ప్రభుత్వానికి వారం రోజుల్లో నివేదిక సమర్పించ నున్నారు. దానికి అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా 26 మున్సిపాలిటీలను గుర్తించి, మొత్తంగా రౌండ్ ఫిగర్ వంద చేయాలని నిర్ణయించింది. దీంతోపాటు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకొచ్చే కొత్త పంచాయతీరాజ్ చట్టం నుంచి మున్సిపాలిటీలుగా ప్రకటించే గ్రామాలను మినహాయించేందుకు ఈ ప్రక్రియను వేగం చేస్తున్నది. అందుకే ఒకవైపు కొత్త చట్టానికి తుది మెరుగులు దిద్దుతూనే...మరోవైపు మున్సిపాలిటీలను ప్రకటించడానికి ప్రయత్నిస్తోంది. అర్బనైజేషన్ పెరుగుతున్న నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం నుంచి నిధులు ఎక్కువగా వస్తాయనే ఆలోచనతో ఉన్నట్టు తెలిసింది. బండ్లగూడ, మణికొండ, బాజ్‌పల్లి, నిజాంపేట్, భూత్పూర్, అమరచింత, అమీస్తాన్‌పూర్, చౌటుప్పల్, చేర్యాల, తొర్రూర్ ...9లో

దాదాపు 130 గ్రామాలను కొత్త మున్సిపాలిటీలల్లో విలీనం చేయనుంది. అందుకు 15వేల జనాభా మించిన నియోజకవర్గ కేంద్రాలు, మండల కేంద్రాలను మున్సిపాలిటీలుగా ప్రకటించనున్నట్టు తెలిసింది.

స్వచ్ఛ కార్యక్రమాల్లో హిజ్రాలు

- జరిమానా అధికారులుగా... నియమించే యోచన
- ఆదరించాలని కోరారు : దావోస్ నుంచి మేయర్ రామ్మోహన్



9లో

కుల బహిష్కరణ

- కూతురు ప్రేమ పెండ్లి చేసుకున్నదన్న నెపంతోనే...
- వారితో మాట్లాడిన రెండు కుటుంబాలకూ తప్పని బహిష్కరణ

నవతెలంగాణ-కడెం

ఒకే సామాజిక తరగతి. ఒకరినొకరు ఇష్టపడ్డారు. పెద్దలకు తెలియకుండా పెండ్లి చేసుకున్నారు. అమ్మాయి ఊర్లో విషయం తెలవగానే కులపెద్దలంతా కలిసి ఆ కుటుంబాన్ని కుల బహిష్కరణ చేశారు. ఆ అమ్మాయి కుటుంబంతో మాట్లాడిన మరో ...9లో

పిచ్చకుంట్ల వార్తలెవరు చదువుతరు?

- మంత్రి పద్మారావు అనుచిత వ్యాఖ్యలు
- సికింద్రాబాద్‌లో జర్నలిస్టుల నిరసన
- క్షమాపణ చెప్పాలని డిమాండ్



వివరాలు 9లో



మనకు వేరే గత్యంతరం లేదు.. వాళ్లొస్తే జంప్ చేద్దాం.. మనమొస్తే సర్దుకు పోదాం..!!

ఆఫీసువేర్, కాలేజీ స్టైల్, పెండ్లి, పండుగ ఇలా సందర్భం ఏదైతేనేమి? ఉన్నంతలో ఇంకాస్త సొగసుగా.. స్టైల్‌గా.. మెరవాలని ఎవరికి మాత్రం ఉండదు? కాకపోతే, అందం విషయం వచ్చే సరికి అమ్మాయిలే తహతహలాడతారని ఇప్పటివరకు ఒక అభిప్రాయం ఉండేది. ఐతే, ఇప్పుడు అమ్మాయిలతో పోటీపడుతూ.. ఒక విధంగా అమ్మాయిల కంటే అబ్బాయిలే మరింత ఎక్కువగా తమ అందానికి, హుందాతనానికి మెరుగులు అద్దడానికి తపించిపోతున్నారని తాజా సర్వేలో తేలడం గమనార్హం.

అసోచాం, నీల్సన్ సర్వే

అందం ఖరీదు @ 5వేల కోట్లు

సౌందర్యసాధనాల కోసం పురుషులు ఏటా ఖర్చు

- అమ్మాయిలను ఆకర్షించడం... కెరీర్ ఉన్నతికి 80 శాతం మంది అబ్బాయిలు పాట్లు!
- వస్త్రధారణపై పురుషుల్లో మారుతోన్న దృక్పథం
- గత ఐదేండ్లలో మగవారి సౌందర్య సాధనాల మార్కెట్ 42 శాతం వృద్ధి



వివరాలు 9లో

మందకృష్ణకు బెయిల్ మంజూరు



నవతెలంగాణ-హైదరాబాద్

ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకులు మందకృష్ణ మాదిగకు సికింద్రాబాద్ కోర్టు బెయిల్ మంజూరు చేసింది. ఇటీవల ఓ నిరసన కార్యక్రమంలో రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేశారనే ఆరోపణలతో చిలకలగూడ పోలీసులు మందకృష్ణను అరెస్ట్ చేశారు. మందకృష్ణతో పాటు ఆయన అనుచరులను మరో ఐదుగురిని కూడా పోలీసులు అదుపులోకి ...9లో

మోడీ, యోగికి రక్తంతో లేఖ

• న్యాయం చేయాలని లైంగికదాడి బాధితురాలి వేడుకోలు

లక్నో : తనపై లైంగికదాడికి పాల్పడిన నిందితులపై చర్య తీసుకోవాలని, తనకు న్యాయం చేయాలని కోరుతూ లైంగికదాడి బాధితురాలు ప్రధాని నరేంద్రమోడీ, యూపీ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్‌కు తన రక్తంతో లేఖ రాశారు. 'నిందితులపై పోలీసులు చర్యలు తీసుకోవడంలేదు. కేసు ఉపసంహరించుకోవాల్సిందిగా నాపై ఒత్తిడి తెస్తున్నారు. నాకు న్యాయం చేయండి. లేదంటే.. నాకు ఆత్మహత్యే శరణ్యం' అని ఈ నెల 20న రాసిన లేఖలో ఆమె పేర్కొన్నారు. బాధితురాలి తండ్రి ఇచ్చిన ఫిర్యాదు నేపథ్యంలో 2017 మార్చి 24న యూపీలోని బారబంకిలో అంకిత్ వర్మ, దివ్య పాండేలపై ఎఫ్ఐఆర్ నమోదుచేసినట్టు ఎస్పీ శశి శేఖర్ సింగ్ చెప్పారు. ఇంజినీరింగ్ విద్యార్థి అయిన తన సహచరుడిపై లైంగికదాడికి పాల్పడినవారు.... అప్పటి నుంచి ఆమెను బ్లాక్‌మెయిల్ చేస్తున్నారని బాధితురాలి తండ్రి ఫిర్యాదులో పేర్కొన్నారు. కాగా, ప్రధానికి, ముఖ్యమంత్రికి బాధితురాలి లేఖపై ఎస్పీని విలేకరులు ప్రశ్నించగా దాని గురించి తన వద్ద ఎలాంటి సమాచారం లేదన్నారు.

యూపీలో దళిత బాలిక సజీవ దహనం

లక్నో : 19 సంవత్సరాల దళిత యువతిని సజీవ దహనం చేసిన సంఘటన ఉత్తరప్రదేశ్‌లోని ప్రతాప్‌గఢ్ జిల్లా, లాల్‌గంజ్ ప్రాంతంలో వెలుగులోకివచ్చింది. పాత కక్షలతో అదే ప్రాంతానికి చెందిన ఇద్దరు వ్యక్తులు (తండ్రీ కొడుకులు) ఈ దారుణానికి పాల్పడ్డారు. ఒంటరిగా ఇంట్లో ఉన్న సమయంలో ఆమెపై కిరోసిన్ పోసి నిప్పంటించారని పోలీసులు తెలిపారు. 80 శాతం కాలిన గాయాలైన మైథిలీలాల్ కుమార్తె అంజు ఆస్పత్రిలో మృతిచెందినట్టు చెప్పారు. లాల్‌గంజ్ ప్రాంతానికి చెందిన ఈ కేసులో తండ్రికొడుకులు కల్లు, దీపులను పోలీసులు అరెస్టు చేశారు. మృతురాలి సోదరుడు బచ్చన్‌తో నిందితులకు పాత కక్షలు వున్నాయి. పాత కక్షలతో మైథిలీలాల్, అతని కుటుంబ సభ్యులను హత్య చేస్తామని నిందితులు కొంతకాలంగా బెదిరిస్తున్నారు.

సుప్రీం న్యాయమూర్తులుగా ఇందు మల్హోత్రా, కేఎం.జోసెఫ్

• కేంద్రానికి సిఫారసు చేసిన కొలీజియం

న్యూఢిల్లీ : సుప్రీం న్యాయమూర్తులుగా సీనియర్ న్యాయవాది ఇందు మల్హోత్రా, ఉత్తరాఖండ్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి కేఎం.జోసెఫ్ పేర్లను సిఫారసు చేస్తూ కొలీజియం, కేంద్ర ప్రభుత్వానికి పంపించింది. ఓ మహిళా న్యాయవాది (ఇందు మల్హోత్రా) నేరుగా సుప్రీం న్యాయమూర్తి పదవిని అందుకోవటం చరిత్రలో ఇదే మొదటిసారి. ఈమె రాకతో సుప్రీంకోర్టులో మహిళా న్యాయమూర్తుల సంఖ్య రెండుకు పెరుగుతుంది. సుప్రీం ప్రధాన న్యాయమూర్తి దీపక్ మిశ్రా, ఇతర సీనియర్ న్యాయమూర్తులకు మధ్య తలెత్తిన వివాదం ఎంత సంచలనం సృష్టించిందో అందరికీ తెలిసిందే. జనవరి 12న నలుగురు సీనియర్ న్యాయమూర్తులు జస్టిస్ చలమేశ్వర్, రంజన్ గొగోయ్, మదన్ బీ.లోకూర్, కురియన్ జోసెఫ్‌లు మీడియా సమావేశం ఏర్పాటుచేసి సుప్రీం చీఫ్ దీపక్ మిశ్రా తీరుపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. సరిగ్గా దీనికి ఒక్క రోజు ముందు, జనవరి 11న సుప్రీంకోర్టు కొలీజియం ఇందు మల్హోత్రా, కేఎం.జోసెఫ్ ఎంపికను దాదాపు ఖాయం చేసింది. అయితే తాజాగా వీరి పేర్లను అధికారికంగా ప్రకటిస్తూ, కేంద్ర ప్రభుత్వానికి సుప్రీం సిఫారసులు పంపింది.

బీజేపీతో శివసేన తెగతెంపులు..

• లోక్‌సభ, మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో ఒంటరిగా పోటీకి నిర్ణయం

ముంబయి : దాదాపు 29 ఏండ్లపాటు బీజేపీకి మిత్రపక్షంగా వ్యవహరించిన శివసేన ఆ పార్టీతో తెగతెంపులు చేసుకుంది. 2019 లోక్‌సభ, మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లోనూ ఒంటరిగా పోటీ చేయాలని నిర్ణయించింది. ముంబయిలోని ఎన్‌ఎస్‌సీఐ (గ్రౌండ్)లో మంగళవారం సమావేశమైన ఆ పార్టీ జాతీయ కార్యవర్గం ఒంటరిగా వెళ్లాలని నిర్ణయం తీసుకుంది. '2019 సాధారణ ఎన్నికల్లో మేము ఒంటరిగానే పోటీ చేస్తాం' అని శివసేన సీనియర్ నేత సంజయ్ రౌత్ చెప్పారు. 'బీజేపీతో సైద్ధాంతిక కూటమిగా ఉన్నాం. కానీ, మమ్మల్ని బ్లాక్‌మెయిల్ చేసేందుకు ఏ ఒక్క చిన్న అవకాశాన్ని కూడా ఆ పార్టీ వదులుకోలేదు' అని రావత్ విమర్శించారు.

అధికారిక సమాచారంలో 'దళిత్' అనే పదాన్ని వాడకండి

• రాష్ట్రాలు, కేంద్రానికి మధ్యప్రదేశ్ హైకోర్టు ఆదేశం
• రాజ్యాంగంలో ఎక్కడా ఈ పదం కనిపించదంటూ వ్యాఖ్య

భోపాల్ : అధికారికంగా ఇచ్చే సమాచారంలో 'దళిత్' అనే పదాన్ని ఉపయోగించరాదని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను మధ్యప్రదేశ్ హైకోర్టు తెలిపింది. అందుకు బదులుగా "షెడ్యూల్డ్ కులాలు" లేదా "షెడ్యూల్డ్ తెగలు" పదాలను వాడాలని సూచించింది. భారత రాజ్యాంగంలో ఆ పదం ప్రస్తావన ఎక్కడా లేదని గ్వాలియర్ ధర్మాసనం పేర్కొంది. అధికారిక మరియు అనధికారికంగా ఇచ్చే సమాచారంలో ఆ పదం వినియోగానికి వ్యతిరేకంగా సామాజిక కార్యకర్త మోహన్ లాల్ మొహార్ గత డిసెంబర్‌లో ప్రజాప్రయోజన వ్యాజ్యాన్ని దాఖలు చేశారు. ఈ పిల్ విచారణ సందర్భంగా కోర్టు పై ఆదేశాలు జారీచేసింది. 'దళిత్ అనే పదం అమర్యాదపూర్వకమైంది. షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగల వారిని అవమానించడానికి అగ్రకులాలు దీనిని వాడుకలోకి తెచ్చారు' అని పిటిషనర్ ఆరోపించారు.

త్రిపురలో వరుసగా ఆరోసారి వామపక్ష ప్రభుత్వమే : సీపీఐ నేత డి.రాజా

న్యూఢిల్లీ: త్రిపురలో వరుసగా ఆరోసారి వామపక్ష ప్రభుత్వం ఏర్పాటు కావడం ఖాయమని సీపీఐ నేత, రాజ్యసభ సభ్యుడు డి.రాజా అన్నారు. వామపక్ష ప్రభుత్వం అధికారంలో ఉన్న ఈశాన్య రాష్ట్రంలో కాలు మోపేందుకు బీజేపీ తీవ్రంగా ప్రయత్నిస్తున్నదని ఆయన అన్నారు. ఆ పార్టీ కేంద్రంలో అధికారంలో ఉన్నందున రాష్ట్రంపై తన ప్రభావాన్ని చూపేలా ఎక్కడా కనిపించడం లేదని ఆయన వివరించారు. ఫిబ్రవరి 18న త్రిపుర అసెంబ్లీకి ఎన్నికలు జరగనున్న విషయం తెలిసిందే.

1993 నుంచి 2013 వరకు వరుసగా ఐదు ఎన్నికల్లో సీపీఐ(ఎం) నేతృత్వంలోని వామపక్ష పార్టీలు ఆ రాష్ట్రంలో విజయం సాధిస్తూ వచ్చాయి. అంతకుముందు 1978 నుంచి 1988 వరకు వామపక్ష ప్రభుత్వమే అక్కడ అధికారంలో కొనసాగింది. అయితే 1988 నుంచి 1993 వరకు ఐదేండ్లు మాత్రమే అక్కడ కాంగ్రెస్ అధికారంలో ఉన్నది.

త్వరలోనే వైమానిక దళంలోకి ఇద్దరు మహిళలు..!

• శిక్షణ పూర్తి చేసుకున్న అవనీ చతుర్వేది, భావనాకాంత్

న్యూఢిల్లీ: భారత వైమానిక దళంలో ఇద్దరు మహిళలకు త్వరలోనే చోటు కల్పించనున్నారు. ఫ్లయింగ్ ఆఫీసర్లు అవనీ చతుర్వేది, భావనాకాంత్‌లను యుద్ధ విమాన పైలట్లుగా విధుల్లోకి తీసుకోనున్నారు. గంటకు 340 కి.మీ. వేగంతో వెళ్లే సూపర్‌సానిక్ జెట్ ఫైటర్ మిగ్-21 బైసన్‌ను నడపడంలో వీరిద్దరూ శిక్షణ పూర్తి చేసుకుని రెండు దశల పరీక్షలకు సిద్ధమయ్యారు. ఇప్పటికే సూరత్‌గఢ్ వైమానిక స్థావరంలో అర్హత పొందిన మార్గదర్శకుడి సమక్షంలో రెండు సీట్ల మిగ్-21ను నడపడంలో అవని పరిణతిని సాధించింది. ఆ తర్వాత ఆమె ఒంటరిగా యుద్ధ విమానాన్ని నడపడంలో పలు పరీక్షలను ఎదుర్కోవాల్సి ఉంటుంది. అనంతరం వైమానిక స్థావరంలో భావనకు తొలిదశ పరీక్ష త్వరలోనే ప్రారంభం కానున్నది. మోహన అనే మరో మహిళ కూడా యుద్ధ విమానాలను నడపడంలో శిక్షణ పొందుతున్నారు. వైమానిక దళంలోకి మహిళలను చేర్చుకునే ప్రక్రియ వేగంగా సాగుతున్నదని ఆర్మీ చీఫ్ జనరల్ బిపిన్ రావత్ గతేడాది ప్రకటించారు. మొదటి దశలో ప్రయోగాత్మకంగా ప్రతిపాదించిన విధంగా కేంద్ర ప్రభుత్వం మహిళలను విధుల్లో చేర్చుకోవాలన్న ఆలోచనలో ఉందని ఆ సందర్భంగా ఆయన తెలిపారు.

గుండ్లతో నిరసన... టీచర్లపై చర్యలకు ఆదేశం

మధ్యప్రదేశ్ ప్రభుత్వ వివాదాస్పద నిర్ణయం



భోపాల్ : దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ టీచర్లు పలు విడతలుగా ఆందోళన చేపట్టారు. ప్రభుత్వంలో మాత్రం చలనం లేదు. విసిగిపోయిన ఉపాధ్యాయులు ఇటీవల గుండ్లు గీయించుకుని మరీ వినూత్న ఆందోళనల్లో పాల్గొన్నారు. అందులో మహిళా ఉపాధ్యాయులు కూడా ఉండటం గమనార్హం. అప్పటికైనా ప్రభుత్వంలో చలనం వస్తుందేమోనన్న ఒక చిన్న ఆశ వారిని ఆ ఆందోళన బాట పట్టించింది. వారిని చర్చలకు పిలిచి.. సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాల్సిన ప్రభుత్వం... వివాదాస్పద నిర్ణయం తీసుకుంది. గుండ్లు గీయించుకున్న టీచర్లపై చర్యలకు ఉపక్రమంచింది. ఈ విధమైన నిరసనలను జీర్ణించుకోగల స్థితిలో లేని బీజేపీ పాలిత మధ్యప్రదేశ్ ప్రభుతం వారిపై చర్యలకు ఉపక్రమించింది. ఈ నెల 13న భోపాల్‌లో కాంట్రాక్టు ఉపాధ్యాయులు ఈ ఆందోళనలో పాల్గొన్నారు. ఆ ఆందోళనలో పాల్గొని గుండ్లు గీయించుకున్న టీచర్లపై చర్యలు తీసుకోవాల్సింది జిల్లా వైద్యాధికారులకు, స్కూల్ ప్రిన్సిపాల్స్‌కు, జిల్లా కలెక్టర్లకు రాష్ట్ర విద్యా కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఆందోళన సమయంలో ఆ ఉపాధ్యాయులకు వేతనాలు చెల్లించరాదని కూడా అధికారులను ప్రభుత్వం ఆదేశించింది. 'ఉత్తర్వులను ఉల్లంఘించిన వారిపై కఠినమైన క్రమశిక్షణా చర్యలు తీసుకోండి. సమ్మెలో ఉన్న కాలంలో ఆ ఉపాధ్యాయులకు వేతనాలు చెల్లించరాదు' అంటూ ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వుల్లో పేర్కొంది.

ప్రభుత్వం ఎన్ని ఒత్తిడిలు తెచ్చినా లొంగేది లేదు : ఉపాధ్యాయులు

ప్రభుత్వం తమపై తెచ్చే ఎలాంటి ఒత్తిడికీ లొంగేది లేదని, తమ సమస్యలు పరిష్కారం అయ్యే వరకూ ఆందోళన కొనసాగిస్తామని ఉపాధ్యాయులు స్పష్టం చేశారు. గుండ్లు గీయించుకున్న ఉపాధ్యాయులపై చర్యలు తీసుకోవాల్సిందిగా జారీ చేసిన ఆదేశాలపై కాంట్రాక్టు ఉపాధ్యాయులు మండిపడుతున్నారు. రాజ్‌గఢ్, బేతుల్ ప్రాంతాల్లో ఉపాధ్యాయులు మరోసారి గుండ్లు గీయించుకుని తాజా ఉత్తర్వులకు వ్యతిరేకంగా నిరసనల్లో పాల్గొన్నారు. 'మేం నష్టపోవడానికి ఏమీ లేదు, మేము అందించే సేవలకు చాలా తక్కువ జీతం చెల్లిస్తున్నారు. సమాన పనికి సమాన వేతనాన్ని మేం అడుగుతున్నాం. ప్రభుత్వం మమ్మలను ఉద్యోగాల నుండి తొలగించాలని చూస్తోంది. అలా తొలగిస్తే.. నష్టపోయేది విద్యార్థులే' అని భోపాల్‌లో ఆందోళనలో భాగం పంచుకుంటున్న ఉపాధ్యాయుడు వ్యాఖ్యానించారు.

సోషల్ హల్‌చల్

బెంగళూరు సిటీ రైల్వే స్టేషన్ ఫ్లాట్ ఫాం వద్దకు మాజీ ప్రధాని దేవెగౌడ తన కారును తెప్పించుకున్నారు. రైలును ఆయన బెడ్ రూమ్ వరకూ తీసుకెళ్ళలేదు అందుకు ఆయనకు మనం కృతజ్ఞతలు చెప్పాలి....

©Indian Citizen



ఏకకాలంలో ఎన్నికలు సాధ్యమే

ఆలోచించాకే అనర్హత వేటు: ఆప్ ఎమ్మెల్యేల నిర్ణయంపై నూతన సీఈసీ రావత్

• కేంద్ర ఎన్నికల కార్యాలయంలో బాధ్యతల స్వీకరణ



నవతెలంగాణ-న్యూఢిల్లీబ్యూరో : ఏకకాలంలో ఎన్నికలు నిర్వహించడంపై రాజకీయ పార్టీల నుంచి వస్తున్న ప్రతిపాదనలతో రావత్ ఏకీభవించారు. లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికలను ఏకకాలంలో చేపట్టేందుకు ఎన్నికల కమిషన్ సిద్ధమేనని అన్నారు. స్వేచ్ఛగా, నిష్పక్షపాతం ఎన్నికలను కమిషన్ నిర్వహిస్తోందనీ, ఏకకాలంలో ఎన్నికల నిర్వహణకు ఈసీకి అసాధ్యమైనదేమీ కాదని అన్నారు.

ఆమాద్మీపార్టీకి చెందిన 20 మంది ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయాలని కేంద్ర ఎన్నికల సంఘం తీసుకున్న నిర్ణయాన్ని నూతన ఎన్నికల ప్రధాన కమిషనర్ ఓపీ రావత్ సమర్థించారు. 'చాలా లోతుగా పరిశీలించిన తరువాతే ఇలాంటి(అనర్హత వేటు) అంశాలపై ఎన్నికల సంఘం నిర్ణయం తీసుకుంటుంది. ఈ నిర్ణయంలో లోపాలు లేవు' అని అన్నారు. మంగళవారం ఢిల్లీలోని ఎన్నికల ప్రధాన కార్యాలయంలో నూతన ప్రధాన ఎన్నికల కమిషనర్‌గా ఓపీ రావత్ బాధ్యతలు స్వీకరించారు. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ దీపక్‌మిశ్రా ప్రమాణం చేయించారు. సోమవారం పదవీ విరమణ చేసిన మాజీ ఎన్నికల కమిషనర్ ఏకే జోతి స్థానంలో రావత్ బాధ్యతలు స్వీకరించారు. రావత్ పదవీకాలం ఈ యేడాది డిసెంబర్‌తో ముగియనుంది. మధ్యప్రదేశ్ కేడర్‌కు చెందిన రావత్.. 2015 ఆగస్టులో ఎన్నికల కమిషనర్‌గా నియమితులయ్యారు. సాధారణంగా సీఈసీ పదవీకాలం ఆరు సంవత్సరాలు. కానీ ఓపీ రావత్‌కు డిసెంబర్ 2018తో 65 సంవత్సరాలు పూర్తికానున్నాయి. ఇక ఎన్నికల కమిషనర్‌గా అశోక్ లవాసా కూడా బాధ్యతలు స్వీకరించారు.

బీజేపీ వ్యక్తిగా ముద్ర

నూతన సీఈసీ ఓపీ రావత్ బీజేపీ వ్యక్తిగా ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. 2004లో ఆయన మధ్యప్రదేశ్ సీఎంకు ప్రధాన కార్యదర్శిగా పని చేశారు. ఆప్ ఎమ్మెల్యేల అనర్హత విచారణ సమయంలో.. ఇదే ఆరోపణలపై కేసు విచారణ నుంచి తనకు తానుగా తప్పుకున్నారు. అయితే తమకు ఎలాంటి సమాచారమూ ఇవ్వకుండా మళ్లీ కేసు విచారణలో భాగస్వామి అయ్యారని ఆప్ ఆరోపిస్తోంది.

ఖాప్ పంచాయితీగా ఈసీ : ఆమాద్మీ పార్టీ ఆరోపణ

కేంద్ర ఎన్నికల సంఘం ఖాప్ పంచాయితీగా మారిందని ఆమాద్మీపార్టీ ఆరోపించింది. పైగా ఓపీ రావత్‌కు బీజేపీతో ఉన్న సంబంధాలను లేవనెత్తింది. నూతన సీఈసీగా ఓపీ రావత్ బాధ్యతలు స్వీకరించిన నేపథ్యంలో... ఆమాద్మీ పార్టీ అధికార ప్రతినిధి రాఘవ్ చద్దా మంగళవారం మీడియాతో మాట్లాడారు. మధ్యప్రదేశ్ సీఎం శివరాజ్‌సింగ్ చౌహాన్‌తో పాటు చాలా మంది బీజేపీ నేతలతో రావత్‌కు సంబంధాలున్నాయని అన్నారు. పైగా ఆరు నెలల క్రితం ఆమాద్మీపార్టీ ఎమ్మెల్యేలకు, పార్టీకి సమాచారం ఇవ్వకుండా అనర్హత కేసులో భాగస్వామి అయ్యారని పేర్కొన్నారు. 'ఒక కేసు నుంచి న్యాయమూర్తి తప్పుకుని.. మళ్లీ దొడ్డిదారి గుండా భాగస్వామి కావడం భారతదేశ చరిత్రలో ఇదే మొదటిసారి' అని ఆరోపించారు.

కేరళ లవ్ జిహాద్ కేసు

ఆ హక్కు ఆమెకుంది

• ఆమె వైవాహిక జీవితంలో జోక్యం చేసుకోవద్దు : సుప్రీంకోర్టు సంచలన వ్యాఖ్యలు



న్యూఢిల్లీ : కేరళ లవ్ జిహాద్ కేసులో సుప్రీం కోర్టు సంచలన వ్యాఖ్యలు చేసింది. 'లవ్ జిహాద్' పేరుతో ఆమె వైవాహిక జీవితంపై దర్యాప్తు చేస్తున్న ఎన్ఐఏకు అక్షింతలు వేసింది. హదియా ఎవరితో జీవించాలనే నిర్ణయం తీసుకునే హక్కు ఆమెకు మాత్రమే ఉందని అత్యున్నత న్యాయస్థానం స్పష్టం చేసింది. 'మీరు (ఎన్ఐఏ) ఏ విషయమైనా దర్యాప్తు చేసుకోవచ్చు. కానీ, మైనార్టీ తీరిన మహిళ వైవాహిక జీవితంలో జోక్యం చేసుకునే న్యాయబద్ధత మాత్రం మీకు' లేదు అని సుప్రీంకోర్టు ధర్మాసనం వ్యాఖ్యానించింది. 'హదియా మేజర్. ఎవరితో జీవించాలన్న నిర్ణయం తీసుకున్న హక్కు ఆమెకే ఉంటుంది. ఆమె ఇష్టపూర్వకంగా పెండ్లి చేసుకుంటే.. దానికి కోర్టులు ఏం చేయాలి?' అని సుప్రీంకోర్టు ప్రశ్నించింది. కాగా జహాన్ కుటుంబం తన కుమార్తెను 'అక్రమంగా నిర్బంధించారు' అని హదియా తండ్రి ఆరోపించగా, ఆ అంశంపై హదియా నిర్ణయం తీసుకుంటుందన్నారు. 'అక్రమ నిర్బంధమా కాదా అన్నదానికి హదియా మాత్రమే సమాధానం ఇవ్వాలి. భద్రత, నేరపూరిత కుట్ర అనేది పెండ్లి అంశం నుంచి వేరుచేసి చూడాలి' అని తెలిపింది. అనంతరం తదుపరి విచారణను ఫిబ్రవరి 22కు కోర్టు వాయిదా వేసింది. కేరళకు చెందిన అఖిల ఆశోకన్(25) అనే యువతి గతేడాది డిసెంబర్‌లో మతపార్పిడితో హదియాగా పేరు మార్చుకుని షఫీన్ జహాన్‌ను వివాహం చేసుకుంది. అఖిల తండ్రి మాత్రం అది బలవంత మతం మార్పిడి అని ఆరోపిస్తూ హైకోర్టులో వారిపై వ్యాజ్యం దాఖలు చేశారు. చివరకు అది ఎన్ఏఐ దర్యాప్తుకు చేరింది. కాగా, ఈ వ్యవహారం 'లవ్ జిహాద్ కేసు'గా మారి దేశ వ్యాప్తంగా కలకలం రేపింది. ఇక హదియ వివాహాన్ని కేరళ హైకోర్టు రద్దు చేయటంతో ఆమె భర్త షఫీన్ సుప్రీంకోర్టును ఆశ్రయించారు.

పెద్ద డ్యాంలలో నీటి నిల్వ సామర్థ్యం పెరగాలి

• కేంద్ర జలవనరుల శాఖ సహాయ మంత్రి ఆర్జున్‌రాం మేఘూవాల్



తిరువనంతపురం : దేశంలోని పెద్ద డ్యాంలలో నీటి నిల్వ సామర్థ్యం పెరగాలని కేంద్ర జలవనరుల శాఖ సహాయ మంత్రి ఆర్జున్‌రాం మేఘూవాల్ అన్నారు. డ్యాంల రక్షణపై రెండ్రోజుల పాటూ జరిగే అంతర్జాతీయ సదస్సును ఆయన మంగళవారం ఇక్కడ ప్రారంభించారు. డ్యాంలలో పూర్తిస్థాయి సామర్థ్యంతో నీటిని నిల్వ చేయటం ద్వారా పెరుగుతున్న నీటి అవసరాలను తీర్చటంతో పాటూ ఆర్థికాభివృద్ధి కూడా సాధ్యమవుతుందని అభిప్రాయపడ్డారు. దేశంలోని నదుల్లో నీటి ప్రవాహం 690 బిలియన్ క్యూబిక్ మీటర్లు కాగా ఇప్పటి వరకూ నిర్మించిన డ్యాంలలో 300 బిలియన్ క్యూబిక్ మీటర్ల కన్నా తక్కువ నీటిని మాత్రమే నిల్వ చేసుకోగలుగుతున్నామన్నారు. ప్రజల అవసరాలను తీర్చటానికి దేశ వ్యాప్తంగా కొత్త డ్యాంలు నిర్మించాల్సిన అవసరం ఉందన్నారు. దేశంలోని ప్రతి డ్యాంను రక్షించుకోవాల్సిన తక్షణ అవసరం ఉందని అన్నారు. దేశంలోని 80 శాతం డ్యాంలు 25 సంవత్సరాలకు పూర్వం నిర్మించినవేనన్నారు. దేశ వ్యాప్తంగా 4,254 డ్యాంలు ఉండగా మరో 447 డ్యాంలు నిర్మాణంలో ఉన్నాయని తెలిపారు. డ్యాంలను పటిష్ఠంగా ఉంచుకోవటం ఎంతో ప్రాధాన్యత కలిగిన అంశంగా ఆయన అభివర్ణించారు. ప్రపంచ బ్యాంకు నిధులతో వివిధ రాష్ట్రాల్లోని 600 డ్యాంలను రెండవ దశలో పటిష్ఠ పరచనున్నట్టు ఆయన వివరించారు. రెండవదశ కార్యక్రమం కోసం 18 రాష్ట్రాలు ఇప్పటికే ప్రతిపాదనలు పంపాయన్నారు. కేంద్ర జలసంఘం చైర్మెన్ మసూద్ హుస్సేన్ మాట్లాడుతూ మొదటి దశలో దేశంలోని 7 రాష్ట్రాల్లో 223 డ్యాంలను 3,466 కోట్లతో పటిష్ఠపరుస్తున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమం 2020 వరకూ జరుగుతుంన్నారు. కొత్త డ్యాంల నిర్మాణానికి పర్యావరణ వాదుల నుంచి వ్యతిరేకత వ్యక్తమవుతున్నం దువల్ల ఇప్పటికే నిర్మించిన డ్యాంలను రక్షించుకోవాలని కేరళ విద్యుచ్ఛక్తి శాఖ మంత్రి ఎం.ఎం. మణి అన్నారు. డ్యాంల రక్షణ కోసం జారీ చేసిన మార్గదర్శక సూత్రాలను మార్చాలని ఆ రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి మాథ్యూ టి. థామస్ కోరారు. కేంద్ర జల సంఘం, కేరళ రాష్ట్ర ప్రభుత్వం సంయుక్తంగా ప్రారంభించిన ఈ సదస్సులో డ్యాంల రక్షణపై పనిచేస్తున్న పలువురు అంతర్జాతీయ నిపుణులు, ప్రపంచ బ్యాంకు ప్రతినిధులు హాజరయ్యారు.

రెచ్చగొట్టే ప్రసంగాల కేసులో

బీజేపీ నేతలపై కేసుల రద్దుకు యోగి యత్నాలు



లక్నో/న్యూఢిల్లీ : తమ పార్టీ నాయకులపై కేసులను రద్దు చేసేందుకు చేస్తున్న ప్రయత్నాలపై తీవ్ర ఆగ్రహావేశాలు వ్యక్తమౌతున్న నేపథ్యంలో ఉత్తర ప్రదేశ్‌లోని బీజేపీ ప్రభుత్వం వెనక్కి తగ్గింది. కేసుల రద్దు విషయంలో తాము సంబంధిత ప్రక్రియను అనుసరిస్తున్నామని పేర్కొంది. ముజఫర్ నగర్‌లో 2013లో ఘర్షణలు జరగడానికి ముందు రెచ్చగొట్టే ప్రసంగాలు చేసిన బీజేపీ నేతలపై కేసులు నమోదయ్యాయి. ఆ కేసులను ఉపసంహరించాలని కోరుతూ ముజఫర్ నగర్‌లోని అధికారులకు ప్రభుత్వం లేఖ రాసిందని మీడియాలో కథనాలు రావడంతో ఈ అంశం వివాదాస్పదమయ్యింది. దీనిపై ప్రభుత్వం స్పందిస్తూ కేసులు ఉపసంహరించాలని కోరుతూ ఆరోపణలు ఎదుర్కొంటున్న బీజేపీ నాయకులలో ఒకరైన బుధన ఎమ్మెల్యే ఉమేష్ మాలిక్‌తో ఒక దరఖాస్తును పంపామని తెలిపింది. కేసులను వెనక్కి తీసుకోవాలని సీనియర్ పోలీసు సూపరింటెండెంట్ ఆలోచిస్తున్నారా? ప్రజా ప్రయోజనాల కోసం వాటిని ఉప సంహరించుకోవాలని జిల్లా మెజిస్ట్రేట్ ఆలోచిస్తున్నారా? అని ఆ లేఖలో ప్రశ్నించారు. ఆ లేఖపై న్యాయ శాఖ స్పెషల్ సెక్రటరి రాజేష్ సింగ్ సంతకం ఉంది. మొత్తం మీద ఐదుగురు ప్రముఖ బిజెపి, సంఘ్ పరివార్ నేతలపై అసభ్యకర ప్రసంగాలు చేశారన్న అభియోగాలపై నమోదైన 9 ఎఫ్ఐఆర్‌లను ఉప సంహరించుకోవడంపై అది తన అభిప్రాయాన్ని కోరింది. మాలిక్‌తో పాటు ముజఫర్‌నగర్ బీజేపీ ఎంపీ సంజీవ్ బలియాన్, షమ్లీ బీజేపీ ఎమ్మెల్యేల సురేష్ రాణా, బిజ్నోర్ బీజేపీ ఎంపీ భరతేంద్రసింగ్, విశ్వహిందూ పరిషత్ సభ్యుడు సాధ్వి ప్రాచీలపై రెచ్చగొట్టే ప్రసంగం చేసినట్టు అభియోగాలున్నాయి. తమపై తప్పుడు కేసులు పెట్టారని, అందువలనే వాటిని ఉపసంహరించాలని కోరుతూ తాను రాష్ట్ర ప్రభుత్వానికి లేఖ రాశానని మాలిక్ అంటున్నారు.. తమకు లేఖఅందిందని, సంబంధిత అధికారుల పరిశీలనకు పంపామని ముజఫర్ నగర్ అడిషనల్ జిల్లా మెజిస్ట్రేట్ హరీష్ చంద్ర తెలిపారు.

లోయా మృతి కేసు

పేర్ల ప్రస్తావనపై కోర్టు ఆగ్రహం

న్యూఢిల్లీ సీబీఐ ప్రత్యేక కోర్టు న్యాయమూర్తి బీహెచ్ లోయా మరణంపై సుప్రీం కోర్టులో సోమవారం జరిగిన విచారణ సమయంలో వాదనలు ఒక దశలో పరస్పరం తీవ్ర ఆరోపణలు చేసుకునే స్థాయికి చేరింది. వాదనల్లో భాగంగా బీజేపీ అధినేత అమిత్ షా పేరును న్యాయవాదులు ప్రస్తావించడంపై సుప్రీం కోర్టు అసంతృప్తి వ్యక్తంచేసింది. సొహ్రాబుద్దీన్ బూటకపు ఎన్‌కౌంటర్ కేసు విచారణలో ఉండగా సీబీఐ కోర్టు జడ్జి లోయా మరణించడం అనేక అనుమానాలకు దారితీసింది. ముఖ్యంగా లోయా స్థానంలో నియమితులైన జడ్జి విచారణ చేపట్టిన వెంటనే అమిత్ షాను నిర్దోషిగా ప్రకటించడం వివాదాస్పదమైంది. ఆయన మరణంపై కోర్టు పర్యవేక్షణలో సీబీఐ దర్యాప్తు అవసరమని పిటిషనర్లు వాదిస్తున్నారు. ఈ సందర్భంలో అమిత్ షా పేరును పదేపదే ప్రస్తావించడంపై న్యాయస్థానం స్పందించింది. ప్రస్తుతానికి ఆయనది (లోయా) సహజ మరణం అనుకుందాం. ఉన్నత పదవుల్లో ఉన్న వారిపై అనుమానాలు వ్యక్తంచేసే ధోరణిసరికాదు అని చీఫ్ జస్టిస్ దీపక్ మిశ్రా నాయకత్వంలోని ధర్మాసనంలో ఒకరైన న్యాయమూర్తి వైవి చంద్రచూడ్ పిటిషనర్ల తరపు న్యాయవాది దుష్యంత్ దావెకు సూచించారు. బొంబాయి లాయర్స్ అసోసియేషన్ తరపున ఆయన వాదిస్తున్నారు. తన వాదన వినిపించే క్రమంలో ఆయన అమిత్ షా పేరు పదేపదే ప్రస్తావించడాన్ని కోర్టు తప్పుపట్టింది. దావె తన వాదనలో మహారాష్ట్ర సర్కారు తరపున వాదనకు వచ్చిన హరీశ్ సాల్వే, ముకుల్ రోహ్తగిలపై అభ్యంతరాలు వ్యక్తంచేసారు.

కాశ్మీర్‌పై మధ్యవర్తిత్వం వహించం : ఐరాస

ఐక్యరాజ్య సమితి : అన్ని పక్షాల అంగీకారం లేకుండా కాశ్మీర్ విషయంలో మధ్యవర్తిత్వం వహించేది లేదని ఐక్యరాజ్య సమితి ప్రధాన కార్యదర్శి ఆంటోనియో గుటెర్రెస్ అన్నారు. తమ మధ్య ఉన్న అపరిష్కృత సమస్యలను చర్చల ద్వారా పరిష్కరించుకోవాలని భారత్, పాకిస్తాన్‌లను కోరారు. సరిహద్దుల్లో ఉద్రిక్తతలు పెరుగుతున్న నేపథ్యంలో గుటెర్రెస్ మంగళవారం ఆ అంశంపై మాట్లాడారు. మధ్యవర్తిత్వం నిర్వహించేందుకు ఐరాస ప్రధాన కార్యదర్శి అందుబాటులోనే ఉంటారని, అయితే ముందుగా ఇరు పక్షాలు ఇందుకు అంగీకారం తెలపాల్సి వుందని గుటెర్రెస్ ప్రతినిధి స్టీఫెన్ డుజార్రిక్ తెలిపారు.

విడుదల నిర్ణయంలో ఎలాంటి మార్పూ లేదు

• 'పద్మావత్'పై తేల్చిచెప్పిన సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ : 'పద్మావత్'కే సుప్రీం మద్దతు లభించింది. తమ రాష్ట్రంలో విడుదలను నిలిపివేయాలంటూ రాజస్థాన్; మధ్యప్రదేశ్ దాఖలు చేసిన పిటిషన్లపై విచారణకు సుప్రీంకోర్టు మంగళవారం తిరస్కరించింది. సినిమా విడుదలకు సంబంధించి గతంలో ఇచ్చిన ఉత్తర్వులను ఎట్టిపరిస్థితుల్లోనూ మార్చబోమని స్పష్టం చేసింది. అత్యున్నత న్యాయస్థానం జారీ చేసిన ఆదేశాలకు కట్టుబడి ఉండాలన్న విషయాన్ని ప్రజలు అర్థం చేసుకోవాలని జస్టిస్ దీపక్ మిశ్రా నేతృత్వంలోని ధర్మాసనం వ్యాఖ్యానించింది. శాంతిభద్రతలను పరిరక్షించడం రాష్ట్రాల బాధ్యత. ఆ బాధ్యతను నిర్వర్తించలేమని చేతులెత్తేయడం సరికాదనీ తెలిపింది. దీంతో ఈ నెల 25న 'పద్మావత్' దేశవ్యాప్తంగా విడుదలకు మార్గం సుగమమైంది.

థియేటర్లకు మేం భద్రత కల్పించలేం : మధ్యప్రదేశ్ సీఎం

శాంతిభద్రతల పరిరక్షణ బాధ్యత రాష్ట్రాలదేనంటూ సుప్రీంకోర్టు ఒకపక్క తీవ్రంగా స్పందించినప్పటికీ మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి మాత్రం థియేటర్లకు తాము భద్రత కల్పించలేమంటూ వ్యాఖ్యానించారు. సినిమా విడుదలకు సంబంధించి ఉత్తర్వులను సవరించాలంటూ దాఖలుచేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు కొట్టివేసిన నేపథ్యంలో ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ మంగళవారం ఈ వ్యాఖ్యలు చేశారు. సుప్రీంకోర్టు ఆదేశాలను పూర్తిగా చదివిన తర్వాత దానిపై స్పందిస్తానని చెప్పారు. ఇది ఒక్క శాంతి భద్రతల సమస్యే కాదనీ, అత్యధికమంది ప్రజల మనోభావాలకు సంబంధించిన అంశమని చౌహాన్ అన్నారు.

కష్టాల్లో గుజరాత్ పాడి పరిశ్రమ

అహ్మదాబాద్ : గుజరాత్‌లో పాడి పరిశ్రమ పీకల్లోతు కష్టాల్లో కూరుకుపోయింది. ఇటీవలె రాష్ట్రంలోని పత్తి రైతులు, వేరు శనగ రైతులు తమ సాగు ఫలానికి సరైన ధరలు రాక తీవ్రంగా నష్టపోయిన విషయం తెలిసిందే. అదే విధంగా, ఇప్పుడు పాడి పరిశ్రమ సమస్యల్లో చిక్కుకుంది. అంతర్జాతీయంగా పాలపొడి ధరలు దిగజారిపోవటం వారికి నష్టాలు తెచ్చిపెడుతోంది. పాల సంఘాల దగ్గర పాల నిల్వలు పెరిగిపోతున్నాయి. అదే సమయంలో పాల సంఘాలు పాల సేకరణకు తక్కువ ధరలు చెల్లించక తప్పడం లేదు. కిలో లీటరు కొవ్వు ఉన్న పాల సేకరణ ధరను రూ. 647 నుంచి రాజ్‌కోట్ డెయిరీ రూ. 560 లకు తగ్గించివేసింది. అంతేకాక వారంలో ఒక రోజు ఉదయం వేళ పాల సేకరణను పూర్తిగా నిలిపివేస్తున్నది. జిల్లావ్యాప్తంగా ఉన్న 761 గ్రామ ప్రాంత సొసైటీల ద్వారా ఇక్కడి నుంచి గుజరాత్ కోఆపరేటివ్ మిల్క్ మార్కెటింగ్ ఫెడరేషన్‌కు రోజుకు 4.5 లక్షల కిలోల పాలను సరఫరా చేస్తున్నది. ప్రస్తుతం రోజుకు 45వేల లీటర్ల పాల సేకరణను ఈ డెయిరీ నిలిపివేస్తున్నది. ఎందుకంటే గుజరాత్ ఫెడరేషన్ దగ్గర నిల్వలు విపరీతంగా ఉంటున్న కారణంగా సరఫరా క్రమబద్ధం చేయాలని తమకు ఆదేశాలు అందినట్టు రాజ్‌కోట్ యూనియన్ అధ్యక్షుడు గోవింద్ భాయ్ రణప్రియ తెలిపారు.



జాతర పనులకు డెడ్‌లైన్

జనవరి -2018
25

సమ్మక్కసారలమ్మ జాతరకు కోటీ25లక్షల మంది వచ్చే అవకాశం

- ఉపరాష్ట్రపతి, గవర్నర్‌కు ఆహ్వానం: ఉప ముఖ్యమంత్రి కడియం శ్రీహరి, మంత్రులు


మాట్లాడుతున్న మంత్రి కడియం

నవతెలంగాణ-ములుగు

మేడారం సమ్మక్క-సారలమ్మ జాతర పనులను ఈ నెల 25 కల్లా పూర్తిచేయాలని అధికారులను డిప్యూటీ సీఎం కడియం శ్రీహరి ఆదేశించారు. ఈ సారి కోటీ25లక్షలమంది సందర్శకులు రానున్నట్టు చెప్పారు. గిరిజన సంక్షేమ, పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి అజ్మీరా చందూలాల్, దేవాదాయ శాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి, రవాణా శాఖ మంత్రి మహేందర్‌రెడ్డితో కలిసి ఆయన మేడారంలో మంగళవారం పర్యటించారు. ఈ సందర్భంగా మంత్రులు పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేసి ప్రారంభించారు. అనంతరం ఐటీడీఏ క్యాంపు కార్యాలయంలో ఇన్‌చార్జి కలెక్టర్ కర్ణన్ అధ్యక్షతన సమీక్ష నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఉప ముఖ్యమంత్రి శ్రీహరి మాట్లాడారు. ఈ నెల 31 నుంచి ఫిబ్రవరి 3 వరకు జరిగే జరిగే మహాజాతరలో పోలీసుశాఖ ఆధ్వర్యంలో 200 సీసీ కెమెరాలతోపాటు పెంబర్తి నుంచి మేడారం వరకు మరో 200 సీసీ కెమెరాలు అమర్చి భద్రతా చర్యలు చేపట్టినట్టు చెప్పారు. మేడారాన్ని టూరిజం స్పాట్‌గా గుర్తించి రూ.7 కోట్లతో హరిత హోటల్ నిర్మించనున్నారు. రూ.కోటితో హంపీ థియేటర్, వీవీఐపీ, వీఐపీల కోసం పర్మినెంట్, సెమి పర్మినెంట్ కాటేజీలను ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. రూ.2 కోట్లతో గిరిజన మ్యూజియం నిర్మాణ పనులు పూర్తి చేశామన్నారు. జాతర చుట్టూ పందెరలో చెత్తా చెదారం, వ్యర్థపదార్థాలను తొలగించేందుకు మూడు వేల మంది కార్మికులు అందుబాటులో ఉంటారన్నారు. జాతరను 40 సెక్టార్లుగా విభజించి ఒక్కొక్క సెక్టార్‌కు జిల్లాస్థాయి అధికారితోపాటు ఆయా శాఖల అధికారులను నియమిస్తున్నట్టు పేర్కొన్నారు. ఎనిమిదిమంది ట్రైనీ ఐఏఎస్‌లను కూడా సెక్టార్ల వైజ్‌గా విధులు నిర్వహిస్తారన్నారు. జాతరలో 60 మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేస్తున్నామని, జాతర హెడ్‌క్వార్టర్‌లో వంద పడకల ఆస్పత్రి ఏర్పాటు చేశామన్నారు. మేడారానికి జాతీయ హోదా కల్పించాలని ఎంపీలు కేంద్ర ప్రభుత్వాన్ని కోరినా ఇప్పటివరకు అనుమతులు రాలేదన్నారు. జాతరకు పూర్తిగా రాష్ట్ర ప్రభుత్వమే నిధులు కేటాయించి అభివృద్ధి చేస్తున్నట్టు తెలిపారు. మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి మాట్లాడుతూ...మేడారం సమ్మక్క-సారలమ్మ జాతరలోనే జాతీయ పండుగగా ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు ప్రకటించే అవకాశముందని చెప్పారు. మేడారం జాతరకు ఉపరాష్ట్రపతి, గవర్నర్‌ను ఆహ్వానించామన్నారు. 25లక్షల మంది భక్తులు హాజరయ్యే జాతరలకు జాతీయ హోదా కల్పించిన కేంద్రం కోటికి పైగా భక్తులు వచ్చే మేడారం జాతరకు గుర్తింపు కల్పించకపోవడం బాధాకరమన్నారు. జాతర సందర్భంగానే కాకుండా ఇంకా అధికంగా అభివృద్ధి పనులు చేపట్టినట్టు మంత్రి అజ్మీరా చందూలాల్ తెలిపారు. ఈ ప్రాంతం పర్యాటక ప్రాంతంతో కలిసి ఉందని, మేడారంతో పాటు రామప్ప, లక్నవరం, మల్లూరు ప్రాంతాలను కూడా అభివృద్ధి చేస్తామన్నారు. మంత్రి మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ...జాతరకు 4,200 బస్సులను ఏర్పాటు చేసినట్టు తెలిపారు.

చింతల్ క్రాస్ నుంచి జంపన్నవాగు వరకు 40 మినీ బస్సులను నడిపిస్తున్నామని తెలిపారు. సమావేశంలో జెడ్పీచైర్‌పర్సన్ గద్దల పద్మ, ఎంపీ అజ్మీరా సీతారాంనాయక్, వరంగల్ మేయర్ నన్నపునేని నరేందర్, సిటీ పోలీసు కమిషనర్ సుధీర్‌బాబు, ఎస్పీ భాస్కరన్, జేసీ అమయ్‌కుమార్, డీఎఫ్ఓ రవికిరణ్, ఎండోమెంట్ డిప్యూటీ కమిషనర్ రమేష్‌బాబు, ఐటీడీఏ పీఓ చక్రధర్‌రావు, ములుగు సబ్ కలెక్టర్ వీపీ.గౌతం, ములుగు వ్యవసాయ మార్కెట్ చైర్మెన్ అజ్మీరా ప్రహ్లద్, మేడారం ట్రస్టు బోర్డు చైర్మెన్ కాక లింగయ్య, ట్రైనీ కలెక్టర్లు, ఆయా శాఖల ముఖ్య అధికారులు పాల్గొన్నారు.

ఏసీబీ వలలో ఆర్డీఓ

- రూ.40వేలు లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కిన ఆర్మూర్ ఆర్డీవో



6నవతెలంగాణ-ఆర్మూర్/ఆర్మూర్ టౌన్

రూ.40 వేల లంచం తీసుకుంటూ నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ ఆర్డీవో ఏసీబీ అధికారులకు చిక్కారు. ఏసీబీ డిప్యూటీ డైరెక్టర్ రమణకుమార్ తెలిపిన వివరాల ప్రకారం...ఆర్మూర్‌కు చెందిన రాజకుమార్ మంజీర వాటర్‌ప్లాంట్ ఏర్పాటుకు అనుమతివ్వాలని కోరుతూ ఆర్మూర్ ఆర్డీవో శ్రీనివాస్‌ను ఆశ్రయించాడు. దీనికి గాను ఆయన రూ.40వేలు లంచం డిమాండ్ చేశాడు. దీంతో బాధితుడు ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. మంగళవారం ఉదయం పెర్కిట్‌లోని ఎంజే ఆస్పత్రి సమీపంలో ఉన్న ఆర్డీవో ఇంటిదగ్గర బాధితుడు రూ.40 వేలు ఇస్తుండగా ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ప్రాథమిక దర్యాప్తు మేరకు ఆర్డీవో శ్రీనివాస్‌కు జగిత్యాల పట్టణంలో మూడు ప్లాట్‌లు, హైదరాబాద్‌లో రెండు ఓపెన్ ప్లాట్లు ఉన్నట్టు గుర్తించామని ఏసీబీ డిప్యూటీ డైరెక్టర్ రమణకుమార్ తెలిపారు. ఆర్డీవోను అరెస్టు చేసి కరీంనగర్ జైలుకు తరలిస్తున్నట్టు చెప్పారు.

'అజ్ఞాతవాసి' ఐదు షోలకే...

- కేసీఆర్‌కు పవన్ భజన: వీహెచ్, జీవన్‌రెడ్డి

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

పవన్ కళ్యాణ్ నటించిన 'అజ్ఞాతవాసి' చిత్రం 5 షోల ప్రదర్శనకు కేసీఆర్ అనుమతిస్తే స్మార్ట్, హార్డ్‌వర్క్ సీఎం అయ్యారా? అని మాజీ ఎంపీ వి హనుమంతరావు, సీఎల్పీ ఉపనేత జీవన్‌రెడత్డి ప్రశ్నించారు. కేసీఆర్‌కు పవన్ కతజ్ఞతగా భజన యాత్ర చేస్తున్నారని విమర్శించారు. మంగళవారం గాంధీభవన్‌లో వారు విలేకరులతో మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం పోరాడి జైళ్ళ పాలైన వాళ్ళకూ, ఆత్మహత్య చేసుకున్న వారి కుటుంబాలు సమావేశం నిర్వహించుకుంటామంటే టీఆర్ఎస్ ప్రభుత్వం అనుమతి ఇవ్వడం లేదన్నారు. కేసీఆర్ తాటతీస్తా అన్న జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్‌కు ఎలా అనుమతి ఇచ్చారని ప్రశ్నించారు. 'ప్రజలు బాగున్నారు...టీఆర్ఎస్ పాలనా బాగుందంటే...ఇక తెలంగాణలో తిరుగుడేందుకని' ఆయన ప్రశ్నించారు. పవన్‌కు దమ్ముంటే ఆంధ్రప్రదేశ్‌లో తిరగాలని డిమాండ్ చేశారు. పవన్ కళ్యాణ్ కేవలం కేసీఆర్‌కు భజన చేయడానికే ఆయన తెలంగాణలో యాత్ర చేపడుతున్నారని విమర్శించారు. ముఖ్యమంత్రి కేసీఆర్ పాలన అంత బాగుంటే జనసేనను తీసుకెళ్లి టీఆర్ఎస్‌లో విలీనం చేసుకోవాలని సూచించారు. తెలంగాణ కోసం ఆత్మహత్యలు చేసుకున్న వారి కుటుంబాలను పరామర్శిస్తామంటే అనుమతి ఇవ్వ లేదన్నారు. ఎస్సీ వర్గీకరణ కోసం మందకష్ణ దీక్ష చేస్తే అనుమతులు ఇవ్వలేదన్నారు. రాష్ట్రాన్ని అప్పుల ఊబిలో చేర్చడంలో కేసీఆర్ కష్టపడి పని చేస్తున్నారని విమర్శించారు. తెలంగాణ ప్రజల ఆకాంక్షను కించపరిచేలా మాట్లాడుతే సహించేదిలేదని హెచ్చరించారు.

విద్యారంగాన్ని సర్వనాశనం చేశారు

టీఎస్‌టీఎఫ్ డైరీ, క్యాలెండర్ ఆవిష్కరణలో ఉత్తమ్

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

తెలంగాణాలో విద్యా రంగాన్ని ముఖ్యమంత్రి కె చంద్రశేఖరరావు సర్వనాశనం చేశారని టీపీసీసీ అధ్యక్షులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి విమర్శించారు. కేసీఆర్ చెప్పిన కేజీ టు పీజీ ఎక్కడ పోయిందని ప్రశ్నించారు. మూడున్నరేండ్లుగా ఒక్క డీఎస్సీ వేయని అసమర్థ ముఖ్యమంత్రి కేసీఆర్ అని మండిపడ్డారు. తెలంగాణ సాధనంలో కీలక పాత్ర పోషించిన ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించడంలో కేసీఆర్ మరిచిపోయారని విమర్శించారు. సీపీఎస్ విధానాన్ని రద్దు చేసే వరకు ఉద్యోగులు, ఉపాధ్యాయులకు కాంగ్రెస్ అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. పండిట్ పోస్టుల అప్ గ్రేడ్‌ను వెంటనే చేపట్టాలని కోరారు. ఉద్యోగుల హెల్త్‌కార్డులు ఇచ్చినా అవి కార్పొరేట్ ఆస్పత్రుల్లో పని చేయడం లేదని, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ప్రతి ఉద్యోగికి ఫ్రీ కార్పొరేట్ వైద్యం అందిస్తామన్నారు. కేసీఆర్ అసమర్థతతోనే ఇప్పటికీ ఖాళీలు భర్తీ చేయడం లేదని విమర్శించారు. టీఆర్ఎస్ అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రయివేట్ రంగంలో కూడా ఉపాధి కల్పించలేకపోయిందని విమర్శించారు. కాంగ్రెస్ నిరుద్యోగులకు 3వేల నిరుద్యోగ భతి ఇస్తామని హామీ ఇచ్చారు.తర్వాత తెలంగాణ ఆటో డ్రైవర్స్ యూనియన్ నాయకులు, టీఆర్‌టీ అభ్యర్థులు ఉత్తమ్‌కు వేర్వేరుగా వినతిపత్రం సమర్పించారు.ఈ కార్యక్రమంలో టీపీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షులు మల్లు భట్టి విక్రమార్క, కోశాధికారి గూడూరు నారాయణరెడ్డి, ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి, మాజీ మంత్రి సునీతా లక్ష్మారెడ్డి, టీఎస్‌టీఎఫ్ రాష్ట్రఅధ్యక్షులు సిహెచ్ మాణయ్య, ప్రధాన కార్యదర్శులు డి రాజు, ఎస్ కృపాలెసింగ్, నాయకులు గాయత్రి, జె ప్రభాకర్, ప్రసాదరెడ్డి, షరీఫ్ తదితరులు ఉన్నారు.

కబ్జా భూమిని పరిశీలించిన సీపీఐ(ఎం) నాయకులు

- ఆ భూమి రైతు భిక్షపతిదే : పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు నాగయ్య
- ఈ ఘటనపై సర్కార్ స్పందించకపోవడం సిగ్గుచేటు



నవతెలంగాణ - హయత్‌నగర్

రైతు నుంచి బీజేపీ మాజీ ఎమ్మెల్యే ఇంద్రసేనారెడ్డి కబ్జాచేసిన భూమిని బహుజన రాజ్యాధికార పార్టీ రాష్ట్ర అధ్యక్షులు నల్లా సూర్యప్రకాశ్, సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జి.నాగయ్యతో కూడిన ప్రతినిధి బృందం మంగళవారం పరిశీలించింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తారమతిపేటలోని సర్వే నెంబర్ 85లో ఐదెకరాల ప్రభుత్వ భూమి ఉందని, అందులో భిక్షపతిగౌడ్ అనే రైతుకు అప్పటి ప్రభుత్వం 1991లో ఎకరం భూమిని ఇచ్చిందన్నారు. ఆ భూమిపై అతను అన్ని హక్కులూ కలిగి ఉన్నాడని తెలిపారు. భిక్షపతి ఆ భూమిని సాగుచేసుకుంటూ తన కుటుంబాన్ని పోషిస్తుండటంతో దానిపై కన్నేసిన బీజేపీ మాజీ ఎమ్మెల్యే నల్లు ఇంద్రాసేనారెడ్డి హద్దురాళ్లు తీసేసి రాత్రికిరాత్రే తన అనుచరులతో కలిసి జేసీబీనీ తీసుకొచ్చి పునాది కాలువ తీయడం దుర్మార్గమన్నారు. ఈ విషయంలో సర్కార్ స్పందించకపోవడం సిగ్గుచేటన్నారు. ఇటీవల నిజామాబాద్ జిల్లాలో ఇద్దరు దళితులను చితకబాదిన ఘటన మరువకముందే తారమతిపేటలో మరో ఘటన జరగడం ఆందోళన కలిగిస్తోందన్నారు. ఇప్పటికైనా రెవెన్యూ అధికారులు స్పందించి భూమిని సర్వే చేయించాలన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) రంగారెడ్డి జిల్లా కార్యదర్శి భూపాల్, టీమాస్ జిల్లా కన్వీనర్ సామేల్, అంబేద్కర్ సంఘం నాయకులు పారందస్వామి, బీసీ నాయకులు పుట్ట యాదయ్య, రాంచందర్, జగన్, ఈ.నర్సింహా, మహేష్, సత్యనారాయణరెడ్డి పాల్గొన్నారు.

జీఈ..2తో మరింతగా రాణిస్తాం

హితం ఇంజినీరింగ్ కాలేజీ విద్యార్థులు





నవతెలంగాణ-సిటీబ్యూరో: - హైదరాబాద్‌కు చెందిన ఇద్దరు ఇంజినీరింగ్ విద్యార్థులు టి.యశ్వంత్, ఎస్. శివ చైతన్య భారత ప్రతినిధులుగా అమెరికాలోని మసాచూసెట్స్‌లో జరిగిన 12వ గ్లోబల్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ ఎక్స్‌చేంజ్‌కు(జీఈ2) హాజరయ్యారు. ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్‌మెంట్, మేడ్చల్‌లో ఇంజనీరింగ్ కోర్సును చదువుతున్నారు. మ్యానింగ్ స్కూల్ ఆఫ్ బిజినెస్(ఎంఎస్‌బీ) ఆధ్వర్యంలో యూనివర్సిటీ ఆఫ్ మసాచూసెట్స్-లోవెల అండ్ కేఎల్ఈ టెక్ వర్సిటీలో గత ఏడాది డిసెంబర్ 28 నుంచి 2018, జనవరి 15 వరకు జీఈ-2 సదస్సు జరిగింది. ఇందులో దాదాపు నాలుగు దేశాల(చైనా, అమెరికా, జపాన్, ఇండియా) నుంచి దాదాపు 60 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

- విదేశాల్లో విద్యకు సంబంధించిన ప్రోగ్రామ్స్‌లో పాలుపంచుకునే విధంగా ది మ్యానింగ్ స్కూల్ ఆఫ్ బిజినెస్‌ను 2014 నుంచే ప్రారంభించింది. ఇందులో ఆరు ప్రోగ్రామ్స్ ఉంటాయి. మూడు హుబ్లీ(ఇండియా), మరో మూడు లోవెల్. ఎనిమిది దేశాలకు చెందిన దాదాపు 400 మంది విద్యార్థులు ఇలాంటి ప్రోగ్రామ్స్‌ల్లో పాల్గొంటారు. గ్లోబర్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ అండ్ ఇన్నోవేషన్‌లో భాగంగా రెండు వారాల పాటు ఈ కోర్సును ఆఫర్‌చేస్తున్నారు.
- హైదరాబాద్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్‌మెంట్(మేడ్చల్)లో మెకానికల్ ఇంజనీరింగ్ థర్డ్ ఇయర్ స్టూడెంట్ కె.హుసైన టీమ్ 5వ ఇండియన్ స్టూడెంట్ ఫోరమ్-2018(ఐఎస్ఎఫ్)లో రూ.10,000 నగదు బహుమతిని సాధించారు. ఐటీఎం ఒకేషనల్ వర్సిటీ వడోదరా, గుజరాత్‌లో స్పీడ హెల్డ్‌నిర్వహించింది.
- స్పీడ్ నేషనల్ కాన్ఫరెన్స్‌లను నిర్వహిస్తుంది. దేశ వ్యాప్తంగా ఉన్న విద్యార్థుల్లోని ప్రతిభా పాటవాలను వెలికితీయడానికి, ఇంజనీరింగ్ విద్యకు గల అవకాశాలపై చర్చిస్తుంది. విజయం సాధించే టీమ్‌కు కావాల్సిన అన్ని అంశాలను స్పీడ్ బోధిస్తుంది. అలాంటి టీమ్ కోసం ఎంత ఖర్చయిన చేయడానికి ఆలోచిస్తుంది.
- స్పీడ్(స్టూడెంట్ ప్లాట్‌పారమ్ ఫర్ ఇంజనీరింగ్ ఎడ్యుకేషన్) అనేది విశ్వవ్యాప్తం. విద్యార్థుల నుంచి ఎలాంటి ప్రాఫిట్ ఆశించకుండా ఇంజనీరింగ్ స్టూడెంట్స్‌కు విద్యావకాశాలు కల్పించమే ప్రధానం. భవిష్యత్ అభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని ఇంజనీరింగ్ విద్యను, విద్యార్థులకు అవకాశాలు సృష్టించడమే స్పీడ్ కర్తవ్యం.

ఆర్టిజన్స్ పేర సర్కారు మోసం

ఇఇఎఫ్ఐ జాతీయ ఉపాధ్యక్షులు ఆర్.సుధాభాస్కర్



నవతెలంగాణ-పాల్వంచ

విద్యుత్ రంగంలోని ఆర్టిజన్స్‌లను రాష్ట్ర ప్రభుత్వం మోసం చేసిందని ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా జాతీయ ఉపాధ్యక్షులు ఆర్.సుధాభాస్కర్ అన్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచలో యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ డైరీని మంగళవారం ఆవిష్కరించారు. అనంతరం కేటీపీఎస్ సీఐటీయూ కార్యాలయంలో విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం కాంట్రాక్టు కార్మికులను పర్మినెంట్ చేయకుండా ఆర్టిజన్స్ పేరుపెట్టి ఒక కన్సాలిడేట్ జీతాన్ని పర్మినెంట్ చేయడం దారుణమన్నారు. పేరుకే రెగ్యులర్ చేశారని, కాంట్రాక్టు వ్యవస్థ లేకుండా పోయింది తప్ప ఆర్టిజన్స్‌కు ఒరిగింది ఏమి లేదన్నారు. 14 వేల నుంచి 23 వేల వరకు జీతాలు ఇస్తామని సీఎం చెప్పిన ప్రకటన మాటలకే పరిమితమైందన్నారు. రూ.23 వేల జీతంలో చట్టప్రకారం ఈపీఎఫ్, ఈఎస్ఐ రెండూ యాజమాన్యం కట్టాల్సిన షేర్ కూడా ఈపీఎఫ్ 12శాతం, ఈఎస్ఐ 1.75శాతాలను వారి జీతాల నుంచి కట్ చేయడం వల్ల రూ.4 వేల మేర కార్మికులు నష్టపోతున్నారన్నారు.

దీనిపై యుఈఈయు రాష్ట్ర కమిటీలో నిర్దిష్టమైన నిర్ణయం తీసుకోబోతున్నామని చెప్పారు. 24 గంటల కరెంటును ఇచ్చేందుకు కృషి చేసిన ఉద్యోగులందరికీ స్పెషల్ ఇంక్రిమెంట్ ప్రకటించిన సీఎం, వెట్టిచాకిరీ చేస్తున్న ఆర్టిజన్స్‌కు ఇంక్రిమెంట్ ఎందుకు వర్తింపజేయడం లేదని ప్రశ్నించారు. తక్షణమే వారందరికీ ఇంక్రిమెంట్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఎన్‌పీడీసీఎల్‌లో జీతాలు పెంచాలని అన్‌మ్యాన్డ్ కార్మికులు సమ్మె చేస్తున్నారని, వారి డిమాండ్లను తక్షణమే పరిష్కరించాలని ప్రభుత్వాన్ని కోరారు. అనంతరం ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎన్.కిరణ్ మాట్లాడుతూ కాంట్రాక్టు కార్మికులను పర్మినెంట్ పేరుతో ఆర్టిజన్స్‌గా విలీనం చేసిన అందరినీ కన్సాలిడేట్ జీతం పేరుతో మోసం చేశారని, వారందరినీ తక్షణమే విలీనం చేసి పర్మినెంట్ చేయాలని, ఈ విషయంలో యూనియన్ రాష్ట్ర కమిటీలో భవిష్యత్ ప్రణాళిక రూపొందిస్తామని అన్ని కార్మిక సంఘాలను ఐక్యం చేసి ఐక్య ఉద్యమాలు చేస్తామన్నారు. సమావేశంలో సీఐటీయూ సీనియర్ నాయకులు ఎం.సాంబశివరావు, యూఇయూ రాష్ట్ర అధ్యక్షులు వి.కుమార్ చారి, గ్రేటర్ హైదరాబాద్ జనరల్ సెక్రటరీ వి.ఈశ్వరరావు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సెక్రటరీ పాలగాని రమేశ్, కాంట్రాక్టు వర్కర్స్ రాష్ట్ర జాయింట్ సెక్రటరీ బసవరాజు, కేటీపీఎస్ పాత ప్లాంట్ రీజినల్ కమిటీ అధ్యక్ష కార్యదర్శిలు వీరస్వామి, అంకిరెడ్డి, నర్సింహరావు, తదితరులు పాల్గొన్నారు.

మాక్‌డ్రిల్‌లో ప్రమాదం

- ఐదుగురు అక్టోపస్ కమాండోలకు గాయాలు
- ఒకరి పరిస్థితి విషమం



నవతెలంగాణ-ఇబ్రహీంపట్నం

మాక్‌డ్రిల్ చేస్తుండగా కారు ప్రమాదం జరిగి ఐదుగురు అక్టోపస్ కమాండోలకు తీవ్ర గాయాలయ్యాయి. వారిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. ఈ ఘటన రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం మండలం ఔటర్‌రింగ్ రోడ్డు వద్ద మంగళవారం జరిగింది. ఆదిభట్ల పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఇబ్రహీంపట్నం సమీపంలోని బొంగులూరు ఔటర్ రింగ్‌రోడ్డు వద్ద అక్టోపస్ కమాండోలు మాక్‌డ్రిల్ నిర్వహించారు. ముందు అక్టోపస్ బస్సు.. వెనుక ఇండికా కారులో కమాండోలు పోతుండగా.. బస్సు డ్రైవర్ సడన్ బ్రేక్ వేశాడు. దాంతో వేగంగా వస్తున్న కమాండోల కారు బస్సును బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కారులో ఉన్న కమాండోలు లక్‌పతి, సురేష్, రాహుల్, భవాని సింగ్, చెన్నకేశవరెడ్డి, శేఖర్ తీవ్రంగా గాయపడ్డారు. వీరిని వెంటనే హైదరాబాద్‌లోని కామినేని ఆస్పత్రికి తరలించారు. కారు నడుపుతున్న లక్‌పతి పరిస్థితి విషమంగా ఉందని డాక్టర్లు చెప్పారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ గోవర్ధన్‌రెడ్డి తెలిపారు.

మద్యం మత్తులో దారుణం

- భార్యను గొడ్డలితో నరికి హతమార్చిన భర్త

నవతెలంగాణ-బెజ్జూరు

మద్యం మహమ్మారి కుటుంబాలను ఎలా చిత్తు చేస్తుందో తెలిసిందే.. అది కుటుంబాల్లో చిచ్చుపెట్టి ఛిన్నాభిన్నం చేయడమే కాదు.. ప్రాణాలనూ తీస్తుంది. ఆ కోవలోనే మత్తులో భార్యను గొడ్డలితో నరికి చంపాడు. ఈ దారుణం కుమురంభీం జిల్లా బెజ్జూరు మండలం ఇప్పలగూడ గ్రామంలో సోమవారం రాత్రి జరిగింది. ఎస్ఐ శివ ప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం... ఇప్పలగూడ గ్రామానికి చెందిన తగరం రాజూభాయి(55), లస్మయ్య భార్యాభర్తలు. వారికి ఇద్దరు కుమారులున్నారు. లస్మయ్య కొంతకాలంగా మద్యానికి బానిసై రోజూ తాగుడుకు పైసలు కావాలని భార్యను వేధించేవాడు. ఈ క్రమంలో సోమ వారం రాత్రి బాగా తాగొచ్చిన లస్మయ్య మత్తులో భార్యపై గొడ్డలితో దాడి చేశాడు. దాంతో ఆమె అక్కడికక్కడే ప్రాణం కోల్పోయింది. భయంతో కుమారులిద్దరూ కేకలు వేయడంతో స్థానికులు వచ్చారు. తర్వాత పోలీ సులకు సమాచారం అందించారు. వెంటనే అక్కడికి చేరుకున్న పోలీసులు నిందితుడిని అదుపులోకి తీసుకుని కేసు దర్యాప్తు ప్రారంభించారు.

బాధ్యతల్ని గుర్తించి వాటిని సంపూర్ణంగా నిర్వర్తించే వారికే హక్కుల గురించి పోరాడే హక్కు ఉంటుంది. -మహాత్మాగాంధీ

సంపాదకీయం

దావోస్-బడ్జెట్

దావోస్ రంగస్థలం మీద ప్రపంచ పెట్టుబడిని రంజింప చేయడానికి ప్రధాని వెళ్లారు. ఆర్థిక మంత్రి అరుణ్‌జైట్లీ బడ్జెట్ కూర్పుకు కుస్తీ పడుతున్నారు. ఎన్నికలలో అపజయాలూ ఆటంకాలూ రాకుండా సెంటు దట్టిస్తున్నారు. ప్రపంచ ఆర్థికసదస్సుకు ఇరవై ఏండ్ల క్రితం అప్పటి ప్రధాని దేవెగౌడ వెళ్లారు. ఇప్పుడు మోడీ వెళ్లారు. దావోస్ సీఈఓ సమావేశంలో నినాదాల హోరు ఆకర్షణల జోరు పెంచారు. భారత్ అంటే బిజినెస్, బిజినెస్ అంటే భారత్ అని ఇండియాకు ట్యాగ్‌లైన్ ఇచ్చారు. తెలుగు సినిమాకు టైటిల్‌లాగా ప్రోమో విడుదల చేశారు. ఉపన్యాసాలతో పెట్టుబడులు వరస కడతాయో బెడిసి కొడతాయో వేచి చూడాల్సిందే. మేక్ ఇన్ ఇండియా నినాదంతో తిరగని దేశం లేదు. అడగని ఆర్థిక సంస్థ లేదు. మూడేండ్లలో మోడీ అర్ధగంటకు మించి వివిధ సమావేశాల్లో 775 ప్రసంగాలు చేసినట్టు అధికార గణాంకాలు తెలుపుతున్నాయి. 2015లో చేసిన 264 ప్రసంగాల్లో 166 విదేశాల్లోనే వినిపించారు. ఆశించిన పెట్టుబడులు రాలేదు. ఆర్థిక సంస్థలను సంతృప్తి పరచడంలో సఫలీకృతం కాలేదు. నిరుద్యోగుల ఉపాధికల్పన నీటిమూటగానే మిగిలింది.

దావోస్‌లో అంతర్జాతీయ ఆర్థిక సంస్థలను ఆనందపరిచి ఆకర్షించడానికి మోడీ శ్రమపడుతున్నారు. స్వదేశీ పెట్టుబడిని, ఎన్నికల ఎజెండాను బడ్జెట్‌లో భర్తీ చేయడానికి ఆర్థిక మంత్రి అంకెలను సరిచేస్తున్నారు. పాలకుల వంచనను ప్రజలు గమనించాలి. క్రాంతి కాగడాల వెలుగులో కాపు కాయాలి. మార్పు తేవాలి.

ప్రపంచ పెట్టుబడిని మెప్పించడానికి, ఆర్థిక సంస్థలను ఒప్పించడానికి, భారత్ బాట పట్టించటానికి మోడీ కసరత్తు చేశారు... సంస్కరణలు చేసి సందుగలో పెట్టుకున్నారు. విదేశీ పెట్టుబడికి ఆటంకాలు లేకుండా చేశారు. రిటైల్‌రంగంలో సింగిల్ బ్రాండ్ విధానానికి స్వేచ్ఛ ఇచ్చారు. బహుళజాతి కంపెనీలకు రెడ్‌కార్పెట్‌తో స్వాగతం పలకడానికి సన్నాహాలు చేశారు. 11 కోట్లమంది చిరు వ్యాపారులను నిరాశ్రయులను చేస్తున్నారు. ప్రచ్ఛన్న నిరుద్యోగులుగా మారుస్తున్నారు. విదేశీ సంస్థలు స్థానిక రైతుల నుండి 30శాతం సరుకులు సేకరించాలనే నిబంధనలకు సెలవుచీటీ ఇచ్చారు. సంస్థ ప్రారంభమైన ఐదేండ్ల వరకు అక్కరలేదని పక్కకు పెట్టారు. సింగిల్‌బ్రాండ్ పెట్టుబడులతో సంతృప్తి చెందలేదు బహుళజాతి సంస్థలు. రిటైల్‌రంగంలో మల్టీబ్రాండ్‌ల కోసం ఒత్తిడి తెస్తున్నారు. ఎప్పుడో ఒకప్పుడు పాలకులు లొంగిపోయే ప్రమాదం లేకపోలేదు. ప్రపంచ పెట్టుబడుల సదస్సులో మోడీ మెండుగా వరాల వర్షం కురిపించవచ్చు. రాయితీల వరద పారవచ్చు. పెట్టుబడి కట్టలు తెగుతుందో లేదో చూడాలి. ప్రధాని పనికి ఫలితం దక్కుతుందో లేదో ఆచరణలో అగుపడుతుంది.



"మాది ప్రజాకర్షక బడ్జెట్ కాదు. జనాలు ఉచితంగా ఏదీ కోరుకోరు... గుజరాత్‌లో ముఖ్యమంత్రిగా చూసిన నన్ను ప్రజలు అర్థం చేసుకుంటారా"ని ప్రధాని ప్రగల్భాలు పలుకుతున్నారు. నిజానికి గుజరాత్‌లో ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసారు. ఎన్నికల సంఘం స్వయం ప్రతిపత్తి దెబ్బతీశారు. ఓట్ల కోసం పడరాని పాట్లు పడ్డారు. ఎన్నికల నోటిఫికేషన్ ఆపింది ఎవరు? ప్రజలకు భ్రమలు కల్పించడానికి వేలాదికోట్ల పనులకు శంకుస్థాపనలు చేసింది పాలకపక్షం కాదా! అక్కడ వస్త్ర వ్యాపారులు రోడ్డుమీదకొస్తే జీఎస్‌టీ తగ్గించలేదు. వారి పోరాటాన్ని కించిత్ లెక్కచేయలేదు. కానీ ఓటమి భయంతో వస్త్ర పరిశ్రమ జీఎస్‌టీ తగ్గించింది నిజం కాదా? వేరుశనగ రైతులను బుట్టలో వేసుకునేందుకు, వ్యాపారులను సంతోషపెట్టేందుకు వంటనూనెల దిగుమతి సుంకం 25శాతం నుండి 40శాతానికి పెంచారు. బడ్జెట్‌లో రాసుకున్న ద్రవ్యోల్బణం గీతలను దాటారు. వంటనూనె ధరలు పెరగడానికి కారకులయ్యారు. దేశ ప్రజల మీద భారాలు మోపారు. ప్రతీ ఏడూ 16 మిలియన్ టన్నుల వంటనూనెలు మన దేశానికి దిగుమతి అవుతున్నాయి. 'తాగినవాడే కడతాడు తాళ్లపన్ను అన్నట్టు' లీటరుకు రూ.5నుండి 10 వరకు పెరగటం వలన ఎగుమతి, దిగుమతి వ్యాపారులు నష్టపోలేదు. ప్రజలే నష్టపోయారు. కేంద్ర ఖజానాకు సుంకం పెరగటం వలన వేలకోట్లు జమ అయ్యాయి.

వస్తు సేవల పన్నులు, నోట్ల రద్దుతో అభివృద్ధి అంచనాలు తప్పింది. జీడీపీ తిరోగమనంలో ఉంది. ఎన్నికలను ఎలా సఫలం చేసుకోవాలా అని పాలకులు పాట్లు పడుతున్నారు. విత్తసంచిని నింపటానికి డబ్బు కోసం ప్రభుత్వరంగ సంస్థలకు పాడె గడుతున్నారు. గతేడాది బడ్జెట్‌లో పీఎస్‌యూల నుంచి రూ.45వేల కోట్లు సమీకరించారు. ఇప్పుడు బడ్జెట్‌లో నిర్దేశించుకున్న లక్ష్యం కన్నా మిన్నగా ప్రజల ఆస్తులను అమ్ముతున్నారు. రూ.75,500 కోట్లు టార్గెట్ నిర్ణయించారు. రూ.91వేల కోట్లు సమీకరించారు. లక్ష కోట్లకు చేరుకోవాలని ఆరాటపడుతున్నారు. హెచ్‌పీసీఎల్‌లో ఉన్న 51.5 శాతం వాటాలను ఓఎన్‌జీసీకి అమ్మింది. ప్రభుత్వానికి ఓఎన్‌జీసీ 36వేల కోట్లు చెల్లించాలి. ప్రభుత్వ వాటాలను అమ్మటం వలన ఓఎన్‌జీసీ రూ.25వేల కోట్లు అప్పులు చేయాల్సి వస్తుంది. ఓఎన్‌జీసీకి అప్పుల భారం పెరుగుతున్నది. ప్రభుత్వరంగ సంస్థల ఆస్తులు మంచుగడ్డలా కరగదీస్తున్నారు.

దావోస్‌లో అంతర్జాతీయ ఆర్థిక సంస్థలను ఆనందపరిచి ఆకర్షించడానికి మోడీ శ్రమపడుతున్నారు. స్వదేశీ పెట్టుబడిని, ఎన్నికల ఎజెండాను బడ్జెట్‌లో భర్తీ చేయడానికి ఆర్థిక మంత్రి అంకెలను సరిచేస్తున్నారు. పాలకుల వంచనను ప్రజలు గమనించాలి. క్రాంతి కాగడాల వెలుగులో కాపు కాయాలి. మార్పు తేవాలి.

ప్రజావాణి

అక్రమాలు అరికట్టాలి

తెలంగాణలో కొత్త పంచాయతీరాజ్ చట్టం రూపకల్పనకు ఏడుగురు మంత్రులతో ఏర్పాటైన మంత్రివర్గ ఉపసంఘం అనేక విషయాలను చర్చిస్తోంది. గ్రామాల్లో సర్పంచ్, వార్డుసభ్యులు, ఎంపీటీసీల ఎన్నికల వ్యయభారం ఎప్పటికప్పుడు పెరిగిపోతోంది. ఆ భారం చివరకు ప్రజల మీదే పడుతోంది. ఈ దృష్ట్యా ఎన్నికల వ్యయాన్ని నియంత్రించడానికి మంత్రి వర్గ ఉపసంఘం శ్రీకారం చుట్టాలి. స్థానికసంస్థల ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థుల ప్రచార ఖర్చును కొంతవరకు రాష్ట్ర ప్రభుత్వం భరించాలి. డబ్బును, మద్యాన్ని, ఇతర వస్తువులను పంపిణీ చేయకుండా గట్టి చర్యలు చేపట్టాలి. బాగా డబ్బున్న అభ్యర్థులు విపరీతంగా ఖర్చుపెట్టి ఎన్నికల్లో సునాయాసంగా విజయం సాధించగలుగుతున్నారు. డబ్బులేనివారు తమ మంచితనంతో గెలవలేక చతికిలపడుతున్నారు. అభ్యర్థులందరి ప్రచార వ్యయాన్ని ప్రభుత్వమే భరించడంతో పాటు, అక్రమాలను అరికడితేనే అందరికీ సమన్యాయం చేసినట్టు అవుతుంది. అప్పుడు ప్రజాస్వామ్యం పరిపుష్టమవుతుంది.

గోదూర్ అశోక్,
గోదూర్, జగిత్యాలజిల్లా.

డ్రంక్ అండ్ డ్రైవ్

రహదారులపై మద్యం తాగి వాహనాలు నడుపుతున్న వారి సంఖ్య రోజు రోజుకీ పెరుగుతుందే కానీ తగ్గడం లేదు. డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్టులు తక్కువగా జరుగుతున్నాయి. ఈ టెస్టుల్లో పట్టుబడిన వారికి శిక్షలు తగినంతగా లేవు. జాతీయ రహదారులు మొదలు కొని మారుమూల గ్రామీణ రహదారుల వరకు అంతటా నిత్యం అసంఖ్యాక జనం మద్యం తాగి వాహనాలు నడుపుతున్నారు. వీరి నిర్లక్ష్యం మూలంగా ప్రమాదాలు పెరిగి, ఎంతో మంది చనిపోతున్నారు. మరెందరో తీవ్ర గాయాలపాలై జీవితాంతం నరకయాతన పడుతున్నారు. అన్ని రహదారులపై డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్టులు ముమ్మరం కావాలి. తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడిన వారికి అతి భారీగా జరిమానాలు విధించి, వారి లైసెన్సులను శాశ్వతంగా రద్దు చేయాలి. ప్రజలలోనూ మార్పు రావాలి. ప్రభుత్వం కూడా విచ్చలవిడిగా పెరుగుతున్న మద్యం దుకాణాలను బంద్ పెట్టాలి.

ఎస్. శ్రీనివాసరాజు,
వనస్థలిపురం.

అమెరికా దుకాణం బంద్ ఓ ప్రహసనం!



ఎం. కోటేశ్వరరావు

ప్రపంచ అగ్రరాజ్యం అమెరికాలో శుక్రవారం రాత్రి పన్నెండు గంటల నుంచి అక్కడి ప్రభుత్వం పనిచేయటం ఆగిపోయింది. మూడు రోజుల తరువాత ముగిసింది. దీనికంటే ముఖ్యవిషయం ఏమంటే డోనాల్డ్ ట్రంప్‌కు వ్యతిరేకంగా ఆ పెద్దమనిషి పదవీ బాధ్యతలు స్వీకరించి ఏడాది గడచిన సందర్భంగా లక్షలాదిమంది మహిళలు అమెరికా అంతటా పెద్దఎత్తున ప్రదర్శనలు చేశారు. ప్రభుత్వం మూతపడినందువలన ఎక్కువగా ప్రభావితమయ్యేది మిలిటరీ గనుక తెరిచేందుకు ముందుకు రావాలని మూతకు కారకులైన డెమోక్రాట్లకు అధ్యక్షుడు ట్రంప్ ట్వీట్ చేశాడు. ఏడాది పాలనలో తన ఆర్థిక విజయం, సంపదల సృష్టికి గాను పండుగ చేసుకొనేందుకు ఈ రోజు ప్రదర్శనలు మహిళలకు ఇది సరైన సమయం అంటూ ట్రంప్ వారిని రెచ్చగొట్టే విధంగా మరో ట్వీట్‌ద్వారా వ్యాఖ్యానించాడు. నిజానికి ప్రభుత్వ మూత అనేది పెద్ద ప్రహసనం. డెమోక్రాట్లను బందీలుగా మార్చటంతో మరోమార్గం లేక దిగివచ్చారని అధ్యక్షుడు ట్రంప్ తనదైన శైలిలో మూత ముగిసిన తరువాత ట్వీట్ చేశాడు. అధ్యక్షుడు తమతో తెరవెనుక ఒప్పందానికి వచ్చారని డెమోక్రాట్ సెనెటర్ ఒకరు వ్యాఖ్యానించారు. వలసదారుల సమస్యలపై తరువాత చర్చ జరిపేందుకు రిపబ్లికన్లు సమ్మతించారు గనుక డెమోక్రాట్లు మూత ఎత్తివేతకు అనుమతించారని వార్త. అయితే అలాంటి చర్చ జరుగుతుందో లేదో హామీ లేదని, డెమోక్రాట్లు దేనిమీదా గట్టిగా నిలబడరని మరోసారి రుజువైందని అనేక విమర్శలు వచ్చాయి. .

గత నాలుగు సందర్భాలలో జరిగిన ఇలాంటి పరిణామాలను గమనంలో వుంచుకొనే అనేక తాత్కాలిక ఏర్పాట్లను కూడా చేస్తున్నారు. ఐదేండ్ల క్రితం ఒబామా హయాంలో 16రోజుల మూత సమయంలో ఎనిమిది లక్షల మంది కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులను వేతనాలు లేకుండా ఇండ్లకు పంపివేశారు. అమెరికాలో పనిచేయకపోతే వేతనం ఇచ్చే విధానం లేని విషయం తెలిసినదే. ఇప్పుడు కూడా అలాంటిదే జరుగుతుంది. అందువలన ముందే చెప్పుకున్నట్టు జరిగే నష్టం కార్మికవర్గానికే.

ప్రపంచంలో ఎక్కడా ఏ రోజూ, ఏక్షణం కూడా ప్రభుత్వ వ్యవస్థలు మూతపడటం అనేది లేదు. అదొక మిధ్య అంటే అతిశయోక్తి కాదు. ట్రంప్ ఒక సామ్రాజ్యవాద ప్రతినిధి కనుక ఆ పెద్దమనిషి నోటి నుంచి ఆ భాషే వెలువడుతుంది. నిజానికి మూతపడిన రోజుల్లో పనికి దూరమైన ప్రభుత్వ ఉద్యోగులు, కార్మికులు నష్టపోతారు, ఆ మేరకు వారు చేసే ఖర్చు తగ్గుతుంది కనుక వ్యాపారలావాదేవీలు, వ్యాపారులకు లాభాలు తగ్గుతాయే తప్ప నష్టపోయేదేమీ ఉండదు. సంక్షేమ పథకాలు నిలిచిపోతాయి. ఉద్యానవనాలు, మ్యూజియంలు, ఇతర ప్రభుత్వ ఆధ్వర్యంలోని దర్శనీయ స్థలాలు మూతపడిన కారణంగా వచ్చే ఆదాయాన్ని కూడా నష్టంగా లెక్కవేస్తున్నారు. వాయిదా పడిన సేవలు తరువాత అయినా అందించేందుకు వీలుంటుంది కనుక వాటిని నష్టాలుగా చెప్పటం కొంతమేరకు అతిశయోక్తి అవుతుంది.

అసలు అమెరికా ప్రభుత్వం ఎందుకు మూతపడింది? నాలుగు దశాబ్దాల క్రితం సవరించిన రాజ్యాంగం ప్రకారం బడ్జెట్ ప్రతిపాదనలను పార్లమెంట్‌లోని ఉభయ సభలు నిర్ణీత మెజారిటీ ఓటుతో ఆమోదించాల్సి వుంది. సాధారణంగా మన పార్లమెంట్, అసెంబ్లీ సమావేశాలలో అలాంటి సందర్భాలు వచ్చినప్పుడు ఓటింగ్‌లో పాల్గొనటం గురించి రాజకీయ పక్షాలు అవసరమైతే విప్‌లు జారీ చేస్తాయి. అమెరికాలో అలాంటి ఏర్పాట్ల గురించి, మన మాదిరి అక్కడ కూడా జరిగే అపహాస్యాలు, ప్రహసనాల లోతుల్లోకి పోలేదు కనుక వాటి గురించి పక్కన పెడదాం. పార్లమెంట్ ఎగువ సభ సెనెట్‌లోని వంద స్థానాలకు గాను రిపబ్లికన్లకు 51, డెమోక్రాట్లకు 47 మంది, ఇద్దరు స్వతంత్రులు ఉన్నారు. బడ్జెట్ ఆమోదానికి కనీసం 60మంది సభ్యుల మద్దతు అవసరం. ప్రభుత్వ ఖర్చుల ఆమోదానికి శుక్రవారం నాడు (మన ఓట్‌ఆన్ అకౌంట్ మాదిరి) జరిగిన ఓటింగ్‌లో అనారోగ్యం కారణంగా రిపబ్లికన్ పార్టీకి చెందిన ఒకరు గైర్హాజరు కాగా 50మంది అనుకూలంగానూ 49మంది వ్యతిరేకంగానూ ఓటు చేశారు. ఐదుగురు అధికార పక్ష సభ్యులు ప్రభుత్వ ప్రతిపాదనలకు వ్యతిరేకంగా ఓటు చేయగా ఐదుగురు ప్రతిపక్ష సభ్యులు ప్రభుత్వానికి అనుకూలంగా తమ పార్టీ వైఖరికి విరుద్ధంగా ఓటు చేశారు. దాంతో తగిన మద్దతు లేక బిల్లు వీగిపోయింది. నిధుల మంజూరు అర్ధరాత్రి 12గంటల నుంచి నిలిచిపోయింది. దీన్నే ప్రభుత్వ మూత అంటున్నారు. ఒప్పందం కుదిరిన తరువాత జరిగిన ఓటింగ్‌లో సెనెట్‌లో 81-18, దిగువ సభ కాంగ్రెస్‌లో 266-150 మెజార్టీతో ప్రతిష్ఠంభన ముగిసింది.



బడ్జెట్‌కు ఉభయ సభల ఆమోదం, అదుపునకు సంబంధించి నిబంధనలు సవరించిన తరువాత 1976 నుంచి ఇలాంటి మూతలు తాజా ఉదంతంతో సహా పద్దెనిమిది సార్లు జరిగాయి. ఇవి ముగ్గురు రిపబ్లికన్లు, ముగ్గురు డెమోక్రాట్ పార్టీల అధ్యక్షుల హయాంలో జరిగాయి. పదకొండు సార్లు డెమోక్రాట్లు కారణం కాగా ఏడు రిపబ్లిక్ పార్టీ ఖాతాలో ఉన్నాయి. వీటిని స్థూలంగా పరిశీలించినప్పుడు అత్యధిక సందర్భాలలో కార్మికవర్గానికి వ్యతిరేకమైన ప్రతిపాదనలను ముందుకు తెచ్చినప్పుడే జరిగాయని గమనించవచ్చు. రెండు పార్టీలు ఒకే వర్గానికి ప్రాతినిధ్యం వహిస్తాయనే విషయంలో ఎలాంటి భ్రమలకు లోనుకానవసరం లేదు. ఉన్నంతలో ఏది తక్కువ హాని చేసే పార్టీ అని బేరీజు వేసుకొని మెజారిటీ కార్మికవర్గం, వలస కార్మికులు డెమోక్రటిక్ పార్టీ మద్దతుదారులుగా ఉంటున్నందున వారిని నిలబెట్టుకొనేందుకు ఆ పార్టీ రిపబ్లికన్లతో పోల్చితే సంక్షేమ చర్యల గురించి ఎక్కువగా మాట్లాడుతోంది.

తాజా మూత విషయానికి వస్తే బాలలుగా ఉన్నప్పుడు అమెరికాకు అక్రమంగా తీసుకువచ్చి వారిచేత తక్కువ వేతనాలకు పని చేయించుకొని ఇప్పుడు పెరిగి పెద్దవారైన తరువాత మార్చినెలలో బయటకు గెంటేయాలని ట్రంప్ ప్రభుత్వం నిర్ణయించింది. ఆ సమస్యపై వారి సంక్షేమం కోసం నిధుల కేటాయింపు సక్రమంగా లేదంటూ డెమోక్రాటిక్ పార్టీ సభ్యులు వ్యతిరేకత వ్యక్తం చేశారు. అక్రమంగా వలస వచ్చిన వారి బెదిరింపులకు లొంగకూడదంటూ రిపబ్లికన్లు పట్టుబట్టారు. ఈ వివాదంపై రెండు పార్టీల మధ్య రాజీకుదిరి తిరిగి ఓటింగ్ జరిపి ప్రతిపాదనలకు ఆమోదం లభిస్తే అప్పుడు ఖర్చులకు నిధులను వినియోగించవచ్చు. అది జరగపోతే ఇటు సూర్యుడు అటు పొడుస్తాడా అంటే అంత సీనేమీ వుండదని గత అనుభవాలు రుజువు చేశాయి. నిజంగా అది ప్రతిబంధకమై ముందుకు పోలేని స్థితి ఉంటే అది పునరావృతం కాకుండా సాధారణ మెజారిటీతో ఆమోదం పొందే విధంగా రెండవ మూత సంభవించకుండానే నిబంధనల సవరణ చేసి ఉండేవారు. ప్రతిసారీ అత్యధిక సందర్భాల్లో ఏదో ఒక రాజకీయంలో భాగంగానే జరుగుతోంది. ఇప్పుడు అమెరికాకు వలస వచ్చిన వారి గురించి అధికార ప్రతిపక్షాలు రాజకీయం చేస్తున్నాయంటే అతిశయోక్తి కాదు.

1976లో తొలి మూత పడటానికి కారణం రిపబ్లికన్ పార్టీకి చెందిన అధ్యక్షుడు గెరాల్డ్ ఫోర్డ్(ఫోర్డ్ మోటార్ కంపెనీ యజమాని). కార్మికులు, విద్య, వైద్యం, సంక్షేమ పథకాలకు గాను 56బిలియన్ డాలర్ల మేరకోత విధిస్తూ వీటో జారీచేసినప్పుడు దానికి వ్యతిరేకంగా అదే ఏడాది అమలులోకి వచ్చిన బడ్జెట్ అదుపు చట్టాన్ని వినియోగించు కొని డెమోక్రాట్లు ఖర్చులను అడ్డుకున్నారు. అది ఎన్నికల సంవత్సరం అని గమనించాలి. ఆ ఏడాది జరిగిన ఎన్నికలలో అధికారానికి వచ్చిన డెమోక్రాట్ జిమ్మీకార్టర్ 1977లో అధికారానికి వచ్చిన తొలిఏడాదే మూడుసార్లు రిపబ్లికన్లు 12, 8, 8 రోజుల చొప్పున ప్రభుత్వాన్ని మూతవేయించారు. అబార్షన్లు చేయించుకున్నప్పుడు వైద్యసాయం చేసేందుకు నిధుల కేటాయింపును అసలు అబార్షన్లనే వ్యతిరేకించే రిపబ్లికన్లు అడ్డుకున్నారు. అవసరం లేని మిలిటరీ పరికరాల కొనుగోలుకు ప్రతిపాదన చేశారంటూ 37బిలియన్ డాలర్ల మొత్తాన్ని కార్టర్ వీటో చేయటాన్ని వ్యతిరేకిస్తూ 26రోజులపాటు రిపబ్లికన్లు ప్రభుత్వాన్ని మూతవేయించారు. 1979 ఎన్నికల సంవత్సరంలో పార్లమెంటు సభ్యులు, ఉన్నతాధికారులకు 5.5శాతం వేతనాల పెంపు ప్రతిపాదనను, అబార్షన్లకు నిధులను రిపబ్లికన్లు అడ్డుకొని మరోసారి 11రోజులపాటు మూతకు కారణమయ్యారు. తరువాత అధికారానికి వచ్చిన రిపబ్లికన్ రోనాల్డ్ రీగన్ తొలి నాలుగేండ్ల పదవీ కాలంలో ఆరుసార్లు (మొత్తం 12రోజులు) మూత వేయించి డెమోక్రాట్లు రికార్డు సృష్టించారు. తదుపరి నాలుగేండ్లలో రెండుసార్లు, రెండురోజులు మూతపడవేయించి అత్యధిక మూతల అధ్యక్షుడిగా రికార్డులకెక్కించారు. తరువాత డెమోక్రాట్ బిల్‌క్లింటన్ హయాంలో మెజారిటీ దిగువసభలోని రిపబ్లికన్ల బిల్లును వీటో చేయటంతో రిపబ్లికన్లు ప్రభుత్వాన్ని మూతవేయించారు. ఇది గరిష్ఠంగా 21రోజులు సాగి అత్యధిక ప్రతిష్టంభనగా నమోదైంది. చివరికి బిల్ క్లింటనే రాజీపడి ప్రభుత్వ ఖర్చు తగ్గింపు, పన్నుల పెంపుదల ప్రతిపాదన ఆమోదానికి బాటవేశారు. తరువాత ఒబామా హయాంలో పేదలకు అందుబాటులోకి తెచ్చిన ఆరోగ్య బీమా చట్టాన్ని వ్యతిరేకించిన రిపబ్లికన్లు 2013లో 16రోజుల పాటు మూత వేయించారు. ఆ తరువాత తిరిగి మూతపడటం ఇదే ప్రథమం.

వారాంతంలో లేదా వరుసగా సెలవులు ఉన్నపుడు మూతపడిన సందర్భాలలో పెద్ద ప్రభావం చూపలేదు కనుక కొన్ని అసలు చర్చనీయాంశం కాలేదు, అసలు మూతపడినట్టే కొందరికి తెలియదు. ఎక్కువ రోజులు కొనసాగితే ప్రభుత్వ ఉద్యోగులు, కార్మికులు పని లేకుండా ఇండ్లకు పోవటం లేదా తరువాత వేతనాలు తీసుకొనే ప్రాతిపదికన పని చేయటం ఇలాంటి సందర్భాలలో సర్వసాధారణం. మిలిటరీలో పనిచేసే పౌర ఉద్యోగులకు కూడా ఇదే వర్తిస్తుంది. మిలిటరీ, గూఢచార, ఉగ్రవాద వ్యతిరేక కార్యకలాపాలలో ఉన్న సిబ్బందికి ఈ మూత వర్తించదు కనుక వారికి ఎలాంటి ఇబ్బంది వుండదు. అయితే ఈసారి మిలిటరీ సిబ్బందికోసం ప్రసారాలు చేసే టీవీ నెట్‌వర్కు మూతపడినందున తమకు ఇబ్బంది కలిగిందని స్వదేశంలోనూ, విదేశాల్లో వున్న మిలిటరీ సిబ్బంది విమర్శలు చేస్తున్నారని వార్తలు వచ్చాయి. కొన్ని కవాతులు, మిలిటరీలోకి తీసుకోవటం కొన్ని కార్యక్రమాలకు పరిమితంగా ఆటంకం కలుగుతుంది తప్ప అమెరికన్లు విదేశాల్లో జరిపే దాడులు, దుండగాలకు, పోలీసు, అత్యవసర సేవలుగా ప్రకటించిన వాటికి మాత్రం ఎలాంటి ఇబ్బంది ఉండదు. గత నాలుగు సందర్భాలలో జరిగిన ఇలాంటి పరిణామాలను గమనంలో వుంచుకొనే అనేక తాత్కాలిక ఏర్పాట్లను కూడా చేస్తున్నారు. ఐదేండ్ల క్రితం ఒబామా హయాంలో 16రోజుల మూత సమయంలో ఎనిమిది లక్షల మంది కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులను వేతనాలు లేకుండా ఇండ్లకు పంపివేశారు. అమెరికాలో పనిచేయకపోతే వేతనం ఇచ్చే విధానం లేని విషయం తెలిసినదే. ఇప్పుడు కూడా అలాంటిదే జరుగుతుంది. అందువలన ముందే చెప్పుకున్నట్టు జరిగే నష్టం కార్మికవర్గానికే.

జనవరి 20నాటికి డోనాల్డ్ ట్రంప్ పదవీకాలం ఏడాది పూర్తవుతుంది. దానికి ముందుగానే ఇటువంటిదేదో జరగనుందని కొన్ని సూచనలు వెలువడినా ప్రభుత్వ యంత్రాంగం అంత తీవ్రంగా తీసుకోలేదని వార్తలు వెలువడ్డాయి. జరిగిన నష్టం ఎంతో తరువాత వెల్లడి అవుతుంది. ప్రభుత్వం ఈ ఏడాది 4.1లక్షల కోట్ల డాలర్ల మేరకు ఖర్చు చేస్తుంది. దీనిలో సగానికి పైగా మిలిటరీకి ఇతర సంస్థలకు కేటాయిస్తారు. మూడోవంతుకు అటూ ఇటూగా ఉన్న మొత్తానికి మాత్రమే పార్లమెంట్ ఆమోదం పొందాల్సి వుంటుంది. డెమోక్రాట్లు సృష్టించిన ఈ మూత, దానికి కారణమైన రిపబ్లికన్ల ప్రతిపాదనలు రెండూ ఈ ఏడాది నవంబరులో జరగనున్న పార్లమెంటు దిగువసభ ఎన్నికల దృష్టితోనే అన్నది గమనించాలి. ■

పెరుగుతున్న అసమానతలు



జి. తిరుపతయ్య

అందరూ పని చేస్తున్నారు. కానీ ఒకరు అందలమెక్కుతున్నారు. మరొకరు అథఃపాతాళంలో పడిపోతున్నారు. కొందరిది ఎక్కువ నైపుణ్యం, ఇంకొకరిది తక్కువ నైపుణ్యం. కానీ చెల్లించబడే వేతనాల్లో విపరీతమైన ఎడం వుంటుంది. వేతనాల్లో పెరిగిపోతున్న ఈ ఎడం వల్ల జీవన ప్రమాణాలు బాగా దెబ్బ తింటున్నాయి. గ్లోబలైజేషన్ పుణ్యమా అని జీతభత్యాల విధివిధానాలపై ప్రభుత్వ అజమాయిషీ ఉపసంహరించుకుని వ్యక్తిగత విచ్చలవిడితత్వానికి అవకాశమివ్వడం వల్ల వేతనాల్లో అసంబద్ధమైన హెచ్చు తగ్గులు చోటు చేసుకుంటున్నాయి ఇది చాలా ప్రమాదకరమైనది.

సమాజంలో ఆదాయ అసమానతలకు ప్రధాన కారణం కొందరికి పనికి తగిన ప్రతిఫలం ఇవ్వకపోవటం, ఇంకొందరికి పనికి మించిన ప్రతిఫలం ఇవ్వటం. ఈ సూక్ష్మ విషయాన్ని మేధావులే చెప్పక్కర్లేదు. కాస్త నిశితంగా గమనిస్తే ఇట్టే అర్థమౌతుంది. కానీ దీనిపై దృష్టి సారించకుండా పనికి ఇవ్వాల్సిన ప్రతిఫలాన్ని లాక్కోవడం వల్ల పేదలుగా మారిన వారికి సంక్షేమ పథకాలపేర కాసిన్ని నూకలు జల్లుతూ అదొక గొప్ప పనిగా చెప్పుకుంటాయి ప్రభుత్వాలు. అసంఘటిత రంగంలో పనిచేస్తున్న కోట్ల కొలదీ ప్రజలకు చాలీ చాలని కూలీలు వేతనాలిస్తూ వారి పొట్టకొట్టి, వ్యాపారులు విపరీత లాభాలార్జించి అందులోంచి అతి తక్కువ మొత్తానికే పన్నులు చెల్లించి, ఆ పన్నులనుండే సంక్షేమ పథకాలు ప్రభుత్వమిస్తుందని వారి ఢంకా వారే బజాయించుకుంటారు. ప్రపంచ మొత్తంగా దాదాపు ఇలాంటి విధానాలకే అలవాటు పడటానికి కారణం ఏమంటే క్రింది స్థాయి పని చేసే కార్మికులకన్నా పై స్థాయిలో ఉండి పని చేయించుకునే ఎగ్జిక్యుటివ్‌ల వల్లే ఉత్పత్తిలో పెరుగుదల సాధ్యమనే తప్పుడు భావన ఒకటైతే, ప్రభుత్వాలు కూడా ఈ పెట్టుబడిదారుల ద్వారా నడుపబడుతుండటం మరో కారణం. ఒక వర్కర్‌కి ఒక సీఈఓ (కంపెనీ ముఖ్య కార్య నిర్వాహకుడు)కి జీతభత్యాల్లో వ్యత్యాసముండాలి. కానీ అది ఏ మేరకుండాలి అన్నదే ప్రధానంగా చర్చించాల్సిన అంశం. సీఈఓకి అపారమైన మేధస్సు ఉండవచ్చు. ఆ మేధస్సు లేకపోతే ఫలితం రాదు. ఇదే సమయంలో ఎంత మేథస్సు ఉన్నా ఒక పరికరం లేదా పనిముట్టు లేనిదే ఆ మేథస్సు కొబ్బరినీళ్ళలా ఇంకిపోవాల్సిందే. అందుకోసమే శారీరక శ్రమ కూడా నైపుణ్యమైనదని గుర్తించాలి. తగిన ప్రతిఫలమివ్వాలి. ఈ వాదనతో పెట్టుబడి దారులే కాదు కొందరు వర్కర్లు కూడా ఒప్పుకోవడానికి సిద్ధంగా లేరు అందుకోసమే ఈ దోపిడీ నిరాఘాటంగా కొనసాగుతున్నది. పెట్టుబడిదారుడు పెట్టుబడి పెట్టాడు. కనుక అతనికి ఎంతైనా లాభం రావచ్చు, సీఈఓకి మేథస్సు ఉంది. కనుక ఎంతైనా జీతమివ్వచ్చు అనే నానుడి మారాలి. కానీ ఈ ధోరణి రానురానూ పెరుగుతుందే తప్ప తగ్గడం లేదు. ఈ క్రింది పట్టిక (ఇండియన్ ఎక్స్‌ప్రెస్ సౌజన్యంతో) ద్వారా ఏ ఏ దేశాలలో వర్కర్‌కి సీఈఓకి చెల్లించబడుతున్న వేతనాల వ్యత్యాసాలు అవగతమౌతున్నాయి.

దేశం	వర్కర్ వేతనం	సీఈఓ వేతనం	ఒక సీఈఓకి ఇస్తున్న అత్యధికం
అమెరికా	1	265(రెట్లు)	14.3 (మిలియన్లలో)
ఇండియా	1	229	1.5
ఇంగ్లాండు	1	201	8.0
చైనా	1	127	1.9
సౌత్‌ఆఫ్రికా	1	180	2.2
నెదర్లాండ్	1	171	8.2
స్విట్జర్లాండ్	1	152	8.5
కెనడా	1	149	6.5
స్పెయిన్	1	143	4.9
జెర్మనీ	1	136	6.2

ఈ వ్యత్యాసం 1993, నూతన ఆర్థిక విధానాల అమలు మొదట్లో, 1:20గా ఉండేది ఇప్పుడది 1:229గా మారడాన్ని బట్టి చూస్తే సంపద ఎటువైపు తరలి పోతుందో అర్థమౌతున్నది. సీఈఓలకు ఇంత భారీ చెల్లింపులు చేస్తున్న కంపెనీలు తమ ఆదాయాలను మరింత ఎక్కువ రేట్లలోనే పెంచుకుంటున్నాయి. విచిత్రమేమంటే, కంపెనీలు పెట్టుబడి పెట్టాయి. ఉన్నతాధికారులకు విశిష్ట తెలివితేటలున్నాయి. కాబట్టి వారిది అన్యాయం కాదంటూ అన్యాయానికి గురౌతున్న మధ్య, దిగువ మధ్యతరగతి వారు కూడా సమర్థించు కుంటుంటారు. ఇది పూర్తిగా అవగాహనా లోపం, ఉదాసీనత. ఇలాంటి వాదనలు ప్రచారంలో ఉన్నాయి కాబట్టే బిఎస్ఎన్ఎల్ సంస్థ అభివృద్ధికి సూచనల కోసం నియమించబడిన శ్యాంపిట్రోడా కమిటీ కూడా ఒక బయటి వ్యక్తిని అత్యధిక పారితోషికాన్నిచ్చి సీఈఓగా నియమించాలని సూచించింది. ఎక్కువ పారితోషికాలు తీసుకునే ఉన్నత స్థాయి ఉద్యోగులు క్రింది స్థాయి వర్కర్లను ముక్కు పిండి పనిచేయిస్తారనే వాదనను ఇది బలపరుస్తోంది. మార్కెటింగ్‌లో చురుకుగా ఉన్న ప్రయివేటు ఇన్సూరెన్స్ కంపనీల మొదలు యురేకా ఫోర్బ్సు వంటి అనేకానేక సంస్థలు తమ క్రింది స్థాయి ఉద్యోగులను పరుగులు పెట్టిస్తూ ఉక్కిరి బిక్కిరి చేస్తుంటాయి. కానీ పారితోషికాలు నామమాత్రంగానే ఇస్తున్నాయి. నిరుద్యోగ తీవ్రత దృష్ట్యా అమాయకులు ఈ దోపిడీలో బలిపశువులౌతున్నారు.

రాష్ట్ర ప్రభుత్వాలు కేంద్ర ప్రభుత్వం కలిసి కూలీల వేతనాలు, సంస్థలు ఆర్జించే లాభాలపై పర్యవేక్షణా నియంత్రణా మండలిని ఏర్పాటు చేసి దేశంలోని అన్ని చోట్లా శ్రమకు దగ్గ ప్రతిఫలాల్లో సమతుల్యత కోసం గట్టి ప్రయత్నం చేయాలి. అలాంటప్పుడే పెట్టుబడిదారుల దోపిడీకి అడ్డుకట్ట పడుతుంది.



ఒక ప్రత్యక్ష ఉదాహరణను పరిశీలిద్దాం. 1992లో హైదరాబాద్‌లో అడ్డామీది కూలీకి 20 నుండి 30 రూపాయలు లభించేవి (నెలకు రూ.900), అదే రోజుల్లో ఒక గుమాస్తాకు (బ్యాంకులు మొదలైన వంటివి) నెలకు రూ.1500 నుండి 2000 ఇస్తుండేవి. ఇప్పుడు అడ్డా కూలి వేతనం దాదాపు రూ.500, గుమాస్తా వేతనం దాదాపు రూ.80,000. ప్రపంచబాంకు విధానాలను అమలు పరిచే క్రమంలో విద్యుత్ సంస్థను నాలుగు విభాగాలుగా విభజించి ఉద్యోగులకు కూడా విపరీత వేతన వెసులుబాటును అప్పటి ప్రభుత్వం కల్పించింది. ఇలాంటి మార్పులు అన్ని చోట్లా జరగనప్పుడు జీవన ప్రమాణాల్లో సారూప్యత లోపిస్తుంది. ప్రభుత్వాల దగ్గర వేతనాల సమతుల్యత కోసం సరియైన మెకానిజమ్ సిద్ధంగా లేకపోవడం వల్ల ఇలా జరుగుతుంది.

ఎల్ఐసీలో పని చేస్తున్న కొందరు ఉద్యోగుల ఆధ్వర్యంలో "హెల్పింగ్ హ్యాండ్స్" అనే ఒక సహాయక గ్రూపు చలి తీవ్రత పెరిగి రోడ్లపై నివసించే అమాయక ప్రజానీకం చనిపోతున్నారన్న వార్తల దృష్ట్యా వారందరికీ ఒక రోజు అర్ధరాత్రి పూట హైదరాబాద్‌లో దుప్పట్ల పంపిణీ చేసింది. ఇందులో నేను కూడా పాల్గొన్నాను. ఈ సందర్భంగా ఆసక్తికరమైన అంశాలు గమనంలోకి వచ్చాయి. బేగం బజారు ప్రాంతంలో చాలా మంది రోడ్లపై పడుకుని చలికి వణుకుతున్న వారిని విచారిస్తే, వారిలో కొందరు అక్కడి దుకాణాల్లోకి అర్ధరాత్రిపూట వచ్చే లారీలను అన్‌లోడ్ చేసే తాత్కాలిక హమాలీలట. దుకాణాదారులు ఏలాంటి ఆవాసం(షెల్టర్) ఏర్పాటు చేయకుండా కావలసిన పని చేయించుకుని అణాపైసల హమాలినిచ్చి పంపిస్తారట. ఉదయం పూట పర్మనెంటు హమాలీలు ఉంటారు. కనుక భ్రుతి లేని ఇతరత్రా వారు ఇట్లాంటి బతుకుదెరువు వెతుక్కుంటున్నారు. ఇట్లాంటి వారంతా అనుకోని ప్రకృతి వైపరీత్యాలకు బలైపోతున్నారు. అవాంఛిత అలవాట్లకూ లోనౌతున్నారు. ఇట్లాంటి సంఘటనలకు బాధ్యులెవరు? ఖచ్చితంగా అక్కడి దుకాణాదారులు. ఈ దుకాణాదారుల వ్యవహారాలపై సరైన నియంత్రణ విధించని ప్రభుత్వాలూనూ. వ్యాపారస్తులు లాభాలార్జిస్తున్నారు. కానీ క్రింది స్థాయి వర్కర్లకు సముచిత చెల్లింపులు చేయటం లేదు. అందుకే సంపద అసమానతలు పెరుగుతూనే ఉన్నాయి.

ఇట్టాంటి నిశితమైన లోపాలపైన వామ పక్షాలు మినహా ఏ ఒక్క రాజకీయ పార్టీ దృష్టి పెట్టడం లేదు. కాంగ్రెస్, బీజేపీ లాంటి పెద్ద ఓటు బ్యాంకున్న పార్టీలు ఈ అసమానతలకు మూల సూత్రమైన అసంబద్ధ చెల్లింపులను నియంత్రించేందుకు ఏనాడూ ప్రయత్నించవు. వారికి తెలిసిందల్లా ఓట్లకోసం పేదలకు కొన్ని సబ్సిడీలు విదల్చుతామనే వాగ్దానాలను ఇవ్వటం. పేదలకిచ్చే సబ్సిడీలకన్నా పెద్దలకిచ్చే రాయితీలు చాలా ఎక్కువన్న సంగతి తెలుసుకోలేని పేదలు గెలిపించి ఓడిపోతూనే ఉంటారు. రాష్ట్ర ప్రభుత్వాలు కేంద్ర ప్రభుత్వం కలిసి కూలీల వేతనాలు, సంస్థలు ఆర్జించే లాభాలపై పర్యవేక్షణా నియంత్రణా మండలిని ఏర్పాటు చేసి దేశంలోని అన్ని చోట్లా శ్రమకు దగ్గ ప్రతిఫలాల్లో సమతుల్యత కోసం గట్టి ప్రయత్నం చేయాలి. అలాంటప్పుడే పెట్టుబడిదారుల దోపిడీకి అడ్డుకట్ట పడుతుంది.

సెల్:9951300016

వెండితెర బంగారుతీగ



ఆమె నటించింది కొద్ది సినిమాల్లోనే అయినా.. తెలుగు ప్రేక్షకులకు ఎంతో ఇష్టమైన వ్యక్తి. మాలపిల్లలో అమాయకమైన ఆమె అభినయం విమర్శకుల చేత ప్రశంసలు అందుకుంది. తొలితరం నటీమణులలో ఒకరైన ఆమే కాంచనమాల. గుంటూరు జిల్లా తెనాలి సమీపంలోని అమృతలూరులో కాంచన మాల జన్మించారు.

Women of the day

కాంచనమాల
(మార్చి 5, 1917 - జనవరి 24, 1981)



సంగీతంపై ఆసక్తితో ఆమె చిన్నాన్న దగ్గర సంగీతం నేర్చుకున్నారు. అందమైన ముఖం, విశాలమైన నయనాలు ప్రముఖ దర్శకులు సి. పుల్లయ్యను ఆకర్షించాయి. ఆమె చేత వై.వి.రావు నిర్మించిన శ్రీకృష్ణ తులాభారము (1935) లో మిత్రవింద పాత్రలో నటించే అవకాశం ఇచ్చారు. ఆ సినిమాలో తన అందం, అభినయంతో అందరిని ఆకర్షించారు. ఆ తర్వాత వీరాభిమన్యు (1936) లో కథానయిక స్థానం దక్కించుకున్నారు. ఆ తర్వాత వరుసగా విప్రనారాయణ (1937), మాలపిల్ల (1938), వందేమాతరం (1939),మళ్ళీ పెళ్ళి (1939), ఇల్లాలు (1940), మైరావణ (1940), బాలనాగమ్మ (1942) వంటి సినిమాలలో కథానాయిక పాత్ర పోషించారు. విప్రనారాయణ సినిమాలో దేవదేవిగా ప్రేక్షకులకు అలరించారు.

మాలపిల్లలో టైటిల్ రోల్ పోషించి, మాల పిల్ల ఇంత అందంగా ఉంటే ఎవరు పెళ్ళి చేసుకోరు? అని ఎందరి చేతనో అనిపించుకున్నారు కాంచనమాల. కులాంతర వివాహాల ఉద్యమాలు జరుగుతున్న ఆ కాలంలో ఆ సినిమా రావడం పెద్ద చర్చనీయంశంగా మారింది. ఆ సినిమా రెండవ భాగంలో ఆమె విద్యావంతురాలిగా కన్పిస్తారు. ఒక సీన్లో ఆమె చిరునవ్వుతో కాఫీ తాగే స్టిల్ ఎన్నో కాలెండర్ల మీద అచ్చయింది. అలా తొలితరం గ్లామర్ క్వీన్ గా వెలుగొందారు ఆమె. ఆ తర్వాత వచ్చిన వందేమాతరం సినిమాలో ఈమె చిత్తూరు నాగయ్య సరసన నటించారు. అది నాగయ్య రెండవ సినిమా. ఈ చిత్రం ద్వారా నాగయ్య, కాంచనమాల ఇద్దరూ చిత్ర పరిశ్రమలో మంచి పేరు, గుర్తింపు తెచ్చుకున్నారు.

కాంచన మాల నటించిన 'బాల నాగమ్మ' సినిమా అఖండ విజయం సాధించింది. ఆమె నటనకు ఈ సినిమా గీటురాయి. ఆ సినిమానే హీరోయిన్‌గా ఆమెకు ఆఖరి చిత్రం. ఆ తర్వాత ఆమె స్నేహితురాలు , నటి లక్ష్మీరాజ్యం 1963 లో 'నర్తనశాల' చిత్రం నిర్మించారు. ఇందులో ఓ చిన్న పాత్రలో ఆమె నటించారు. ఆర్థికఇబ్బందులు ఆమెను చుట్టేసి అనారోగ్యం పాలు చేశాయి. 1975 లో ప్రపంచ తెలుగు మహాసభల్లో ఘన సత్కారం పొందారు. విప్లవ కవి శ్రీశ్రీ కూడా అభిమానంతో కాంచనమాలపై కవితలల్లారు. ❄

ఆలూతో ఆల్



ఆలూని ఒక్కో ప్రాంతంలో ఒక్కో పేరుతో పిలుస్తారు. ఇందులో ప్రధానంగా పిండి పదార్థాలు ఉంటాయి. ఓ మోస్తరు బరువున్న దుంపలో 26 గ్రాములు పిండి పదార్థం ఉంటుంది. ఇది స్టార్చ్ రూపంలో ఉంటుంది కాబట్టి పొట్ట, చిన్న ప్రేవులలో స్రవించే ఎంజైముల వల్ల జీర్ణం కాదు. ఈ స్టార్చి నేరుగా పెద్ద పేగుల్లోకి చేరుతుంది. దీంతో పీచు పదార్థాలు వల్ల కలిగే ప్రయోజనాలే లభిస్తాయి. శరీర పౌష్టికత, కోలాన్ క్యాన్సర్ నుంచి భద్రత, గ్లూకోజ్ ఆధిక్యతను తట్టుకొనే శక్తి, కొలెస్టరాల్, ట్రైగ్లిజరైడుల తగ్గింపు లాంటి లాభాలు ఉంటాయి.

- ఆలూలో విటమిన్-సి, విటమిన్- బి6, పొటాషియం పుష్కలంగా ఉండమే కాదు, కొద్ది మొత్తంలో థయామిన్, రైబోఫ్లావిన్, ఫోలేట్, నియాసిన్, మెగ్నీషియం, ఐరన్, జింక్ లాంటి మూలకాలు లభిస్తాయి. ఆలూ పొట్టులో ఉన్న పీచు పదార్థం కూడా చాలా ఉపయోగకరం. ఓ మాదిరి దుంప పొట్టు ఎన్నో ధాన్యపు గింజల ద్వారా వచ్చే పీచుకు సమానం. అంతేకాదు ఇందులో కార్టినాయిడ్స్, పాలీఫినాల్స్ లాంటి ఫైటో రసాయనాలు ఉన్నాయి.
- కేవలం ఆహారంగానే కాదు, అందానికి కూడా ఆలూ మేలు చేస్తుంది. కళ్ల చుట్టూ ఉండే నల్లటి వలయాలను దీనితో తొలగించుకోవచ్చు. ఆలూ రసాన్ని దూదితో ముంచి, దాన్ని కళ్లపై పావుగంట సేపు ఉంచాలి. ఇలా రోజూ చేస్తే నల్లటి వలయాలు తగ్గుతాయి.
- ఆలురసంతో రోజూ ముఖాన్ని కడుక్కుంటే ముడతలు తగ్గుతాయి. ముఖంపై తెల్లటి మచ్చలు, ఎండకు కమిలిపోయిన చర్మానికి పొటాటో రసం రాస్తే చర్మం మళ్లీ మామూలు స్థితికి చేరుకుంటుంది.
- ఆలూని మిక్సీలో వేసి ఆ పేస్టుని ముఖానికి రాసుకుని అరగంట తర్వాత కడిగేస్తే చర్మం మృదువుగా మారి, పసిడిఛాయ పెరుగుతుంది. చర్మంపై ఉన్న జిడ్డు కూడా తొలగిపోవడంతో ముఖం తాజాగా మారుతుంది. బంగాళాదుంప రసానికి కొద్దిగా నిమ్మరసం, తేనె కలిపి ముఖానికి పట్టించి, పావుగంట తరువాత కడిగేస్తే చర్మం రంగు తేలుతుంది.

❄

ఇట్లచేద్దాం

క్యారెట్ ఎండిపోయినట్టు అనిపిస్తే ఈ విధంగా చేయండి. కొద్దిగా నీటిలో ఉప్ప వేసి అందులో క్యారెట్‌ను గంట పాటు నానబెట్టి బయటకు తీస్తే, తాజాగా ఉంటాయి.



ఆధునిక జీవన విధానం... మారుతున్న ఆహార అలవాట్లు... మనిషి ఆయువును తగ్గించేస్తున్నాయి. చిన్నవయసులోనే ఎన్నో అనారోగ్య సమస్యలు. అలాంటిది ఈమె మరికొద్ది రోజుల్లో 105 వ పుట్టిన రోజును జరుపుకోబోతున్నారు. అంతేకాదు ఈమె ఓ కమ్యూనిస్టు నాయకుడి భార్య. మరో ఉద్యమ నాయకురాలిని తయారు చేసిన చిన్నమ్మ. అంతకు మించి అభ్యుదయ భావాలు పుణికిపుచ్చుకున్న నిశ్శబ్ద ఉద్యమ కారిణి. ఆమే రాజరత్నమ్మ. ఆ బామ్మ గురించి మరిన్ని విశేషాలు...

నేటి తరానికి

ఆదర్శం ఈ బామ్మ

కడియాల రాజరత్నమ్మకు ప్రస్తుతం 104 ఏండ్లు. మానికొండ శ్రీరాములు, సరస్వతి దంపతులకు 1914లో పుట్టారు. వీరి సొంత ఊరు కృష్ణాజిల్లాలోని ఇందుపల్లి. వ్యవసాయ కుటుంబం. ఆ రోజుల్లో ఆడపిల్లలను చదివించడం అంటే మామూలు విషయం కాదు. అలాంటిది ఆమెను ఆరో తరగతి వరకు చదివించారు. ఆడపిల్లలకు చిన్న వయసులోనే పెండ్లి చేసే కాలమది. దాంతో ఆరో తరగతి పూర్తి కాగానే ఆమెకు పెండ్లి చేశారు.

కడియాల గోపాలరావును పెండ్లి చేసుకునే వరకు ఆమెకు బయట ప్రపంచం తెలియదు. పెండ్లి ఆమె జీవితాన్ని మార్చేసింది. భర్త అభ్యుదయ భావాలు కలిగిన వ్యక్తి. కమ్యూనిస్టు నాయకుడు. స్వాతంత్రోద్యమంలో పాల్గొన్నారు. ఉద్యమాల్లో, రహస్య జీవితంలో ఆమె ఎల్లప్పుడూ ఆయనకు చేదోడుగా ఉన్నారు. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత మొదటిసారి జరిగిన ఎన్నికల్లోనే కమ్యూనిస్టు పార్టీ తరపున ఎంపీగా పోటీ చేసి గెలిచారు. అలా రెండు సార్లు గుడివాడ నియోజకవర్గం నుంచి ఎంపీగా గెలిచారు గోపాలరావు.

సాహిత్య అధ్యయనం

సమాజం కోసం భర్త చేస్తున్న పోరాటాలు రాజరత్నమ్మను కదిలించాయి. ఇంట్లో అందుబాటులో ఉండే అభ్యుదయ సాహిత్యాన్ని చదివే వారు. భార్యతో హిందీ ట్రైనింగ్ చేయించాలని గోపాలరావు అలహాబాద్ తీసుకెళ్ళారు. ఆ కాలం లో ఇదో పెద్ద చర్చ. అలా18 ఏండ్ల వయసులో హిందీ ట్రైనింగ్ కోసం రాజరత్నమ్మ అలహాబాద్ వెళ్ళారు. అక్కడ నెహ్రూ తల్లిని, భార్యను, చెల్లిని కలిసే అవకాశం ఆమెకు దక్కింది. అయితే అనుకోకుండా టీబీ సోకడంతో ఆమె



భర్త గోపాలరావుతో..

హిందీ ట్రైనింగ్ చివరి పరీక్షలు రాయలేకపోయారు. పరీక్షలు రాయలేకపోయినా హిందీ చదవడం, రాయడం మాత్రం బాగా నేర్చుకున్నారు. అప్పట్లో హిందీ సాహిత్యంలో మంచి పుస్తకాలు వచ్చేవి. వాటిని తెప్పించుకుని విపరీతంగా చదివేవారు. ఇతర మహిళలతో వాటి గురించి చర్చించే వారు. 1956లో యునైటెడ్ కమ్యూనిస్టు పార్టీ తరపున భర్త గుడివాడలో పని చేసేవారు. అలాగే 'విప్లవ సందేశం' అనే పత్రికను కూడా నడిపేవారు. కమ్యూనిస్టు పార్టీపై నిషేధం విధించడంతో రహస్య ఉద్యమాలు చేయవల్సి వచ్చింది. ఆ సమయంలో గుడివాడ నుంచి వారు కాటూరు వచ్చేశారు.

చైతన్యం నింపడానికి

కాటూరు వచ్చిన తర్వాత రాజరత్నమ్మ ఓ చైతన్య వంతమైన మహిళగా రూపొందారు. అక్కడ చంద్రరాజేశ్వరరావు ఆధ్వర్యంలో మహిళల కోసం ఎన్నో కార్యక్రమాలు జరిగేవి. ఆనాడు పార్టీ కార్యకర్తల జాడచెప్పమని మహిళలను హింసించే వారు. అలాంటి సమయంలో వారి దాడుల నుంచి ఎలా తప్పించుకోవాలో చంద్ర రాజేశ్వరరావు స్వయంగా మహిళలకు మిలట్రీ డ్రిల్లులో ట్రైనింగ్ ఇచ్చేవారు. ఆ టీంలో రాజరత్నమ్మ కూడా ఉన్నారు. మహిళల్లో రాజకీయ చైతన్యం నింపడం కోసం సమావేశాలు పెట్టేవారు. ఆ సమావేశాలకు రాజరత్నమ్మ ఇల్లే కేంద్ర బిందువు. దాంతో అక్కడ జరిగే ప్రతి చర్చలో ఆమె భాగస్వామ్యం ఉండేది. ఆనాడు ఆడవాళ్ళు బయటకు



మొదటి మహిళా రాజకీయ శిక్షణ తరగతుల్లో పాల్గొన్న సమయంలో...

వెళ్ళినా, రాజకీయల గురించి మాట్లాడినా గ్రామ ప్రజలు, ముఖ్యంగా మగవారు నానామాటలు అనేవారు. అలాంటి అవమానాలను ఈమె కూడా ఎదుర్కొన్నారు. ఆ సమయంలో చంద్రరాజేశ్వరరావు ధైర్యం చెప్పి పంపేవారు.

దేశం పట్ల అభిమానం

భర్తతో పాటు స్వాతంత్ర్యోద్యమంలో రాజరత్నమ్మ కూడా పాల్గొన్నారు. విదేశీ వస్తు బహిష్కరణలో చురుకైన పాత్ర పోషించారు. అప్పట్లో ముదునూరు గ్రామానికి గాంధీ వచ్చినప్పుడు తెల్లవారు జామున 3 గంటలకు నిద్ర లేచి కాలినడకన 8 కిలోమీటర్లు నడిచి ఆయన్ని కలిసి వచ్చారు. దేశం పట్ల, దేశం కోసం పని చేస్తున్న నాయకుల పట్ల అంతటి అభిమానం ఉండేది ఆమెలో.

మణిపూసను తయారు చేశారు

పెండ్లయిన చాలా కాలానికి వీరికి పిల్లలు కలగలేదు. దాంతో అక్క కూతురైన మానికొండ సూర్యవతిని ఈవిడే పెంచారు. చిన్నాన, చిన్నమ్మ చేతిలో ఆమె ఓ మహిళా మణిపూసగా తయారయ్యారు. సూర్యవతి ఓ గొప్ప నాయకురాలిగా ఎదగడంలో గోపాలరావు పాత్ర ఎంత ఉన్నదో అంతకన్నా రాజరత్నమ్మ పాత్ర కీలకమైనదిగా చెప్పుకోవచ్చు. ఆ తర్వాత వీరికి కొడుకు లక్ష్మణరావు, కూతురు సుగుణ పుట్టారు. కమ్యూనిస్టుల ఆధ్వర్యంలో ఆనాడు జరిగిన మొట్టమొదటి మహిళా రాజకీయ శిక్షణా తరగతుల్లో ఈమె కూడా పాల్గొన్నారు. కాంగ్రెస్ సోషలిస్టు పార్టీలో పని చేస్తున్నప్పుడు నెలన్నరపాటు జైలు జీవితం కూడా అనుభవించారు. అప్పుడు ఆమె కుమార్తెకు ఐదేండ్లు.

జ్ఞాపక శక్తి అమోఘం

ప్రస్తుతం రాజరత్నమ్మకు 104 ఏండ్లు నిండాయి. అయినప్పటికీ ఆమె జ్ఞాపకశక్తి అమోఘం. నిన్న జరిగిన కొన్ని విషయాలనే మనం మర్చిపోతుంటాం. అలాంటిది ఆమె 80, 90 ఏండ్ల కిందట జరిగిన విషయాలను, ఉద్యమాలను, తన అనుభవాలను ఎంతో ఉత్సాహంగా మనకు చెబుతారు. ఫోటోలో మనిషిని చూపిస్తే వారి కుటుంబ సభ్యుల పేర్లతో సహ అందరి గురించి పూస గుచ్చినట్టు చెప్పగలరు. ఇప్పటికీ ఆమె జ్ఞాపక శక్తి అమోఘం. ఎంతో చురుగ్గా ఉన్నారు. వయసు రీత్యా వచ్చిన కీళ్ళ సమస్య, వినికిడి సమస్య తప్ప ఇతర ఆరోగ్య సమసమస్యలు ఏమీ లేవు. షుగర్, బీపీ, కొలెస్ట్రాల్ అంటే ఏమిటో ఆమెకు తెలియదు. ఇప్పటికీ పచ్చళ్ళు, స్వీట్స్, మిర్చి బజ్జీ ఎంతో ఇష్టంగా తింటారు. మరో గొప్ప విషయం ఏమిటంటే 90 ఏండ్లు దాటిన తర్వాత కూడా ఇంట్లో వంట చేయడానికి వచ్చే వారు. పిల్లలు వద్దని ఎంత వారించినా వినరు.

శ్రమచేయడం వల్లనే...

మీ ఆరోగ్య రహస్యం ఏమిటని అడిగితే 'ఎన్ని సమస్యలు వచ్చినా ప్రశాంతంగా ఉంటాను. వాటి నుంచి బయటపడటానికి ఇతర పనులవైపుకు నా మనసుని మళ్ళిస్తాను. ఇంటి పనులు చేస్తూ, శారీరకంగా శ్రమించడం వల్లనే నేను ఇంత ఆరోగ్యంగా ఉండగలుగుతున్నాను' అంటూ చిరునవ్వులు చిందిస్తూ సమాధానం చెప్పారు మన బామ్మ. ఈ మధ్య కాలంలో కిందపడి బామ్మకు చిన్న దెబ్బ తగిలింది. దాంతో గతంలో మాదిరిగా ఉత్సాహంగా మాట్లాడలేకపోతున్నారు. కానీ ఇప్పటికీ కూర్చుని చేసే ఇంటి పనుల్లో సాయం చేస్తారు. మరో ముఖ్యమైన విషయం ఏమిటంటే బామ్మకు శుభ్రత, క్రమశిక్షణ ఎక్కువ.

చర్చలు జరుపుతారు

వయసు పది పదులు దాటిపోయినా ఇప్పటికీ ప్రతిదాన్ని పరిశీలించడం, సూక్ష్మదృష్టితో విశ్లేషించడం ఆమె తత్వం. పేపర్లో మహిళల గురించి ఎలాంటి వార్తలు వచ్చినా ఆసక్తిగా చదువుతారు. వాటిపై చర్చలు జరుపుతారు. పేపర్లో ముఖ్యమైన విషయాలను కత్తిరించి ఇతరులతో చదివిస్తుంటారు. మరో విషయం ఏమిటంటే ఏండ్లు గడుస్తున్నా అమలుకు నోచుకోని మహిళా రిజర్వేషన్ బిల్లు గురించి చర్చకు వచ్చినప్పుడల్లా ఆమె బాధపడుతుంటారు. మహిళలు పోరాడి ఆ బిల్లును సాధించాలంటారు. అంతేకాదు కొత్తగా ఇండ్లు కట్టుకునేవారికి మంచి మంచి సలహాలు ఇస్తారు. ఇంజనీర్ల కంటే గొప్పగా ఇంటి ప్లాన్లు వేయడం ఆమెలో చెప్పుకోదగిన మరో విశేషం.

ఇన్నేండ్లుగా మహిళ గురించి ఆలోచిస్తూ సమస్యలపై స్పందిస్తూ ఆరోగ్యంగా ఉన్న ఈ బామ్మ నేటి తరానికి నిజంగా స్ఫూర్తిదాయకం. గత ఏడాది తన 104వ పుట్టిన రోజును బిడ్డలు, మనవళ్ళు, మనవరాళ్ళు, మునిమనవళ్ళు ఇలా నాలుగు తరాల వారితో ఘనంగా జరుపుకున్నారు. ఇలాగే ఈ బామ్మ మరెన్నో పుట్టిన రోజులు చేసుకుంటూ యువతరానికి మరెంతో స్ఫూర్తినివ్వాలని కోరుకుందాం...

సలీమ

బుజ్జాయి బుంగమూతి పెడితే...



చిన్న పిల్లలకు కొన్ని రకాల ఆహార పదార్థాలను చూస్తే మొహం చిట్లిస్తారు. మరికొంత మంది తినడం ఇష్టం లేక బుంగమూతి పెడతారు. పెద్దవాళ్ళు కోప్పడతారని ఇష్టం లేకపోయినా బలవంతంగా తింటారు. అవి తిన్న దగ్గర నుంచి రకరకాల సమస్యలు వస్తుంటాయి. ఆ సమస్యల గురించి పెద్దవాళ్ళకు తెలియక పిల్లలు ఎందుకు అలా ప్రవర్తిస్తున్నారో అర్థం కాక తికమకపడుతుంటారు. పిల్లలు ప్రతి విషయానికి ఆందోళన చెందుతున్నట్టు, దిగులు పడుతున్నట్టు కనిపిస్తారు. మీ బిడ్డ కూడా ఇలాంటి రుగ్మతతో బాధపడుతుందా? అయితే జాగ్రత్తగా ఉండండి. అంటున్నారు పరిశోధకులు.

ఇటీవల జరిగిపిన ఓ పరిశోధన ప్రకారం ఇలా పిల్లలకు కొన్ని రకాల ఆహార పదార్థాలు సరిపడకపోవడాన్ని అది ఆహారం పట్ల అలర్జీ కారణమని తేల్చారు. ఈ పరిశోధన ఫలితాలను బట్టి ఆహారం అలర్జీ వున్న పిల్లల్లో ముఖ్యంగా పసిపిల్లల్లో ఆందోళన పడే సమస్య ఎక్కువ ఉన్నట్టు తేలింది.

ఆహారపు అలర్జీలు ముఖ్యంగా చుట్టూ ఉన్న వారు తమ గురించి ఏమనుకుంటున్నారో అనే కంగారు, సమాజంలో వారి పట్ల చూపే తిరస్కరణ, అవమానపు భయాలకు కారణమవుతాయని పరిశోధకులు చెబుతున్నారు.

ఈ పరిశోధన గురించి కొలంబియా యూనివర్సిటీకి చెందిన రచయిత 'రీనీ గుడ్ విన్' మాట్లాడుతూ "ప్రాణాంతకమైన వాటితో ఎలా జీవించాలా అన్న ఆలోచన ఆందోళనకి కారణం కావచ్చు. కొందరు పిల్లలు మిగతా వారి కంటే తాము వేరు అన్న భావనతో సోషల్ యాంగ్జయిటీకి గురి కావచ్చు. ఇది వారి వయసు, ఆహారపు అలర్జీలను పెద్దవారు ఎలా పరిష్కరిస్తున్నారన్న దానిపై ఆధారపడి ఉంటుంది" అన్నారు.

జర్నల్ ఆఫ్ పీడియాట్రిక్స్‌లో ప్రచురితమైన అధ్యయనంలో, వారి బృందం 4-12 ఏండ్ల మధ్య ఇలాంటి ఆందోళన సమస్యతో



బాధపడుతున్న చిన్నపిల్లలను ఆహారం అలర్జీ ఉన్నవారు, లేనివారుగా వారిని సంరక్షించే వారి స్థితిని బట్టి విశ్లేషించారు.

ఆహారం అలర్జీ ఉన్న పిల్లల్లో 57 శాతం మంది, 48శాతం అలర్జీ లేని పిల్లల కన్నా ఆందోళన ఉన్నట్లు తెలిపారు. ఆహారపు అలర్జీల లక్షణాలు చిన్నప్పటి డిప్రెషన్ లక్షణాలతో కానీ, ఆందోళన, సంరక్షకుల డిప్రెషన్‌తో కానీ సంబంధం ఉన్నట్టు తెలియలేదు.

ఈ పరిశోధకులు తర్వాత ఇవే ఫలితాలను కొంచెం పెద్దపిల్లల్లో, యువతలో, డిప్రెషన్ చాలా ఉన్నవారిలో ఈ ఆహారపు అలర్జీల వల్ల ఎలాంటి ప్రభావాలు ఉన్నాయో పరీక్షించాలని భావిస్తున్నారు. ఎందుకంటే మొదట్లో ఉండే ఆందోళనే తర్వాత డిప్రెషన్‌గా మారే అవకాశం ఉంది. పిల్లల ఆందోళన సమస్య డిప్రెషన్ వరకు వెళ్ళ కుండానే పరిష్కరించుకోవడానికి ఈ పరిశోధన ఉపయోగపడుతుందని వారి భావన. అయితే తల్లిదండ్రులు తమ పిల్లలు తీసుకునే ఆహారంపై ప్రత్యేక శ్రద్ధపెట్టాలి. అలా చేయడం వల్ల ఎలాంటి ఆహారం తీసుకుంటున్నప్పుడు వారు ఆందోళనకు గురవుతున్నారో తెలుసుకోవచ్చు. అలాంటి ఆహారాన్ని పిల్లలకు దూరంగా ఉంచితే సమస్య నుంచి బయటపడొచ్చు అంటున్నారు పరిశోధకులు. ❄

మాంసాహారం

అతిగా లాగిస్తున్నారా? అధిక కెలోరీలు కలిగిన శీతల పానీయాలు రోజూ అతిగా తాగుతున్నారా? అయితే జాగ్రత్త!! వాటివల్ల క్యాన్సర్ బారిన పడే ప్రమాదం ఉందని తాజా అధ్యయనం ఒకటి వెల్లడించింది. పరిశోధకులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆరోగ్యం ఉండటానికి ఆహారం ఎంత ముఖ్యమో, అతిగా ఆహారం తీసుకోవడం వల్ల కూడా అంతే ప్రమాదం. దీనివల్ల స్త్రీ, పురుషుల్లో పెద్ద పేగుల క్యాన్సర్ ముప్పు వచ్చే అవకాశం ఉంది.

బోస్టన్‌లోని హర్వార్డ్ టీహెచ్ చాన్ స్కూల్ ఆఫ్ పబ్లిక్ హెల్త్ పరిశోధకులు గత 26 ఏళ్లుగా 1,21,050 మంది పురుషులు, స్త్రీల ఆరోగ్య పరిస్థితులను విశ్లేషించారు. ఈ సందర్భంగా ఆయా వ్యక్తులు తినే ఆహారం, వారి ఆరోగ్య పరిస్థితులు గురించి లోతుగా అధ్యయనం చేశారు. ఈ సందర్భంగా అతిగా మాంసం, అధిక కెలోరిలు కలిగిన శీతల పానీయాలు తాగేవారిలో పెద్ద పేగు క్యాన్సర్ ఏర్పడినట్టు గుర్తించారు. అలాగే శుద్ధి చేసిన ధాన్యాలను అతిగా తీసుకున్నవారిలో కూడా ఈ లక్షణాలు కనిపించినట్లు పేర్కొన్నారు.

ఏదైనా 'అతి' అనర్థదాయకం. కాబట్టి మాంసాహారమైనా, శాఖహారమైన సమతుల్యంగా ఉన్నప్పుడే మనిషి ఆరోగ్యంగా ఉంటాడు. లేకపోతే దీర్ఘకాలిక రోగాల బారిన పడే ప్రమాదం ఉంది.

ధాన్యాలు 11శాతం

రోజుకు ఎనిమిది శాతం నీళ్లు తాగండి. పాల ఉత్పత్తులను మీ ఆహారంలో 2 నుంచి 3 శాతం ఉండేలా చూసుకోండి. కూరగాయలు మూడు నుంచి ఐదు శాతం ఉండేలా ప్లాన్ చేసుకోండి. పండ్లు రెండు నుండి నాలుగు శాతం కచ్చితంగా ఆహారంలో ఉండాలి. నూనె పదార్థాలు, స్వీట్లు, కొవ్వులు ఎంత తక్కువ తీసుకుంటే అంత మంచిది. మాంసం, గుడ్లు, పప్పులు, గింజలు రెండు నుంచి మూడు శాతంగా ఉండాలి. బ్రెడ్, బియ్యం వంటి ధాన్యాలు ఆరు నుంచి 11శాతం ఉండేలా జాగ్రత్తలు తీసుకోండి. ఆరోగ్యంగా ఉండండి! ❄



నారాయణ, శ్రీచైతన్యలకు హైకోర్టు నోటీసులు



హైదరాబాద్: విద్యార్థుల ఆత్మహత్యలపై నారాయణ, శ్రీ చైతన్య కళాశాలలకు హైకోర్టు నోటీసులు జారీ చేసింది. ఈ రెండు కళాశాలలతో పాటు ఏపీ, తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులు, విద్య, హోం శాఖల ప్రధాన కార్యదర్శులు, ఇంటర్ బోర్డు కార్యదర్శులు, నిమ్స్, నిమ్స్ డైరెక్టర్లకు హైకోర్టు నోటీసులు జారీ చేసి వివరణ ఇవ్వాల్సిందిగా ఆదేశించింది. ప్రైవేట్ విద్యా సంస్థల్లో, ఐఐటీల్లో విద్యార్థులు తీవ్ర ఒత్తిళ్ల కారణంగా ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని, ఇందుకు కారణమైన కార్పొరేట్ కాలేజీలపై క్రిమినల్ కేసులు పెట్టాలని కోరుతూ లోక్‌సత్తా ఉద్యమ సొసైటీ ప్రకాశం జిల్లా కన్వీనర్ దాసరి ఇమ్మాన్యుయేల్ రాసిన లేఖను హైకోర్టు ప్రజాహిత వ్యాజ్యంగా పరిగణించింది మంగళవారం విచారణ చేపట్టింది. ఉదయాసాయంత్రం చదువుకోవాల్సిన విద్యార్థులపై ర్యాంకుల కోసం తీవ్ర ఒత్తిడి పెంచుతున్నారని, దాని ఫలితంగానే పలు కార్పొరేట్ విద్యా సంస్థల్లో విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకునే దుస్థితి ఏర్పడిందని ఈ సందర్భంగా హైకోర్టు తీవ్ర వ్యాఖ్యలు చేసింది. దీనిలో తల్లిదండ్రుల పాపం కూడా ఉందని వ్యాఖ్యానించింది. 90 శాతం మార్కులు రావాలనే ఏకైక లక్ష్యంగా పిల్లలు ఏమవుతున్నారో కూడా చూడకుండా ఒత్తిడి పెట్టించుకోవడం లేదని మంగళవారం హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి రమేష్ రంగనాథన్, న్యాయమూర్తి ఎం.గంగారావులతో కూడిన డివిజన్ బెంచ్ ఆందోళన వెలిబుచ్చింది. సాక్షాత్తు ఏపీలో ఒక మంత్రికి చెందినదే కార్పొరేట్ కాలేజీ అని, కాలేజీలకు, హాస్టల్స్‌కు అనుమతులు లేకుండా నడుపుతున్నారని పిటిషనర్ వాదన. ఆత్మహత్యలకు పాల్పడిన కాలేజీలపై విచారణ జరిపి నివేదికలు ఇవ్వలేదని, ఆత్మహత్య ఘటనల తర్వాత కన్న తల్లిదండ్రుల్ని కూడా మతదేహాల దగ్గరకు వెళ్లనీయనంత కాఠిన్యంగా యజామాన్యాలు వ్యవహరిస్తున్నాయని, ఆయా కాలేజీ యాజమాన్యాలపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని ఆయన హైకోర్టును కోరారు. ఈ కేసు విచారణను మూడు వారాలకు హైకోర్టు వాయిదా వేసింది.

ప్రమాదం జరిగితే బాధ్యులెవరు..

రాజధానిలోని ప్రసాద్ మల్టీప్లెక్స్ థియేటర్‌లో సీట్ల ఏర్పాటు అశాస్త్రీయంగా ఉన్నాయని, ఏదైనా ప్రమాదం జరిగితే ప్రేక్షకులు బయటకు వెళ్లే పరిస్థితి లేదనే కేసులో తెలంగాణ సర్కార్‌లోని పలువురు అధికారులకు హైకోర్టు నోటీసులు జారీ చేసింది. ఈ మేరకు హైకోర్టుకు సికింద్రాబాద్‌కు చెందిన విజయ్‌గోపాల్ అనే వ్యక్తి రాసిన లేఖను ప్రజాహిత వ్యాజ్యంగా పరిగణించింది. మంగళవారం హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి రమేష్ రంగనాథన్, న్యాయమూర్తి ఎం.గంగారావులతో కూడిన డివిజన్ బెంచ్ విచారణ చేపట్టింది. లార్జ్ స్క్రీన్ థియేటర్‌లో పద్నాలు వరసల్లో 630 సీట్లు ఉంటే వాటి మధ్య నుంచి బయటకు వచ్చే ఆస్కారమే లేకుండా సీట్లు ఉంటాయని పిటిషనర్ వాదన. పోలీసులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేకపోవడంతో హైకోర్టుకు లేఖ రాయాల్సివచ్చిందన్నారు. దీనిని మంగళవారం విచారించిన బెంచ్.. ప్రతివాదులైన తెలంగాణ సీఎస్, మున్సిపల్, హోం, రెవెన్యూ శాఖల అధికారులు, డీజీపీ, జిల్లా కలెక్టర్, నగర పోలీస్ కమిషనర్, థియేటర్ యాజమాన్యాలకు నోటీసులు జారీ చేసింది. తమ వాదనలతో కౌంటర్ పిటిషన్లు దాఖలు చేయాలని ఆదేశిస్తూ విచారణను మూడు వారాలకు వాయిదా వేసింది.

అశ్రద్ధ వహిస్తే..భూసేకరణ చేయకుండా ఉత్తర్వులిస్తాం

భూసేకరణ వివరాలు అందజేయడంలో అశ్రద్ధ వహిస్తే భూసేకరణ చేయకుండా ఉత్తర్వులు ఇవ్వాల్సివస్తుందని తెలుగు రాష్ట్రాలను హైకోర్టు హెచ్చరించింది. తెలంగాణ ప్రభుత్వం వివరాలు పూర్తి ఇవ్వకపోడంపై మండిపడింది. ఏపీ ప్రభుత్వం వివరాలే ఇవ్వకపోడంపై ఆగ్రహాన్ని వ్యక్తం చేసింది. వివిధ ప్రాజెక్టులు, ఇతర అవసరాల కోసం ఎన్ని భూసేకరణ నోటీసులు జారీ చేశారో.. వాటిలో ఎన్ని కొత్త భూసేకరణ చట్టం కింద ఉన్నాయో.. ఎన్ని భూసేకరణ ఉత్తర్వులు అమలు చేశారో, ఇంకా ఎన్నింటిని అమలు చేయాలో తెలియజేయాలని మంగళవారం హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి రమేష్ రంగనాథన్, న్యాయమూర్తి ఎం.గంగారావులతో కూడిన డివిజన్ బెంచ్ తెలంగాణ/ఏపీ రాష్ట్రాలకు ఆదేశాలు జారీ చేసింది.

భూసేకరణపై కోర్టులు ఇస్తున్న ఉత్తర్వుల్ని కలెక్టర్లు సకాలంలో అమలు చేయకపోవడంతో పలువురు రైతులు అప్పీల్ దాఖలు చేయడంతో కోర్టుల్లో కేసుల పెరిగిపోతున్నాయని, కేసుల పెండింగ్, రైతులకు పరిహారం అందడంలో జాప్యం కూడా అవుతోందని పేర్కొంటూ మహబూబ్‌నగర్ జిల్లా ప్రిన్సిపల్ జడ్జి జి.వెంకటకృష్ణయ్య రాసిన లేఖను హైకోర్టు ప్రజాహిత వ్యాజ్యంగా స్వీకరించి మంగళవారం విచారణ జరిపింది. తెలంగాణ సర్కార్ వివరాలు సాదాసీదాగా ఉన్నాయని హైకోర్టు అభిప్రాయపడింది. ఆ వివరాల ప్రకారం రైతులకు రూ.500 కోట్ల వరకు చెల్లించాల్సివుందని, అయినా భూసేకరణ కొనసాగించడం ఎంతవరకు సబబని బెంచ్ ప్రశ్నించింది. ఏపీ సర్కార్ అయితే మరో అడుగు ముందుకు వేసి వివరాలేమీ లేకుండా వాయిదా కోరడం పరాకాష్ట అని బెంచ్ మండిపడింది. విచారణ మూడు వారాలకు వాయిదా పడింది.

పాలమూరు యంత్రాలధరపై విచారణ

పాలమూరు ఎత్తిపోతల పథకంలో ఎలక్ట్రో మెకానికల్ యంత్రాల ధరల పెంపును సవాల్ చేస్తూ దాఖలైన వ్యాజ్యంపై మరోసారి హైకోర్టు విచారణ వాయిదా పడింది. పాలమూరు..రంగారెడ్డి ఎత్తిపోతల పథకం పరికరాల ధరల పెంపు ఆరోపణలపై ఇప్పటికే నోటీసులు అందుకున్న తెలంగాణ ప్రభుత్వం, బీహెచ్ఇఎల్‌లు తమ వాదనలతో కౌంటర్ వేసేందుకు 3 వారాల గడువు మంజూరు చేసింది.

ఫుట్‌పాత్‌లపై ఆక్రమణలపై హైకోర్టు ఆగ్రహం

పాదచారులు నడవాల్సిన ఫుట్‌పాత్‌లపై వ్యాపారాలు జరుగుతుంటే అధికారులు ఆక్రమణల్ని తొలగించేందుకు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదు. అధికారులు మీనమేషాలు లెక్కిస్తుంటే హైకోర్టు చూస్తూ కూర్చోదు. అందుకే నగరంలోని సిద్ధి అంబర్‌బజార్, మహబూబ్‌గంజ్‌లలో ఫుట్‌పాత్‌ల ఆక్రమణల పరిశీలన చేసి నివేదిక ఇవ్వాలని హైదరాబాద్ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్‌ను ఆదేశిస్తున్నాం.. అని హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి రమేష్ రంగనాథన్, న్యాయమూర్తి ఎం.గంగారావులతో కూడిన డివిజన్ బెంచ్ మంగళవారం ప్రకటించింది. న్యాయాధికారి స్వయంగా ఆయా ప్రదేశాలకు వెళ్లి వాస్తవ పరిస్థితిపై సమగ్ర నివేదిక ఇవ్వాలని బెంచ్ ఉత్తర్వులు జారీ చేసింది.

'టీఆర్టీపై తప్పుడు ప్రచారం చేస్తున్న కోచింగ్ సెంటర్లు'

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

వచ్చేనెల 24 నుంచి జరిగే ఉపాధ్యాయ నియామక పరీక్ష (టీఆర్టీ) వాయిదా పడుతుందని కొన్ని కోచింగ్ సెంటర్లు తప్పుడు ప్రచారం చేస్తున్నాయని రాష్ట్ర డీఎడ్, టీఆర్టీ అభ్యర్థులు విమర్శించారు. ఇలాంటి ప్రచారం చేసే ఆయా సంస్థలపై చర్యలు తీసుకోవాలని తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీఎస్‌పీఎస్సీ)ని పలువురు అభ్యర్థులు రామ్మోహన్‌రెడ్డి, శ్రీనునాయక్, శ్రీనివాస్‌యాదవ్, స్వామిరెడ్డి, లక్ష్మణ్‌గౌడ్, గురుప్రసాద్, మహేష్, బాలరాజు, భాను, మేఘన, నిహారిక శిరీష మంగళవారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. ఈ అసత్య ప్రచారం చేయడం వల్ల ఎన్నో ఏండ్లుగా చదువుతున్న నిరుద్యోగ ఉపాధ్యాయ అభ్యర్థులు తీవ్రంగా నష్టపోతారని తెలిపారు.

క్షయ నియంత్రణలో వైద్య కళాశాల పాత్ర భేష్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

టీబీని నియంత్రించడంలో వైద్య కళాశాలల పాత్ర మరువలేనిదని టీబీ కేంద్ర అడిషనల్ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ డాక్టర్ రఘురామ్ అన్నారు. కళాశాలల్లో వ్యాధి నివారణను కార్యక్రమాలను మరింత చురుగ్గా నిర్వహించాల్సిన అవసరం ఉందని చెప్పారు. 'టీబీ నియంత్రణపై వైద్య కళాశాలల పాత్ర' అనే అంశంపై హైదరాబాద్‌లోని కామినేని అకాడమీ ఆఫ్ మెడికల్ సైన్సెస్ అండ్ రీసెర్చ్‌లో రెండు రోజుల జోనల్ టాస్క్‌ఫోర్స్ వర్క్‌షాప్‌ను ఆయన ప్రారంభించారు. అనంతరం రాష్ట్ర వైద్యవిద్య డైరెక్టర్ డాక్టర్ రమేష్‌రెడ్డి మాట్లాడుతూ టీబీని నియంత్రించడంలో రాష్ట్రంలోని వైద్య కళాశాలలు కీలకపాత్ర పోషిస్తున్నాయని చెప్పారు. వ్యాధి లక్షణాలు కలిగిన రోగులను గుర్తించి మెరుగైన చికిత్స అందించామని తెలిపారు. వైద్య కళాశాలలు నైపుణ్యాన్ని పరిగణనలోకి తీసుకొని వ్యాధి పరిశోధనలో ప్రధానపాత్ర పోషించాలని సూచించారు.

ఫార్మసీ కౌన్సిల్ ఏర్పాటు చేయాలి

రాష్ట్రంలో ఫార్మసీ కౌన్సిల్‌ను వెంటనే ఏర్పాటు చేయాలని తెలంగాణ ఫార్మా సొసైటీ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ సంజయ్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్రం ఏర్పడి మూడున్నరేండ్లు గడిచినా కౌన్సిల్ ఏర్పాటు కాకపోవడంతో విద్యార్థులు ఎన్నో ఇక్కట్లకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు ఫార్మా కళాశాల ప్రిన్సిపల్స్, అధ్యాపకులు, వందలాది విద్యార్థులు సంజయ్‌రెడ్డి నేతృత్వంలో మంగళవారం రాష్ట్ర వైద్యఆరోగ్యశాఖ మంత్రి లక్ష్మారెడ్డిని ఆయన నివాసంలో కలిసి వినతిపత్రం అందజేశారు.

సమరోత్సాహంలో త్రిపుర లెఫ్ట్‌ఫ్రంట్

- అన్ని స్థానాలకూ అభ్యర్థుల ప్రకటన
- మహిళలకు ఏడు స్థానాలు
- 12 మంది కొత్తవారికి చోటు



మాట్లాడుతున్న త్రిపుర సీఎం మాణిక్ సర్కార్



మహిళలతో కరచాలనం చేస్తున్న బృందాకరత్

అగర్తల : త్రిపుర అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేయనున్న అభ్యర్థుల జాబితాను లెఫ్ట్‌ఫ్రంట్ మంగళవారం విడుదల చేసింది. మొత్తం 60 స్థానాలకు గాను సీపీఐ(ఎం) 57 స్థానాల్లోనూ, సీపీఐ, ఆర్ఎస్‌పీ, ఫార్వర్డ్‌బ్లాక్ ఒక్కొక్క స్థానంలోనూ పోటీ చేయనున్నాయి. వీటిలో ఏడు స్థానాలను మహిళలకు కేటాయించారు. 12 స్థానాల్లో కొత్తవారికి చోటు కల్పించారు. సిట్టింగ్ ఎమ్మెల్యేల్లో నిరంజన్ దేబ్‌వర్మ (తకర్జల), లలిత్ దేబ్‌వర్మ (అంబస్స), ఫైజుర్ రెహ్మాన్ (కదంతల-కుర్తి), సుబోధ్ దాస్ (పబిసాగర్), అరుణ్ కుమార్ వైద్య (పెచార్తల్)లను ఈ సారి పోటీ నుంచి మినహాయించారు.

త్రిపురలో ఉగ్రవాద సంస్థ ఐపీఎఫ్‌టీతో చేతులు కలిపి బీజేపీ హింసాత్మక దాడులకు తెగబడుతూ వస్తున్న నేపథ్యంలో అసెంబ్లీ ఎన్నికలు జరుగుతున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ఉగ్రవాద, మతోన్మాద కూటమిని ఓడించి వామపక్ష కూటమిని తిరిగి ఎన్నుకోవాలని ప్రజలకు లెఫ్ట్‌ఫ్రంట్ పిలుపునిచ్చింది.

జనసంద్రాలుగా లెఫ్ట్‌ఫ్రంట్ ప్రచారసభలు

వామపక్ష అభ్యర్థుల ప్రకటనతో త్రిపుర అంతటా లెఫ్ట్‌ఫ్రంట్ శ్రేణుల్లో సమరోత్సాహం కనిపించింది. త్రిపుర ముఖ్యమంత్రి మాణిక్ సర్కార్, సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు బృందాకరత్, సుభాషిణీ అలీ, కేంద్ర కమిటీ సభ్యులు, సీఐటీయూ ప్రధానకార్యదర్శి తపన్ సేన్ తదితర నేతృత్వంలో నిర్వహించిన బహిరంగ సభలకు ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఈ సభలన్నీ అరుణ పతాకాలతో ఎర్రని జనసంద్రాలను తలపించాయి.

హవేలీయాలోని దుక్లీ సబ్ డివిజన్‌లో నిర్వహించిన భారీ బహిరంగ సభలో మాణిక్ సర్కార్ ప్రసంగించారు. ఎనిమిదో వామపక్ష కూటమి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసితీరుతామని బహిరంగ సభకు తరలివచ్చిన వేలాది మంది ప్రజలు నినాదాలు చేశారు. ఆర్థికశాఖ మంత్రి భానులాల్ షా పోటీ చేస్తున్న బిషాల్‌ఘర్ నియోజకవర్గంలో బృందాకరత్ బహిరంగ సభ నిర్వహించారు. లెఫ్ట్‌ఫ్రంట్ తరఫున సీపీఐ(ఎం) అభ్యర్థి రామేంద్ర నారాయణ్ పోటీ చేస్తున్న చరిలాం స్థానంలో నిర్వహించిన బహిరంగసభలో సుభాషిణి అలీ ప్రసంగించారు.

ఏపీలో కదంతొక్కిన స్కీం వర్కర్లు

వెట్టి చాకిరికి స్వస్తి పలకండి : విజయవాడలో భారీ ధర్నా



అమరావతి : కనీస వేతనం రూ.18 వేలు ఇవ్వాలని, పీఎఫ్, గ్రాట్యుటీ తదితర డిమాండ్లతో ఏపీ స్కీం వర్కర్ల సమ్మె పిలుపు మేరకు మంగళవారం రాష్ట్ర వ్యాప్తంగా కదం తొక్కారు. విజయవాడలో ధర్నాచౌక్ వద్ద ఆందోళన కార్యక్రమాన్ని చేపట్టారు. దశాబ్దాల నుంచి వివిధ కేంద్ర ప్రభుత్వ పథకాలలో పనిచేస్తున్న తమకు కనీస వేతనాల్లేవని, కేవలం పారితోషకాలు, గౌరవ వేతనాల పేరుతో తమతో ప్రభుత్వం వెట్టి చాకిరి చేయిస్తోందని స్కీం వర్కర్లు ఆవేదన చెందారు. ఈ సందర్భంగా జాతీయ ఆరోగ్య మిషన్ (ఎన్‌హెచ్‌ఎమ్), 108, సర్వ శిక్ష అభియాన్, అంగన్‌వాడీ, ఆశా, మధ్యాహ్న భోజన వంటి తదితర ప్రభుత్వ పథకాల్లో పనిచేస్తున్న మహిళలు పెద్దఎత్తున ఆందోళనలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలిండియా సీఐటీయూ ఉపాధ్యక్షులు జి. బేబిరాణి మాట్లాడుతూ పేదల్ని ఆదుకొనేందుకు, పౌష్టికాహారాన్ని అందించడం, శిశు మరణాల రేటును తగ్గించడం, విద్య, వైద్య సదుపాయాల్ని అందించడం ప్రభుత్వ బాధ్యత అన్నారు. అంగన్‌వాడీ సెంటర్లను కుదించి, నగదు బదిలీ ప్రవేశపెట్టడంతో ప్రభుత్వం లబ్ధిదారులకు నష్టం చేకూరే నిర్ణయాల్ని తీసుకుంటున్నారు. దేశంలో 4 వేల అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణ వేదాంత సంస్థకు అప్పగించడానికి సిద్ధమవుతున్నారు. వైద్య ఆరోగ్య రంగాన్ని ప్రయివేటు సంస్థలకు అప్పగిస్తూ కనీస వేతనాలివ్వకుండా ఎన్‌హెచ్‌ఎమ్ పథకాల్లో పనిచేస్తున్న ఉద్యోగులకు అన్యాయం చేస్తోందన్నారు.

కేసీఆర్‌ను కలిస్తే కాంగ్రెస్‌కు నష్టమేంటీ..

కుల, మత ప్రస్తావన లేకుండా ముందుకు ..

- అన్ని సామాజిక తరగతులను కలుపుకుని పోతాం
- మార్చి 14న పూర్తి విధివిధానాలు: జనసేన అధినేత పవన్‌కళ్యాణ్
- కరీంనగర్‌లో కార్యకర్తలతో సమావేశం



నవతెలంగాణ-కరీంనగర్ ప్రతినిధి

సీఎం కేసీఆర్‌ను కలవడం వల్ల కాంగ్రెస్‌కు నష్టమేంటో తెలియడం లేదు. ఈ విషయాన్ని ఆ పార్టీ నాయకులు రాద్ధాంతం చేయడం విడ్డూరంగా ఉంది. తెలంగాణ భావోద్వేగాలు నాకు తెలుసు. ఇక్కడి యాస, భాష, సంస్కృతిని ప్రేమిస్తా. నన్ను ద్వేషించే వారిని పట్టించుకోను. జై తెలంగాణ నినాదం చాలా గొప్పది. తెలంగాణ నేల తల్లికి ఆఖరి శ్వాసవరకు రుణపడి ఉంటా' అని జనసేన అధ్యక్షుడు పవన్‌కళ్యాణ్ అన్నారు.

కరీంనగర్ జిల్లా కేంద్రంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో కరీంనగర్, పెద్దపల్లి, నిజామాబాద్ పార్లమెంటరీ నియోజకవర్గాల కార్యకర్తలతో పవన్‌కళ్యాణ్ మంగళవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటికే తమ పార్టీకి సంబంధించిన కొన్ని విధివిధానాలు నిర్ణయించామన్నారు. మార్చి 14న పూర్తి స్థాయిలో ప్రకటిస్తామని చెప్పారు. రాజకీయాల్లో కొత్త రక్తం రావాల్సిన అవసరం ఉందని, తమ పార్టీలో ప్రతిభావంతులకు స్థానం కల్పిస్తామని అన్నారు. తెలంగాణకు ఓ ప్రత్యేక చరిత్ర ఉందన్నారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన ఏడాది తర్వాత విముక్తి లభించిందని, అదే రీతిలో 25 ఏండ్ల పాటు సాగిన తెలంగాణ రాష్ట్ర సాధన మూడున్నరేండ్ల కిందటే సాకారమైందని చెప్పారు. తెలంగాణ సాధన, అభివృద్ధిలో కేసీఆర్ పక్కాగా పని చేస్తున్నారని కొనియాడారు. విధానాలనే ప్రశ్నిస్తాం...వ్యక్తిగతంగా ఎవరితోనూ గొడవలు లేవని, తనను ద్వేషించే వారిని పట్టించుకోనని అన్నారు. తెలంగాణ భావోద్వేగాలు తనకు తెలుసని, ఇక్కడి యాస, భాష, సంస్కృతిని ప్రేమిస్తానని తెలిపారు. జై తెలంగాణ నినాదం వందేమాతరం అంతటి గొప్ప వాక్యమని, ఆ నినాదం వింటే అణువణువూ పులకరింత వస్తుందని అన్నారు. కులాల వారీగా సీట్లు ఇవ్వడం సరిపోదని, ఆయా సామాజిక తరగతుల అభివృద్ధి అవసరమని అన్నారు. తెలంగాణ ఏర్పడిన తర్వాత రెండు రాష్ట్రాల్లోనూ ప్రత్యేక పరిస్థితులు ఏర్పడ్డాయన్నారు. తమపార్టీ నిబద్ధత, బాధ్యతతో పని చేస్తుందని తేల్చి చెప్పారు. జనసేన పార్టీపై కొందరు విమర్శలు చేస్తున్నారు...అసలు ఆ పార్టీ ఉంటుందా అంటూ ప్రశ్నిస్తున్నారు...అలా అయితే ప్రజల ముందుకు ఎందుకు వస్తానని ప్రశ్నించారు. 2019 ఎన్నికల్లో తెలంగాణలోనూ జనసేన పార్టీ పోటీ చేస్తుందని స్పష్టం చేశారు.

తోపులాటలో అభిమానికి గాయాలు

పవన్‌కళ్యాణ్ సమావేశం నిర్వహించిన ఫంక్షన్‌హాల్ ప్రవేశద్వారం చిన్నగా ఉండటంతో తోపులాట జరిగింది. ఈ తోపులాటలో ఫంక్షన్‌హాల్‌కు ఉన్న అద్దాలు పగిలి ఓ అభిమాని భుజానికి గాయాలయ్యాయి. కార్యకర్తలు వెంటనే ఆయన్ను వేదికపై తీసుకొచ్చారు. ఆయన్ను ఓదార్చిన పవన్ 'జై తెలంగాణ' అంటూ నినాదాలు చేశారు. అనంతరం గాయపడ్డ అభిమానిని ఆస్పత్రికి తరలించారు.

ముగ్గురు రైతుల ఆత్మహత్య

- నిర్మల్, జగిత్యాల, యాదాద్రి జిల్లాల్లో ఘటనలు

నవతెలంగాణ-సారంగాపూర్/జగిత్యాల/తుర్కపల్లి

అప్పుల బాధ తాళలేక నిర్మల్, జగిత్యాల, యాదాద్రి భువనగిరి జిల్లాల్లో మంగళవారం ముగ్గురు రైతులు ఆత్మహత్య చేసుకున్నారు. నిర్మల్ జిల్లా సారంగాపూర్ మండలం అడెల్లితండాకు చెందిన రాథోడ్ అనిల్(33)కు నాలుగెకరాల భూమి ఉంది. గతేడాది రూ.3.50 లక్షలు అప్పు చేసి మరో ఎకరం కొనుగోలు చేసి పత్తి సాగు చేశాడు. పంటకు గులాబీ పురుగు తెగులు ఆశించడంతో దిగుబడి ఆశించిన మేరకు రాలేదు. దీంతో పత్తి తీసేసి మరో రూ.25 వేలు అప్పు చేసి మొక్కజొన్న వేశాడు. చేసిన అప్పులు ఎలా తీర్చాలో మనో వేదనకు గురైన అనిల్ సోమవారం రాత్రి పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

జగిత్యాల మండలం గుల్లపేట గ్రామానికి చెందిన గంగధర రాజం(50) తనకున్న 20 గుంటల భూమితో పాటు మరో నాలుగెకరాలు కౌలుకు తీసుకుని వరి సాగుచేశాడు. పంట దోమపోటుకు గురై పెట్టుబడి రాలేదు. ఇక అప్పులు చేసి గల్ఫ్‌కు వెళ్లిన కొడుకు సైతం పని దొరక్క తిరిగొచ్చేశాడు. మొత్తం కలిపి రూ.9 లక్షల అప్పు అయ్యింది. చేసిన అప్పు తీర్చేమార్గం లేక మనస్తాపానికి గురైన రాజం ఈ నెల 12వ తేదీ అర్ధరాత్రి పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఫలితం లేక మంగళవారం మృతిచెందాడు. మృతునికి కుమారుడు, ఇద్దరు కూతుర్లు ఉన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు సారంగపూర్ పోలీసులు తెలిపారు.

యాదాద్రి భువనగిరి జిల్లా తుర్కపల్లి మండలం మోతీరాం తండాకు చెందిన బానోతు సంతోష్ నాయక్(30) తనకున్న రెండెకరాల్లో వరి, పత్తి సాగు చేశాడు. దీనికి గాను సుమారు రూ.2లక్షల వరకు అప్పు చేశాడు. ఆశించిన మేరకు పంట దిగుబడి రాలేదు. అప్పులు తీరవని మనోవేదనకు గురైన సంతోష్ నాయక్ తన వ్యవసాయ బావి వద్ద చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతునికి భార్య, కూతురు, కుమారుడు ఉన్నారు.

పెంచితే గుర్తింపు రద్దు!

- స్టేటస్‌కో యాజమాన్యాలు అమలు చేయాల్సిందే
- 'ప్రయివేటు'లో ఫీజుల పెంపుపై సర్కార్ సీరియస్

నవతెలంగాణ బ్యూరో- హైదరాబాద్

ప్రయివేటు, కార్పొరేట్ పాఠశాలలకు ప్రభుత్వం సీరియస్ వార్నింగ్ ఇచ్చింది. 2018-19 విద్యాసంవత్సరానికి 2017-18 విద్యాసంవత్సరంలో వసూలు చేసిన ఫీజులను మాత్రమే తీసుకోవాలని మరోసారి యాజమాన్యాలను ఆదేశించింది. నిబంధనలు ఉల్లంగిస్తే గుర్తింపు రద్దు చేసేందుకు వెనుకాడబోమని హెచ్చరించింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రత్యేక కార్యదర్శి రంజీవ్ ఆర్ ఆచార్య ఆదేశాలు జారీ చేశారు. ఈనెల 2 నుంచి 12 వరకు సెంట్రల్ సెలబస్ పాఠశాలల్లో అడ్మిషన్లకు తెలంగాణ ప్రభుత్వం అనుమతించింది. ఈ క్రమంలో వచ్చే ఏడాదికి సంబంధించిన ఫీజులను యాజమాన్యాలు భారీగా పెంచాయి. దీంతో కొందరు తల్లిదండ్రులు ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకుపోయారు. ప్రొఫెసర్ తిరుపతిరావు కమిటీ నివేదిక ప్రభుత్వానికి ఇచ్చిన నేపథ్యంలో, దీనిపై సర్కారు నిర్ణయం వచ్చే వరకూ ఫీజులను నియంత్రించాలని కోరారు. దీంతో ప్రభుత్వం ఈనెల 4న 2018-19విద్యాసంవత్సరంలో ఫీజుల పెంపుపై స్టేటస్‌కో ఆర్డర్స్ జారీ చేసింది. అయితే యాజమాన్యాలు ఈ ఆదేశాలను పట్టించుకోకపోవడంతో పాఠశాల విద్యాశాఖ కమిషనర్ జి కిషన్, పాఠశాలల ప్రతినిధులతో సమావేశం నిర్వహించి, ఫీజులను పెంచవద్దనీ చెప్పారు. అయినా యాజమాన్యాలు పట్టించుకోలేదు. ప్రతి ఏటా మాదిరి ఈసారీ ఫీజులు పెంచుకుంటామనీ కమిషనర్‌కు ఇచ్చిన వినతిపత్రంలోనూ పేర్కొన్నాయి. ఈ వినతిపత్రాన్ని కమిషనర్..ప్రభుత్వానికి పంపించారు. దీంతో ప్రభుత్వ ప్రత్యేక కార్యదర్శి రంజీవ్ ఆర్ ఆచార్య తీవ్రంగా స్పందించారు. ప్రభుత్వం ఇచ్చిన ఆదేశాలను ప్రయివేటు విద్యాసంస్థల యాజమాన్యాలు అమలు చేయాల్సిందేనని హెచ్చరించారు. ప్రొఫెసర్ తిరుపతిరావు కమిటీ ఇచ్చిన నివేదికపై ప్రభుత్వం అధ్యయనం చేస్తుందని అప్పటి వరకూ ఫీజులు పెంచవద్దని సూచించారు. 1983 ఎడ్యుకేషన్ ఆక్ట్ ప్రకారం ఫీజుల నియంత్రణ ప్రభుత్వ పరిధిలోనే ఉందని చెప్పారు. సర్కారు నిబంధనలు అమలు చేయకపోతే పెనాల్టీలతో పాటు జీవోనెంబర్1 ప్రకారం గుర్తింపు రద్దు చేయవచ్చని ఉత్తర్వుల్లో హెచ్చరించారు. యాజమాన్యాలు ఫీజుల స్టేటస్‌కో పాటించాల్సిందేనని తెలిపారు.

పద్మావత్‌పై కర్ణిసేన ఆగ్రహం..

అహ్మదాబాద్ మాల్‌లో 50 వాహనాలు దహనం

అహ్మదాబాద్(గుజరాత్): పద్మావత్‌ను వ్యతిరేకిస్తున్న కర్ణిసేన అహ్మదాబాద్‌లోని హిమాలయ మాల్ వద్ద నానా బీభత్సం సృష్టించింది. ఈ మాల్‌లో ఉన్న మల్టీప్లెక్స్‌లో పద్మావత్ విడుదల చేయనున్నారనే సమాచారంతో కర్ణిసేన ముసుగులో సంఘ్ శక్తులు తెగబడ్డాయి. ముందుగా వేసుకున్న పథకం ప్రకారం.. రాళ్లదాడికి పాల్పడ్డారు. దాంతో, మాల్‌లోని గ్లాస్ రూమ్ ధ్వంసమైంది. ఆ తర్వాత అక్కడ పార్కింగ్ చేసి ఉన్న..వాహనాలను తగలబెట్టారు. ఆందోళనకారులను కట్టడి చేయటానికి పోలీసులు రెండు రౌండ్లు గాల్లోకి కాల్పులు జరిపారు. దీంతో,మరింత రెచ్చిపోయి మరిన్ని వాహనాలను తగలబెట్టారు. ఆ మంటలు విస్తరించి..సమీపంలోని షాపులూ అంటుకున్నాయి. సుమారు రెండు వేలమందికిపైగా ఈ దాడిలో పాల్గొన్నట్టు పోలీసులు అంచనా. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసు ఉన్నతాధికారులు తెలిపారు.

' విప్లవ సంస్థలన్నీ ఐక్యం కావాలి'

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

విప్లవ సంస్థలన్నీ ఐక్యం కావాల్సిన సమయం ఆసన్నమైందని సీపీఐ(ఎంఎల్) జనశక్తి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి విశ్వనాథ్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. టేకులపల్లి బూటకపు ఎన్‌కౌంటర్, అక్రమ అరెస్టులు చేయడం, టీఆర్ఎస్ పార్టీ నియంతృత్వ పాలనకు నిదర్శనమని తెలిపారు. శృతి, సాగర్‌ల ఎన్‌కౌంటర్‌ను తెలంగాణ సమాజం మొత్తం ఖండించినా ఆగకుండా తెలంగాణ ప్రభుత్వం టేకులపల్లిలో 9మందిని ఒకేసారి కాల్చిచంపి పొట్టనపెట్టుకుందన్నారు. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మంద కృష్ణమాదిగను అక్రమంగా అరెస్టు చేసి జైల్లోపెట్టిందన్నారు. తెలంగాణ జేఏసీ చైర్మెన్‌ను అనేక విధాలుగా అణచివేసేందుకు ప్రభుత్వం కుట్రలు పన్నుతోందన్నారు.

తొమ్మిది మంది ఎమ్మెల్యేలపై వేటు వేయండి

రాష్ట్రపతి,ఈసీకి రేవంత్‌రెడ్డి ఫిర్యాదు



నవనతెలంగాణబ్యూరో-హైదరాబాద్

పార్లమెంటు సెక్రెటరీలుగా కొనసాగిన ఆరుగురు టీఆర్ఎస్ ఎమ్మెల్యేలే కాకుండా లాభదాయకమైన అదనపు పదవులలో నియమి తులైన మరో ముగ్గురు టీఆర్ఎస్ ఎమ్మెల్యేలపై కూడా 'ఆఫీస్ ఆఫ్ ప్రాఫిట్' కింద అనర్హత వేటు వేయాలని కొడంగల్ ఎమ్మెల్యేలు ఎనుమల రేవంత్‌రెడ్డి కోరారు. ఈమేరకు మంగళవారం రాష్ట్రపతికి, చీఫ్ ఎలక్షన్ కమిషనర్‌కు ఫిర్యాదు చేసారు. ఆమ్ ఆద్మీ పార్టీ ఎమ్మెల్యేల తరహాలోనే తెలంగాణ రాష్ట్రంలోనూ పార్లమెంటు సెక్రెటరీలుగా కొనసాగిన ఆరుగురు మంది టీఆర్ఎస్ ఎమ్మెల్యేలపై కూడా ఆప్ తరహాలోనే అనర్హత వేటు వేయాలని విజ్ఞప్తి చేశారు.

బాలకార్మిక వ్యవస్థను 15 ఏండ్లలో నిర్మూలిస్తాం : స్వామిగౌడ్

నవతెలంగాణబ్యూరో- హైదరాబాద్

రాష్ట్రంలో బాల కార్మిక వ్యవస్థను వచ్చే 15 ఏండ్లలో పూర్తిగా నిర్మూలిస్తామని శాసనమండలి చైర్మన్ స్వామిగౌడ్ తెలిపారు. నేపాల్ దేశానికి చెందిన ఆస్మాన్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు రాధా కొయిరాలా, నవల్ కిషోర్ యాదవ్ సహా ఏడుగురు బృంద సభ్యులు ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో పర్యటించారు. అనంతరం చైర్మెన్ స్వామిగౌడ్‌ను మంగళవారం కలిసి తమ పర్యటన వివరాలను, ఆ జిల్లా అభివృద్ధి తీరును వివరించారు. ఈ సందర్భంగా రాష్ట్రం అభివృద్ధి చెందుతున్న తీరును స్వామిగౌడ్ వారికి వివరించారు. కౌన్సిల్ లో జరిగే చర్చలు, చట్టసభలు సమర్థంగా పని చేస్తున్న తీరును వివరించారు. బాల్య వివాహాలను అరికట్టేందుకు కళ్యాణ లక్ష్మి షాదీ ముబారక్ పథకాలు ఉపయోగ పడుతున్నాయన్నారు. బాల్య వివాహాలు జరగకుండా చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. తాము కూడా త్వరలో నేపాల్‌లో పర్యటించి, అక్కడి పరిస్థితులు అధ్యయనం చేస్తామని చెప్పారు. శాసనమండలి చీఫ్‌విప్ పాతూరి సుధాకరరెడ్డి మాట్లాడుతూ తెలంగాణ ఏర్పడిన తరువాత అభివృద్ధి వేగంగా జరుగుతోందని తెలిపారు. సమావేశంలో విప్ బోడకుంటి వెంకటేశ్వర్లు ఎమ్మెల్సీ గంగాధర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక అసెంబ్లీ సమావేశాలపై తేదీల ఖరారు

నవతెలంగాణబ్యూరో- హైదరాబాద్

పంచాయతీరాజ్ చట్టం, ఇతర అంశాలపై చర్చించేందుకు ప్రభుత్వం ప్రత్యేక అసెంబ్లీ సమావేశాలు జరపాలని నిర్ణయించిన విషయం తెలిసిందే. దీనిపై ముఖ్యమంత్రి కేసీఆర్ కూడా ధ్రువీకరించారు. ఈ నెల 28, 29 తేదీల్లో సమావేశాలు జరిపేందుకు ఇప్పటికే ఏర్పాట్లు చేసినట్టు తెలిసింది. అయితే సమ్మక్క, సారలమ్మ జాతర ఉండడం వల్ల భద్రత ఇవ్వడం సాధ్యపడుతుందా అన్న దానిపై పోలీసులు చర్చిస్తున్నారు. పోలీసులు వీలు కాదంటే ఫిబ్రవరి మొదటివారంలో ప్రత్యేక అసెంబ్లీ సమావేశాలు జరిపే అవకాశం ఉందని తెలుస్తోంది.

'తెలంగాణ గురుకులాలు భేష్ '


నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలల నిర్వహణా తీరు అద్భుతంగా ఉందని పంజాబ్ సాంఘీక సంక్షేమ శాఖ ప్రశంసించింది. . మంగళవారం ఆ రాష్ట్రానికి చెందిన సాంఘిక సంక్షేమ గురుకులాల బృందం హైదరాబాద్‌లోని గురుకుల పాఠశాలలను సందర్శించింది. ఈ సందర్భంగా బృందం అధికారి రిపూసింగ్ దమన్ మాట్లాడుతూ ఎస్సీ గురుకుల విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందిస్తున్నారని ఆయన కితాబిచ్చారు. తెలంగాణ రాష్ట్ర గురుకులాల దేశానికి ఆదర్శంగా నిలిచాయన్నారు. ఇదే తరహాలో పంజాబ్ గురుకులాలను కూడా తీర్చిదిద్దుతామని తెలిపారు. తెలంగాణ గురుకులాల కార్యదర్శి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ కేజీటుపీజీ ఉచిత విద్యలో భాగంగా 2020 వరకు రాష్ట్రంలో 8లక్షల మంది విద్యార్థులకు గురుకులాల ద్వారా ఉచిత విద్యను అందించేందుకు ప్రణాళిక సిద్ధం చేశామన్నారు.

నెట్‌వర్క్ సమాజంలో..

ఆధార్ లింక్‌తో ఇబ్బందులేమిటి..?

- పిటిషనర్ల తరఫు న్యాయవాదులకు ప్రశ్నావళి
- సంధించిన సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం
- నేడు కొనసాగనున్న విచారణ



న్యూఢిల్లీ: నెట్‌వర్క్ విస్తృతమైన ఆధునిక సమాజంలో ఆధార్ నెంబర్‌ను చేర్చడం వల్ల కొత్తగా వచ్చే సమస్యలేమిటని పిటిషనర్ల తరఫు న్యాయవాదులను సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం ప్రశ్నించింది. మన వివరాలు ఇప్పటికే ప్రయివేట్ సంస్థల చేతుల్లో ఉన్నాయి. ఆధార్‌ను చేర్చడం వల్ల తేడా ఏముంటుందో తెలపాలని రాజ్యాంగ ధర్మాసనం కోరింది. భారత ప్రధాన న్యాయమూర్తి దీపక్‌మిశ్రా నేతృత్వంలోని ఐదుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనం ఆధార్‌పై మంగళవారం విచారణ జరిపింది. ఆధార్‌కు సంబంధించి తేల్చాల్సిన ప్రధాన అంశాలను ప్రశ్నలుగా రూపొందించి పిటిషనర్ల తరపు న్యాయవాదులకు రాజ్యాంగ ధర్మాసనం సంధించింది. వ్యక్తిగత గోప్యత హక్కును ప్రాథమిక హక్కుగా సుప్రీంకోర్టు ఇప్పటికే స్పష్టం చేసిన విషయం తెలిసిందే. దాంతో, ఆధార్ కోసం ఇచ్చిన వివరాలు లీక్ కావడం వల్ల గోప్యత హక్కుకు భంగం కలుగుతుందా అనే అంశంపైనా రాజ్యాంగ ధర్మాసనం పరిశీలించనున్నది. ఆధార్‌పై వాదనలను బుధవారం కూడా ధర్మాసనం విననున్నది. ధర్మాసనం అడిగిన ప్రశ్నలపై కాంగ్రెస్ నేత, పిటిషనర్ల తరఫు న్యాయవాది కపిల్‌సిబల్ తన వాదన వినిపించారు. అవును..మనం నెట్‌వర్క్ ప్రపంచంలో ఉన్నాం. సమాచారాన్ని ఇచ్చిపుచ్చుకుంటున్నాం. ఒకే గొడుగు కింద ప్రభుత్వం ఏమేరకు వ్యక్తిగత సమాచారాన్ని కోరుతున్నది. ప్రయివేట్ సంస్థలకు ఏమేరకు అది ఇవ్వాల్సి ఉంటుంది. మనకు అది ఎంతవరకు సురక్షితం.? అంటూ ధర్మాసనాన్ని సిబల్ ప్రశ్నించారు. దీనిపై ధర్మాసనం నుంచి జస్టిస్ చంద్రచూడ్ స్పందిస్తూ..వ్యక్తిగత సమాచారాన్ని సేకరించే ఉద్దేశానికే పరిమితం చేయాలని పిటిషనర్ల తరపున మీరు చెప్పదలచారా..? ఇతరులకు లీక్ కావడం వల్ల ప్రమాదమని భావిస్తున్నారా..? అంటూ ప్రశ్నలు సంధించారు. సీనియర్ న్యాయవాదులు శ్యాందివాన్, విపిన్‌నాయర్ కూడా సుప్రీం ధర్మాసనం ముందు తమ వాదనలు వినిపించారు. వ్యక్తుల సమాచార భద్రతకు ప్రభుత్వమే బాధ్యత వహించాలని వారన్నారు. అందుకు జస్టిస్ ఏకె సిక్రీ స్పందిస్తూ.. ఆధార్‌ను సబ్సిడీలకే పరిమితం చేయాలా..? రాజ్యాంగపరంగా ఆమేరకు ఆంక్షలు విధించాలా..? గీత దాటితే ప్రయివసీ(గోప్యత) హక్కుకు భంగం కలిగినట్టుగా భావించాలా..? అంటూ ప్రశ్నించారు. పిటిషనర్ల తరపు వాదనలు బుధవారం కూడా కొనసాగనున్నాయి.

మార్చి వరకల్లా డేటా సంరక్షణ బిల్లూ కేంద్ర ప్రభుత్వం

ఆధార్ డేటా సంరక్షణ కోసం ఈ ఏడాది మార్చి వరకల్లా బిల్లు సిద్ధం చేయనున్నట్టు కేంద్ర ప్రభుత్వం తెలిపింది. మంగళవారం ఈ అంశంపై విచారణ సందర్భంగా కేంద్రం తరపున కోర్టుకు హాజరైన అటార్నీ జనరల్ కెకె వేణుగోపాల్ రాజ్యాంగ ధర్మాసనానికి సమాచారమిచ్చారు. ఈ అంశంపై రిటైర్డ్ జడ్జి జస్టిస్ బిఎన్ శ్రీకృష్ణ నేతృత్వంలో ఏర్పాటైన నిపుణుల కమిటీ ముసాయిదా బిల్లును రూపొందిస్తోంది.

గ్యాస్ ట్యాంకర్, రైలు ఢీ

- కెనడాలో ఘటన



ఒట్టావా : కెనడాలో గ్యాస్ ట్యాంకర్, రైలు ఢీకొన్నాయి. దీంతో, మంటలు ఒక్కసారిగా వ్యాపించాయి. పరిసర ప్రాంతాలన్నీ దట్టమైన పొగతో అలుముకున్నాయి. సమాచారం అందుకున్న అగ్నిమాపక బృందాలు ఘటనాస్థలికి చేరుకుని మంటలను ఆర్పివేసేందుకు ప్రయత్నిస్తున్నాయి. కెనడా పసిఫిక్ రైల్వే అధికారులు తెలిపిన వివరాల ప్రకారం...యార్డ్స్ ప్రాంతంలో గ్యాస్ ట్యాంకర్, రైలు ఢీకొన్నాయి. మంటలు దావానలంలా వ్యాపించడంతో స్థానిక ప్రజలు భయబ్రాంతులకు గురవుతున్నారు. ఘటనాస్థలికి చేరుకున్న అధికారులు ప్రజలను ఖాళీ చేయించారు. లాఫ్‌హీడ్ హైవేలో వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. అదృష్టవశాత్తూ ఈ ప్రమాదంలో ఎవరూ గాయపడలేదని అధికారులు తెలిపారు. ప్రమాదానికి గల కారణాలు తెలియరాలేదు. ఘటనపై దర్యాప్తునకు ఆదేశించామని అన్నారు.

అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో...

రష్యా జోక్యం చేసుకుందనేందుకు ఆధారాల్లేవ్ : మైక్ పాంపియో

వాషింగ్టన్: అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో రష్యా జోక్యం చేసుకుందనేందుకు ఎలాంటి ఆధారాలు లభించలేదని సీఐఏ (సెంట్రల్ ఇంటెలిజెన్స్ ఏజెన్సీ) డైరెక్టర్ మైక్ పాంపియో స్పష్టం చేశారు. ఈ కేసు దర్యాప్తు చేపడుతునన తమకు రష్యాకు విరుద్ధంగా ఎలాంటి ఆధారాలు లభించలేదని అన్నారు. వాషింగ్టన్‌లోని సీఐఏ ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. కేసు దర్యాప్తుకు సంబంధించిన నివేదికను త్వరలో న్యాయస్థానానికి అందజేస్తామని అన్నారు. అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో రష్యా జోక్యం చేసుకుందనే ఆరోపణలు వచ్చిన సంగతి తెలిసిందే. అధ్యక్ష ఎన్నికలు సమీపిస్తున్న సమయంలో



డెమోక్రటిక్ పార్టీ నేత, మాజీ విదేశాంగ మంత్రి హిల్లరీ క్లింటన్‌కు సంబంధించిన కీలక ఈమెయిల్స్ బయటకు వచ్చాయి. ఈనేపథ్యంలో హిల్లరీ పట్ల ప్రజల్లో వ్యతిరేకత వచ్చింది. ఈ అంశాలు రిపబ్లికన్ పార్టీ నేత ట్రంప్‌కు కలిసొచ్చాయి. హిల్లరీకి సంబంధించిన ఈమెయిల్స్‌ను వికీలీక్స్ బహిర్గతం చేసింది.

అదే సమయంలో రష్యా అధ్యక్షుడు పుతిన్‌ను సమర్థిస్తూ, ప్రశంసిస్తూ అసాంజే, ట్రంప్ పలు సందర్భాల్లో మాట్లాడారు. దీంతో, హిల్లరీ మద్దతుదారులంతా తమ ఓటమికి కారణం రష్యానే అంటూ ఆరోపించారు. ప్రస్తుతం ఈకేసుపై సీఐఏ దర్యాప్తు చేపట్టింది

యెమెన్‌కు 1.5బిలియన్ డాలర్ల సౌదీ మిత్రదేశాల సాయం



సనా : యెమెన్‌కు 1.5బిలియన్ డాలర్ల (రూ.9,566 కోట్లు) సాయం అందజేయనున్నట్టు సౌదీ మిత్రదేశాలు ప్రకటించాయి. ఐరాస అభ్యర్థన మేరకు తామీ సాయం చేయనున్నట్టు పేర్కొన్నాయి. యెమెన్‌లో 2015లో అంతర్యుద్ధం చెలరేగింది. యుద్ధవాతావరణం కారణంగా ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారు. ఈ అంతర్యుద్ధం కారణంగా దాదాపు 10వేల మంది చనిపోయారు. లక్షలాది మంది ఇతర ప్రాంతాలకు వలసవెళ్లారు. ప్రాథమిక అవసరాలు అందక ఇక్కడి ప్రజలు అనేక ఇబ్బందులుపడుతున్నారు. అంతేగాకుండా, అంటువ్యాధులు వ్యాపిస్తున్నాయి. ఆకలికేకలతో యెమెన్ తల్లడిల్లుతోంది. ఈ నేపథ్యంలో యెమెన్ పౌరులకు సాయం అందించాలని ప్రపంచ దేశాలకు ఇటీవల ఐరాస పిలుపునిచ్చింది. ఐరాస నివేదిక ప్రకారం...యెమెన్‌లో 2కోట్ల 20లక్షల మంది సాయం కోసం ఎదురుచూస్తున్నారు. 80లక్షల మంది అర్ధాకలితో అలమటిస్తున్నారు. వారిలో 18లక్షల మంది చిన్నారులు ఐదేండ్ల లోపువారున్నారు. యెమెన్‌లో కలరా వ్యాధి వ్యాపించడంతో ప్రజలు అనేక ఇబ్బందులుపడుతున్నారు. సౌదీ మిత్రదేశాలు తమకు సహకరిస్తున్నందుకు యెమెన్ అధ్యక్షుడు అబ్దు రబు మన్సూర్ హాదీ కృతజ్ఞతలు తెలిపారు.

అమెరికా గ్యాస్‌బావిలో పేలుడు

- ఐదుగురు గల్లంతు

వాషింగ్టన్ : అమెరికాలోని గ్యాస్ బావిలో పేలుడు సంభ వించింది. దట్టమైన పొగలు మిన్నంటేలా ఎగసిపడుతున్నాయి. ఒక్లాహోమా ప్రాంతం లో మంగళవారం ఈఘటన సంభవించింది. ఈ ప్రమా దంలో ఐదుగురు గల్లంతయ్యారు. పేలుడు సంభవిం చిన సమయంలో నేచురల్ గ్యాస్ సైట్ వద్ద 20 మంది ఉద్యోగులు పనిచేస్తున్నారని పిట్స్‌బర్గ్ కౌంటీ ఎమర్జెన్సీ మేనేజ్‌మెంట్ డైరెక్టర్ కెవిన్ ఎన్లో తెలిపారు. తుల్సా నగరం నుంచి 161కిలోమీటర్ల దూరంలో ఈ ప్రమాదం సంభవించిందన్నారు. 15మంది ఉద్యోగులను కాపాడామని అన్నారు. గల్లంతైన ఐదుగురి కోసం గాలిస్తున్నామన్నారు. ప్రమాదానికి గల కారణాలు తెలియరాలేదు.

ఎట్టకేలకు ముగిసిన అమెరికా షట్‌డౌన్!

వాషింగ్టన్ : అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆర్థిక నిధుల (ఫండింగ్) బిల్లుపై సంతకం చేయడంతో మూడురోజులపాటు కొనసాగిన ప్రభుత్వ కార్యకలాపాల స్తంభన (షట్‌డౌన్) అధికారికంగా ముగిసిపోయింది. ఫిబ్రవరి 8వ తేదీ వరకు ప్రభుత్వ కార్యకలాపాలకు నిధులు అందించేందుకు, అలాగే ప్రముఖ పిల్లల ఆరోగ్య బీమా పథకానికి 8 ఏండ్లపాటు నిధులు సమకూర్చేందుకు ఈ బిల్లు అనుమతినిస్తుంది. అయితే, ఒబామా హయాంనాటి డీఏసీఏ (డిఫర్డ్ యాక్షన్ ఫర్ చైల్డ్‌వుడ్ అరైవల్స్) పథకాన్ని మాత్రం ఈ బిల్లులో చేర్చలేదు. అమెరికాకు తల్లిదండ్రులతోపాటు వచ్చిన డ్రీమర్స్ హక్కుల కోసం ఉద్దేశించిన ఈ పథకాన్ని బిల్లులో చేర్చాలని ప్రతిపక్ష డెమోక్రట్లు పట్టుబడుతున్న సంగతి తెలిసిందే.

ప్రభుత్వానికి తాత్కాలికంగా నిధులు సమకూర్చే బిల్లును మొదట అమెరికా సెనేట్ ఆమోదించి.. పెద్దల సభ (హౌస్ ఆఫ్ రిప్రజెంటివ్)కు పంపింది. పెద్దలసభ 266–150 తేడాతో ఈ బిల్లును ఆమోదించగా.. అధ్యక్షుడు ట్రంప్ సంతకం చేయడంతో బిల్లు చట్టంగా మారింది. దీంతో సోమవారం ఉదయం నుంచి అమెరికా ప్రభుత్వం మళ్లీ యథాతథంగా కార్యకలాపాలు ప్రారంభించింది.

వలసదారుల విషయంలో ట్రంప్ అనుసరిస్తున్న వైఖరిని నిరసిస్తూ.. ప్రభుత్వానికి నిధులు సమకూర్చే బిల్లును సెనేటర్లు తిరస్కరించిన సంగతి తెలిసిందే. దీంతో అమెరికా ప్రభుత్వం స్తంభించిపోయి మూడురోజుల పాటు కుప్పకూలిపోయింది. ప్రభుత్వ ఏజెన్సీలు, ఉద్యోగులపై ఈ ప్రభావం పడింది. ఈ నేపథ్యంలో తాత్కాలికంగా మూడు



వారాలపాటు ప్రభుత్వం నడిచేందుకు వీలుగా అధికార రిపబ్లికన్లతో డెమొక్రాట్లు తాత్కాలిక రాజీ కుదర్చడంతో ఈ బిల్లు ఆమోదం పొందింది. ఈ క్రమంలో కొత్త వలసదారుల బిల్లు వచ్చేనెలలోగా ఆమోదం పొందనుందని ట్రంప్ ప్రభుత్వం చెప్తోంది. అయితే, డిపోర్టేషన్ ముప్పు ఎదుర్కొంటున్న 8 లక్షలమంది వలసదారులను కాపాడే విషయంలో డెమొక్రాట్లు, రిపబ్లికన్లు తాత్కాలికంగా రాజీకి వచ్చినట్టు తెలుస్తోంది.

ఇండోనేషియాలో భారీ భూకంపం

జకర్తా : ఇండోనేషియాలో భారీ భూకంపం సంభవించింది. దీని ధాటికి రాజధాని జకర్తా భయంతో వణికిపోయింది. పలు భవనాలు, ఇతర నిర్మాణాలు ప్రకంపనలకు గురయ్యాయి. కొన్ని సెకన్లపాటు తొణికిసలాడినట్టుగా కనిపించాయి. దీంతో, ప్రజలు భయాందోళనకు గురయ్యారు.అధికారుల వివరాల ప్రకారం మంగళవారం మధ్యాహ్నం భూమి తీవ్రంగా కంపించింది. రిక్టర్ స్కేలుపై దీని తీవ్రత 6.0గా నమోదైంది. జకర్తాకు 130 కిలోమీటర్ల దూరంలో భూకంప కేంద్రాన్ని గుర్తించారు. జకర్తాలో 10 మిలియన్ల మంది ప్రజలు నివసిస్తున్నారు. వీరంతా కూడా ఈ భూకంపం కారణంగా ఆందోళనపడినట్టు అధికారులు తెలిపారు.

పాలస్తీనాలో అమెరికాఉపాధ్యక్షుడికి నిరసన సెగ

తూర్పు జెరూసలేమ్ : పాలస్తీనా పర్యటనలో ఉన్న అమెరికా ఉపాధ్యక్షుడు మైక్‌పెన్స్‌కు నిరసన సెగ తాకింది. ఆయన పర్యటనను వ్యతిరేకిస్తూ ప్రజలు వీధుల్లోకి చేరుకున్నారు. పెన్స్ గో బ్యాక్ అంటూ నినాదాలు చేశారు. ఇజ్రాయిల్ రాజధానిగా జెరూసలేమ్‌ని గుర్తించనున్నట్టు అమెరికా అధ్యక్షుడు గతేడాది డిసెంబర్‌లో ప్రకటించిన సంగతి తెలిసిందే. అంతేగాకుండా, ఇజ్రాయిల్‌లోని యూఎస్ దౌత్య కార్యాలయాన్ని జెరూసలేమ్‌కు తరలించనున్నట్టు ప్రకటించింది. ఈనేపథ్యంలో పాలస్తీనాలో అల్లర్లు చెలరేగాయి. రెండు వర్గాల మధ్య చెలరేగిన ఘర్షణలో 12 మంది మృతి చెందారు. అనేక మంది గాయపడ్డారు. శాంతి స్థాపన పేరుతో మైక్‌పెన్స్ పాలస్తీనాలో పర్యటించారు. ఆయన పర్యటనను నిరసనకారులు, స్థానిక నేతలు అడ్డుకుంటున్నారు.

లండన్ రైల్వే స్టేషన్‌లో గ్యాస్‌లీకేజీ కలకలం

లండన్ : లండన్‌లోని చారింగ్ క్రాస్ రైల్వే స్టేషన్‌లో గ్యాస్ లీకేజీ కలకలం రేపింది. దీంతో, రైల్వేస్టేషన్‌లోని ప్రయాణికులంతా భయబ్రాంతులకు గురయ్యారు. ప్రాణభయంతో వీధుల్లోకి పరుగులు తీశారు. సమాచారం అందుకున్న ప్రత్యేక బృందాలు ఘటనాస్థలానికి చేరుకొని తనిఖీలు చేపట్టారు. స్టేషన్‌లోని దాదాపు 1500 మంది ప్రయాణికులను బయటకు పంపించారు.

చిన్నారి జైనబ్‌పై లైంగికదాడి, హత్య కేసులో పురోగతి



- కీలక నిందితుడి అరెస్ట్ : ఎస్పీ

ఇస్లామాబాద్ : పాకిస్తాన్‌లో లైంగికదాడి, దారుణ హత్యకు గురైన చిన్నారి జైనబ్ అన్సారీ కేసులో పురోగతి కనిపిస్తున్నది. ఈకేసులో కీలక నిందితుడిని అరెస్ట్ చేసినట్టు జిల్లా ఎస్పీ మంగళవారం ధ్రువీకరించారు. ఈనెల9న సెంట్రల్ పంజాబ్ ప్రావిన్స్‌లోని కాసుర్ నగరంలోని చెత్తకుప్పలో ఏడేండ్ల చిన్నారి జైనబ్ శవమై కనిపించిన సంగతి తెలిసిందే. ఈఘటన అనంతరం పాకిస్తాన్‌లో నిరసన జ్వాలలు చెలరేగాయి. ఈ నేపథ్యంలో చెలరేగిన అల్లర్లలో ఇద్దరు మృతిచెందారు. మరో ఏడుగురు తీవ్రంగా గాయపడ్డారు. ఈ కేసుపై పోలీసులు ప్రత్యేక దృష్టి సారించారు. బృందాలు ఏర్పడి దర్యాప్తు చేపట్టారు. ఈ కేసులో కీలక నిందితుడిని అరెస్ట్ చేసి విచారించినట్టు జిల్లా ఎస్పీ తెలిపారు.ప్రాథమిక విచారణలో నిందితుడు నేరాన్ని అంగీకరించాడని అన్నారు. అయితే, అతడి వివరాలను మీడియాకు వెల్లడించేందుకు ఆయన నిరాకరించారు. జైనబ్‌పై లైంగికదాడి, హత్యకు పాల్పడ్డ నిందితుడు కాసుర్ ప్రాంతంలోనే నివసిస్తున్నట్టు ఎస్పీ తెలిపారు. నిందితుడిని కోర్టులో హాజరుపరుస్తామని అన్నారు.

అలస్కాలో భూకంపం

- రిక్టర్‌స్కేల్‌పై తీవ్రత 8.2గా నమోదు
- సునామీ హెచ్చరిక జారీ

అలస్కా: అమెరికాలోని అలస్కా తీరంలో భూకంపం సంభవించింది. రిక్టర్‌స్కేల్‌పై దీని తీవ్రత 8.2గా నమోదైంది. భూకంపం కారణంగా సునామీ హెచ్చరికలు జారీ అయ్యాయి. అలస్కాలోని చినియాక్‌కు 256 కిలోమీటర్ల దూరంలో 10 కిలోమీటర్ల లోతులో స్థానిక కాలమానం ప్రకారం మంగళవారం ఉదయం 9.31 గంటలకు ఈ భూకంపం సంభవించిందని అమెరికా జియోలాజికల్ సర్వే తెలిపింది.భూకంపం కారణంగా సునామీ వచ్చే అవకాశం ఉందని, తీర ప్రాంతంలో నివసించే ప్రజలు సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్లాలని అలస్కా, బ్రిటీష్ కొలంబియా సునామీ హెచ్చరికల కేంద్రం హెచ్చరించింది. అలస్కా, కెనడా, అమెరికా పశ్చిమ ప్రాంతంపై సునామీ ప్రభావం ఉంటుందని తెలిపింది. సునామీ కారణంగా రాకాసి అలలు విరుచుకుపడే అవకాశం ఉందని పసిఫిక్ సునామీ హెచ్చరికల కేంద్రం హెచ్చరించింది. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించింది.

మిషన్ కాకతీయ ఇక మరింత వేగవంతం

ఫిబ్రవరి మూడు లోగా నాలుగవ దశ పనులు ప్రారంభం

- రూ. 1,750 కోట్ల బడ్జెట్‌కు ఆర్థిక శాఖ ఆమోదం
- 5,100 చెరువుల పునరుద్ధరణ దిశగా ప్రతిపాదనలు



నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి

కొత్త ఆర్థిక సంవత్సరంతో ముడిపెట్టకుండా మిషన్ కాకతీయ నాలుగవ దశ పనులను ప్రారంభించటానికి నీటిపారుదల శాఖ సన్నాహాలు చేస్తున్నది. గత అనుభవాలను దృష్టిలో పెట్టుకుని ముందుగానే అనుమతుల ప్రక్రియను ప్రారంభించింది. నాలుగవ దశ 'మిషన్'లో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా 5,100 చెరువులను పునరుద్ధరించాలని లక్ష్యంగా పెట్టుకోగా దీనికి అవసరమైన రూ. 1,750 కోట్ల బడ్జెట్ ఇవ్వటానికి ఆర్థిక శాఖ సూత్రప్రాయంగా ఆమోదం తెలిపి నట్టు అధికార వర్గాల ద్వారా తెలిసింది. నాలుగవ దశ కోసం ఇప్పటికే 2,429 చెరువులను గుర్తించగా వీటిలో 2,413 చెరువులకు పాలనాపరమైన అను మతులను ప్రభుత్వం జారీ చేసింది. వీటి విలువ రూ. 576.12 కోట్లు కాగా వీటిలో 186 చెరువులకు సాంకేతిక పరమైన అనుమతులు కూడా లభించాయి. రాష్ట్ర వ్యాప్తంగా మూడవ దశ మిషన్ పనులు కొనసాగుతుండగానే నాలుగవ దశ పనులను కూడా ప్రారంభించటానికి అధికారులు కసరత్తు చేస్తున్నారు. నాలుగవ దశలో భాగంగా ఇప్పటికే 6 చెరువుల పనులు ప్రారంభమయినట్టు అధికారులు తెలిపారు.

భారీ లక్ష్యం...

రాష్ట్ర వ్యాప్తంగా ఐదు దశల్లో 56,606 చెరువులను ఐదు దశల్లో పునరుద్ధరించటం ద్వారా 29,52,853 ఎకరాలకు సాగునీరందించాలని రాష్ట్ర ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకున్నది. వీటిలో చిన్న చెరువులు, చెక్ డ్యాంలు కుంటలు మినహాయించాలని ఇటీవల నిర్ణయించారు.

చెరువుల సర్వే, గుర్తింపు ప్రక్రియలో జరిగిన జాప్యం వల్ల మొదటి దశ పనుల్లో ఆలస్యం జరిగిందని, నిర్దేశిత కాలంలో పూర్తి కాని చెరువుల పనులను మరుసటి సంవత్సరంలో కూడా కొనసాగించటం ద్వారా ఐదేండ్ల కాలంలో మొత్తం చెరువుల పనులను పూర్తి చేయాలని నిర్ణయించినట్టు అధికారులు తెలిపారు. 2019–20 ఆర్థిక సంవత్సరాంతానికి పూర్తి చేయనున్నట్టు వారు వివరించారు.

మూడు దశలు ఇలా...

మిషన్ కాకతీయ మొదటి దశలో 8,219 చెరువులు గుర్తించగా వీటిలో 7,908 చెరువుల పనులు పూర్తయ్యాయి. మొదటి దశ పనులకు రూ. 1,568.31 కోట్లు ఖర్చయ్యాయి. రెండవ దశలో 10,552 చెరువులు గుర్తించగా 8,755 చెరువులు పనులు పూర్తయ్యాయి. 2,160.20 కోట్ల నిధులు ఖర్చు పెట్టారు. మూడవ దశలో 6,064 చెరువుల పునరుద్ధరణ లక్ష్యంగా పెట్టుకోగా వీటిలో 5,450 చెరువుల పనులు ప్రారంభమయ్యాయి. ఇప్పటి వరకూ 699 చెరువుల పనులు పూర్తి కాగా రూ. 80.61 కోట్లు ఖర్చయ్యాయి. ఆర్థిక సంవత్సరంలో మరో రెండు నెలల కాలం మాత్రమే ఉండటంతో గడువులోగా పనులు పూర్తి చేస్తామని అధికారులు తెలిపారు. ఇప్పటికే 70 శాతం పనులు పూర్తయినప్పటికీ అధికారుల వద్ద నుంచి ఇంకా నివేదికలు అందలేదని వారు వివరించారు.

ఎస్సారెస్పీ నీటి కోసం పెరుగుతున్న ఆందోళనలు

- కలెక్టరేట్ ముట్టడికి యత్నించిన బీజేపీ నాయకుల అరెస్ట్
- రేపు కలెక్టరేట్ ముట్టడికి కాంగ్రెస్ పిలుపు
- పెద్దపల్లిలో వారంపాటు 144 సెక్షన్ : ఏసీపీ హబీబ్‌ఖాన్

నవతెలంగాణ-పెద్దపల్లి

యాసంగిలో రైతులకు ఎస్సారెస్పీ కాల్వల ద్వారా నీరందించాలన్న డిమాండ్ పెద్దపల్లి జిల్లాలో రోజురోజుకూ తీవ్రమవుతోంది. ఈ అంశంపైనే పెద్దపల్లి ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డిని సుల్తానాబాద్ మండలం కొదురుపాక, నారాయణపూర్, పెద్దపల్లి మండలంలోని అప్పన్నపేట గ్రామాల్లో రైతులు ఘెరావ్ చేసిన విషయం తెలిసిందే. ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరిని, ఎమ్మెల్యేల అసమర్థతతో రైతాంగానికి నీరందకుండా పోయిందని ప్రతిపక్ష పార్టీలు ఆ సమస్యను ఎజెండా చేసుకున్నాయి. మంగళవారం కలెక్టరేట్ ముట్టడికి పిలుపునిచ్చిన బీజేపీ నాయకులు ధర్నాకు యత్నించగా పోలీసులు అరెస్టు చేశారు. ఆందోళనకారులను చెదరగొట్టి, అరెస్టు చేసిన వారిని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. సాయంత్రం సొంత పూచీకత్తుపై విడుదల చేశారు. ధర్మారం మండలం కమ్మర్‌ఖాన్‌పేటలో మీస అర్జున్‌రావును అరెస్టు చేసి ధర్మారం స్టేషన్ తరలించారు. మరో 13 మందిని పెద్దపల్లి పోలీసులు ముందుస్తుగా అదుపులోకి తీసుకున్నారు. మండలాల్లో ముంద స్తుగా తెల్లవారుజామునే అరెస్టులు చేశారు. దీంతో అరెస్టులను నిరసిస్తూ రాజీవ్ రహదారిపై బీజేపీ ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించారు. ఎస్ఐ దేవేందర్ ఆందోళనకారులను అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు



అరెస్టయిన బీజేపీ నాయకులు

తరలించారు. పోలీసుల తీరుపై బుధ వారం మళ్లీ నిరసన కార్యక్రమాలు చేపట్టాలని బీజేపీ పిలుపునిచ్చింది. సాగునీటి సమస్యపైన, కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణ పనులపైన మంగళ వారం కాంగ్రెస్ నాయకులు ప్రెస్‌మీట్ పెట్టారు. గురువారం కలెక్టరేట్‌ను ముట్టడిం చనున్నట్టు ప్రకటించారు.

వారంపాటు 144 సెక్షన్ : హబీబ్‌ఖాన్, పెద్దపల్లి ఏసీపీ

పెద్దపల్లిలో వారం రోజుల పాటు 144 సెక్షన్ అమలులో ఉంటుంది. జిల్లా కేంద్రంలో సభలు, సమావేశాలు నిర్వహించడానికి అనుమతి లేదు. నిబంధలను ఉల్లంఘించిన వారిపై కేసులు నమోదు చేస్తాం.

నవచిత్రం

ధనం, బలం.. అభిమానులే

- 'జైసింహా' విజయోత్సవ వేడుకలో బాలకృష్ణ



శివాజీరాజా, సి.కళ్యాణ్, బాలకృష్ణ, కె.ఎస్.రవికుమార్, రత్నం, సి.వి.రావు

"జై సింహా'లో ఇతర ఆర్టిస్టులంతా నాకంటే పొడవు. నేను మాత్రమే పొట్టిగా ఉండేవాడిని. అయినా కళాకారుడికి పాత్ర ముఖ్యం. పొట్టిపొడవులు కాదు' అని బాలకృష్ణ అన్నారు. ఆయన హీరోగా నటించిన చిత్రం 'జై సింహా'. నయనతార, నటాషా దోషి, హరిప్రియ కథానాయికలు. కె.ఎస్.రవికుమార్ దర్శకత్వం వహించిన ఈ చిత్రాన్ని సి.కళ్యాణ్ నిర్మించారు. సంక్రాంతి సందర్భంగా విడుదలైన ఈ సినిమా రూ.50కోట్లు వసూలు చేసిన సందర్భంగా సోమవారం సక్సెస్ సెలబ్రేషన్ ఏర్పాటు చేశారు.

ఈ సందర్భంగా బాలకృష్ణ మాట్లాడుతూ, 'నేను మద్రాసులో ఉన్నప్పుడు సినిమా కొన్న వాళ్ళ మధ్య ఫంక్షన్స్ ఎక్కువగా జరిగేవి. మళ్ళీ అలాంటి పరిస్థితి ఈ రోజు కనిపిస్తుంది. గతంలో నేను కళ్యాణ్‌గారితో 'పరమవీరచక్ర' సినిమా చేశాను. ఆ సినిమాకు నేషనల్ ఇంటిగ్రిటీ అవార్డు వచ్చింది. ఇప్పుడు ఈ సినిమా మంచి సక్సెస్ సాధించింది. డిస్ట్రిబ్యూటర్స్ అందరి కళ్లలో ఆనందం చూశా. ఇది పరిశ్రమ ఆనందం. నేనెప్పుడూ బిజినెస్ కోణంలో ఆలోచించను. నా సినిమాలు చాలా రికార్డులు సాధించాయి. కానీ వాటి గురించి పట్టించుకోను. నాకు కావాల్సింది పరిశ్రమ బాగోగులు మాత్రమే. ఇండస్ట్రీ బాగుండాలి. విజయానికి పొంగిపోవడం, ఫెయిల్యూర్‌కి కృంగిపోవడం నాకిష్టం ఉండదు. కానీ సక్సెస్ లేనప్పుడు కూడా అభిమానులు నాకు అండగా నిలిచారు. ఇన్నేండ్ల సినీజీవితంలో నేను సంపాదించిన ధనం అభిమానులనే. వాళ్ళే నా ధనం. నాన్నగారి 'ఎన్టీఆర్' బయోపిక్ ఆగస్టులో ప్రారంభమవుతుంది' అని అన్నారు. 'బాలయ్య సినిమా అంటే బీసీ సెంటర్లని అంటారు. కానీ ఈ సినిమా అన్ని సెంటర్లలోనూ ఆడింది. త్వరలోనే వంద కోట్లు క్లబ్‌లో చేరుతుందని ఆశిస్తున్నా' అని దర్శకుడు కె.రవికుమార్ తెలిపారు. నిర్మాత సి.కళ్యాణ్ చెబుతూ, 'మా సంస్థలోనే కెరీర్ బెస్ట్ చిత్రమిది. అందుకు గర్వంగా ఉంది. పది రోజుల్లో రూ.50 కోట్లు అందుకున్నాం. అందరి కృషి వల్లే ఇది సాధ్యమైంది' అని చెప్పారు. ఈ సందర్భంగా డిస్ట్రిబ్యూటర్లకు, చిత్ర బృందానికి బాలకృష్ణ షీల్డ్‌లను అందజేశారు. రామ్‌ప్రసాద్, రామ్-లక్ష్మణ్, ప్రభాకర్, రత్నం, శివాజీ రాజా, రవిప్రకాష్ తదితరులు ఈ విజయానంద వేడుకలో తమ అనుభూతులను పంచుకున్నారు.

కమర్షియల్ ఎంటర్‌టైనర్



తమన్నా, విక్రమ్

విక్రమ్, తమన్నా జంటగా నటించిన తమిళ చిత్రం 'స్కెచ్'. విజయ్ చందర్ దర్శకత్వంలో కలైపులి ఎస్.థాను నిర్మించిన ఈ సినిమాను తెలుగులో సురేష్ ప్రొడక్షన్స్ పతాకంపై డి.సురేష్‌బాబు విడుదల చేస్తున్నారు. ఈ సందర్భంగా సోమవారం హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో డి.సురేష్‌బాబు మాట్లాడుతూ, 'సెన్సార్ పూర్తి కాగానే చిత్ర విడుదల తేదీని ప్రకటిస్తాం. విక్రమ్ నాకు మంచి స్నేహితుడు. తను మామూలు నటుడి నుంచి పెద్ద స్టార్‌గా ఎదిగారు. 25ఏండ్ల క్రితం తనని కలిసినప్పుడు ఎలా ఉన్నారో ఇప్పుడూ అలానే ఉన్నారు. ఇండస్ట్రీకి మంచి సినిమాలు అవసరం. సినిమాలు బాగున్నప్పుడు ఆడియెన్స్ థియేటర్‌కి రావాలనుకుంటారు. తమన్ మంచి మ్యూజిక్ అందించారు. సినిమా పెద్ద విజయం సాధించాలి' అని అన్నారు. 'సురేష్‌బాబు ఎప్పట్నుంచో తెలుసు. ఆయన తెలుగులో విడుదల చేస్తున్నారనగానే చాలా ఆనందమేసింది. 'బంగారు కుటుంబం' చిత్రీకరణలో నేనో పక్కనుంటే వెంకటేష్ పిలిచి చాలా బాగా మాట్లాడారు. అప్పుడు నేను పెద్ద హీరో అయిన తర్వాత ఆయనలా ఉండాలనుకున్నా. వెంకటేష్ నుంచి ఎంతో స్ఫూర్తి పొందా. నిజజీవిత ఘటనలతో తెరకెక్కిన కమర్షియల్ చిత్రమిది. నా పాత్ర పరంగా కాస్త భిన్నంగా ఉంటుంది. తమన్నా మంచి నటే కాదు, బెస్ట్ డాన్సర్ కూడా. ఇందులో చిన్న సందేశం కూడా ఉంటుంది. ఈ చిత్రం తమిళం, కన్నడ, మలయాళంలో విడుదలై పెద్ద హిట్ అయ్యింది. తెలుగులోనూ విజయం సాధిస్తుందని నమ్ముతున్నాం' అని విక్రమ్ తెలిపారు. విజయ్ చందర్ చెబుతూ, 'ఈ చిత్రాన్ని ఆదరించాలని కోరుకుంటున్నాం' అని చెప్పారు. 'ఈ సినిమా నాకు చాలా ప్రత్యేకం. విక్రమ్‌తో పనిచేయాలని కెరీర్ ప్రారంభం నుంచి అనుకున్నా. పదేండ్ల తర్వాత ఆ ఛాన్స్ వచ్చింది. ఆయన్నుంచి చాలా విషయాలు నేర్చుకున్నాను. వాణిజ్య హంగులున్న సినిమాలకు నేను పెద్ద అభిమానిని. అలాంటి కమర్షియల్ ఎలిమెంట్స్ నేపథ్యంలో ఈ సినిమాని రూపొందించారు. అన్ని వర్గాల ప్రేక్షకులను అలరించే చిత్రమవుతుంది' అని తమన్నా తెలిపారు.

ఆ పాట సైనికులకు అంకితం..



అల్లు అర్జున్

అల్లు అర్జున్, అను ఇమ్మాన్యుయెల్ హీరోహీరోయిన్లుగా వక్కంతం వంశీ దర్శకత్వంలో రూపొందుతున్న సినిమా 'నాపేరు సూర్య నా ఇల్లు ఇండియా'. కె.నాగబాబు సమర్పణలో రామలక్ష్మీ సినీ క్రియేషన్స్ పతాకంపై శిరీష శ్రీధర్ నిర్మిస్తున్నారు. బన్నీవాసు సహనిర్మాత. ప్రస్తుతం హైదరాబాద్‌లోని నానక్‌రామగూడలో ఫైట్ సన్నివేశాల్ని చిత్రీకరిస్తున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో నిర్మాత లగడపాటి శ్రీధర్ మాట్లాడుతూ, 'గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని సైనికులపై వచ్చే హీరో పరిచయ పాటను ఈ నెల 26న విడుదల చేయబోతున్నాం. సైనికులకు ఈ పాటను అంకితమిస్తున్నాం. రామజోగయ్య శాస్త్రి రాసిన ఈ లిరిక్ విన్నాక నాకు రోమాలు నిక్కబొడుచుకున్నాయి. బాలీవుడ్‌కి చెందిన సంగీత ద్వయం విశాల్-శేఖర్ మంచి ట్యూన్స్ కంపోజ్ చేశారు. బన్నీ కోసం ఈ సినిమా చేశామన్నారు. అంతే ఎగ్జైటింగ్‌గా ఈ మ్యూజిక్ అందించారు. ఐదు పాటలున్నాయి. బన్నీ ఫ్యాన్స్, ప్రేక్షకులకు పాటలు బాగా నచ్చుతాయి. సినిమాకు సంబంధించిన ప్రతి విషయానికి స్పందిస్తూ ఆదరిస్తున్న బన్నీ ఫ్యాన్స్‌కి, ప్రేక్షకులకు ధన్యవాదాలు. వారి సపోర్ట్ మరువలేనిది. ప్రస్తుతం నానక్‌రామగూడలోని రామానాయుడు స్టూడియోలో వేసిన సెట్‌లో పీటర్ హెయిన్స్ ఆధ్వర్యంలో బన్నీపై ఫైట్‌ని చిత్రీకరిస్తున్నాం. ఈ నెల 25 వరకు ఈ ఫైట్‌ని షూట్ చేస్తాం. నలుగురు ఫైట్ మాస్టర్స్ యాక్షన్స్ సీన్స్‌ను రూపొందిస్తున్నారు. కథ, కథనం, సాంగ్స్‌లాగే ఫైట్స్ కూడా సినిమాలో హైలైట్ అవుతాయి. పాటల్లాగే ఫైట్స్‌ని కూడా ఒక్కొక్కటి విడుదల చేయాలని భావిస్తున్నాం. అలాగే సినిమాలోని మరో పాటను ఫిబ్రవరి 14న విడుదల చేస్తాం. ఓ సైనికుడికి తన కుటుంబంతో, ప్రియురాలితో, సమాజంతో, కెరీర్‌తో సాగే సంఘర్షణే ఈ చిత్ర కథ. ఇలాంటి కథ తెలుగులో రాలేదు. భారీ బడ్జెట్‌తో క్వాలిటీ విషయంలో రాజీ పడకుండా నిర్మిస్తున్నాం. ప్రేక్షకుల అంచనాలకు మించి సినిమా ఉంటుంది. ముందు చెప్పినట్టుగానే ఏప్రిల్ 27న సమ్మర్ స్పెషల్‌గా సినిమాను విడుదల చేస్తున్నాం' అని అన్నారు. 'ఈ టైటిల్ వినగానే నా రోమాలు నిక్కబొడిచాయి. వక్కంతం వంశీకిది డైరెక్టర్‌గా డెబ్యూ అయినా ఆయన కథ అందించిన సినిమాలు బ్లాక్‌బస్టర్సే. ఈ సినిమా కూడా అలానే ఉంటుంది. ఇందులో నేను నాలుగు పాటలు రాశాను. పాటలన్నీ సందర్భానుసారంగా వస్తాయి. గతేడాది 'ప్రణామం' (జనతా గ్యారేజ్)కు ఎన్ని అవార్డులు వచ్చాయో ఇందులో సైనికులపై వచ్చే సాంగ్‌కు అన్ని అవార్డులు వస్తాయని ఆశిస్తున్నాను' అని గీత రచయిత రామజోగయ్య శాస్త్రి తెలిపారు.

షాక్ అవుతున్నారు..




రకుల్ ప్రీత్ సింగ్

నిన్నమొన్నటి వరకు బొద్దుగా కనిపించిన రకుల్ ప్రీత్‌సింగ్ ఉన్నట్టుండి జీరో సైజ్‌కి చేరడాన్ని చూసి అందరూ షాక్ అవుతున్నారు. బాలీవుడ్‌లో అజయ్‌దేవగన్ సరసన నటించే చిత్రంలోని పాత్ర కోసం రకుల్ జీరో సైజ్‌కు మారిపోయిందని సోషల్ మీడియా హల్ చల్ చేస్తోంది. ఇదిలా ఉంటే, రకుల్‌కు ఇటీవల ఛాన్స్‌లు తగ్గినట్టే తగ్గి మళ్ళీ ఊపందుకున్నాయి. రకుల్ ప్రస్తుతం తమిళంలో సూర్య సరసన, కార్తీకి జోడీగా రెండు చిత్రాల్లో నటిస్తోంది. అలాగే తెలుగులోనూ నాగార్జున, నాని హీరోలుగా శ్రీరామ్ ఆదిత్య దర్శకత్వంలో తెరకెక్కబోతున్న మల్టీస్టారర్ చిత్రంలోనూ కథానాయికగా ఎంపికైందట. హిందీలో ఇప్పటికే నటించిన 'అయ్యారీ' చిత్రం వచ్చే నెలలో ప్రేక్షకుల ముందుకు రానుంది. దీంతోపాటు ఇటీవలే అజయ్ దేవ్‌గన్‌తో నటించే ఆఫర్‌ను అందిపుచ్చుకుంది. అకీవ్ అలీ దర్శకత్వం వస్తున్న ఈ చిత్రంలో అత్యంత ధైర్యవంతురాలైన అర్బన్ గర్ల్‌గా రకుల్ కనిపించనుంది. కథ, కథనం, పాత్ర వైవిధ్యం వంటి తదితర అంశాలు విపరీతంగా నచ్చటంతో ఈ సినిమాలో నటించేందుకు ఎంతో ఆతృతగా వెయిట్ చేస్తున్నట్టు రకుల్ తెలిపిన విషయం విదితమే. కెరీర్‌పరంగా రకుల్ సక్సెస్‌ఫుల్‌గా దూసుకెళ్తుంటే, రకుల్ సోదరుడు అమన్ మాత్రం ఇప్పుడిప్పుడే అడుగులేస్తున్నాడు. హిందీ, ఇంగ్లీష్ భాషల్లో నిర్మితమవుతున్న 'సెడిషన్' చిత్రంలో హీరోగా యాక్ట్ చేస్తున్నారు. సుమ్మర్ భోదినిక్స్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో అమన్ సిఐఏ ఏజెంట్‌గా నటిస్తున్నారట. ఇప్పటికే సగభాగం చిత్రీకరణ పూర్తి చేసుకున్న ఈ చిత్రంలో ఆస్ట్రేలియా తారలూ నటిస్తున్నారట.

ఏ కళా దర్శకుడికైనా అదొక పెద్ద సవాల్..

'ఏదైన సెట్‌కు ఏజింగ్ ఇవ్వడం పెద్ద ఛాలెంజింగ్ అయిన విషయం. 'భాగమతి' కోసం వేసిన సెట్ చూసి స్వీటీ(అనుష్క) షాక్ అయ్యారు' అని అంటున్నారు కళా దర్శకుడు రవీందర్. అనుష్క ప్రధాన పాత్రధారిణిగా నటించిన చిత్రం 'భాగమతి'. అశోక్ దర్శకత్వంలో యువి క్రియేషన్స్ పతాకంపై వంశీ, ప్రమోద్‌లు నిర్మించిన ఈ సినిమా ఈ నెల 26న విడుదలవుతోంది. ఈ సందర్భంగా రవీందర్ మంగళవారం మీడియాతో ముచ్చటించారు. ఆ విశేషాలు ఆయన మాటల్లోనే..



రవీందర్

తప్పని పరిస్థితుల్లో 3 కోట్లతో సెట్..

దర్శకుడు అశోక్ ఈ కథ చెప్పినప్పుడు 400 ఏండ్ల నాటి బంగ్లా అవసరమనిపించింది. రాణికి ఒక రాజు బహుమతిగా ఇచ్చిన బంగ్లా అది. దాని కోసం ముంబయి వంటి పలు ప్రాంతాలు తిరిగాం. ఎక్కడా మాకు అనుకూలమైన బంగ్లా దొరకలేదు. అదే సమయంలో అనుష్క డేట్స్ ఇచ్చారు. దీంతో తప్పని పరిస్థితిలో దాదాపు రూ.3 కోట్లతో సెట్ వేశాం. ముందుగా స్కెచ్ వేసి దాని ప్రకారం సెట్‌ను డిజైన్ చేశాం. సెట్‌ను చూసి స్వీటీ షాక్ అయ్యారు. 'ఇది చూశాక నాపై మరింత బాధ్యత పెరిగింద'ని చెప్పింది. చాలామంది సినీపెద్దలు సెట్ చూసి అభినందించారు. ఇప్పటి వరకు నేను చేసిన సినిమాలతో పోల్చితే ఇది నా కెరీర్‌లోనే ది బెస్ట్ సినిమా అవుతుంది. బెస్ట్ సెట్ కూడా ఇదే.

కొత్త టెక్నిక్ వాడాం..

సెట్ ఎలా ఉండాలనే దానిపై కొంత రీసెర్చ్ చేశాను. 29 రోజుల్లోనే సెట్‌ని కంప్లీట్ చేశాను. అంత తక్కువ టైమ్‌లో చేయడం ఈజీ కాదు. దీని కోసమై ఓ కొత్త టెక్నిక్‌ను ఉపయోగించాం. సినిమాకిది పెద్ద అసెట్ అవుతుంది. సినిమా చిత్రీకరణ ఎక్కువ శాతం ఈ సెట్‌లోనే జరుగుతుంది. అయితే ఏదైనా సెట్‌కు ఏజింగ్ (పాతకాలంనాటి రూపు తీసుకురావడం) ఇవ్వడమనేది ఏ కళా దర్శకుడికైనా పెద్ద ఛాలెంజింగే. ఆ విషయంలో నేను ప్రతిదీ పర్‌ఫెక్ట్‌గా ఉండేలా జాగ్రత్త తీసుకున్నాను. ఈ సినిమాను 'అరుంధతి'తో పోల్చలేం. హర్రర్ సినిమాలంటే గుర్తొచ్చే అన్ని అంశాలను చెత్త బుట్టలో పడేసి ఓ కొత్త తరహాలో చేసిన హర్రర్ చిత్రమిది. దర్శకుడు అశోక్ చాలా ఇంటలిజెంట్. అన్ని అంశాలపై మంచి పట్టుంది. మా మధ్య మంచి కోఆర్డినేషన్ కుదిరింది. అందుకే సినిమా చాలా బాగా వచ్చింది.

సంతృప్తిగా అనిపిస్తేనే చేస్తాను..

నేను పర్‌ఫెక్షన్‌కు ప్రాధాన్యతనిస్తాను. కలర్, ఏజింగ్‌తో సహా ప్రతిదీ ది బెస్ట్ చేస్తాను. అలాగే ఏదైన సినిమా నాకు సంతృప్తిగా అనిపిస్తేనే చేస్తా. ఈ క్రమంలో నేను చేసిన సినిమాల కంటే వదిలేసిన చిత్రాలే ఎక్కువ. బాలీవుడ్‌లో ఆఫర్లు వచ్చాయి. కానీ తెలుగులోనే రాణించాలనుకుంటున్నా. అయితే బాలీవుడ్‌లో ప్రొడక్షన్ డిజైనింగ్ అంతా ఓ లైన్‌లో ఉంటుంది. అందుకే ఆయా చిత్రాల ఆర్ట్ వర్క్ పర్‌ఫెక్ట్‌గా ఉంటుంది. తెలుగులో ఇప్పుడిప్పుడే ఆ తరహాలో చేస్తున్నారు. క్రమంగా మార్పు వస్తోంది. ప్రస్తుతం నాగచైతన్య హీరోగా మారుతి రూపొందిస్తున్న చిత్రం, ఇంద్రగంటి మోహన్ కృష్ణ దర్శకత్వం వహిస్తున్న సినిమా, శర్వానంద్ చిత్రానికి పనిచేస్తున్నాను. నటుడిగానూ ఓ తమిళ సినిమాలో నటించే ఆఫర్ వచ్చింది. కానీ ఆర్ట్ డైరెక్టర్‌గానే నేనేమిటో ప్రూవ్ చేసుకోవాలనుకుంటున్నాను.

2 స్టేట్స్ రీమేక్‌లో రాజశేఖర్ తనయ..

అడివి శేషు కథానాయకుడిగా లక్ష్య ప్రొడక్షన్స్ పతాకంపై నూతన దర్శకుడు వెంకట్‌రెడ్డి దర్శకత్వంలో ఎం.ఎల్.వి. సత్యనారాయణ ఓ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ చిత్రం ద్వారా రాజశేఖర్, జీవితల తనయ శివాని కథానాయికగా పరిచయం అవుతోంది. ఆ విశేషాల గురించి నిర్మాత తెలియజేస్తూ, 'ఈ నూతన చిత్రాన్ని ఫిబ్రవరిలో ప్రారంభిస్తాం. ఈ సినిమా ద్వారా వెంకట్‌రెడ్డిని దర్శకుడిగా పరిచయం చేస్తున్నందుకు సంతోషంగా ఉంది. వి.వి.వినాయక్ వద్ద చాలా సినిమాలకు వెంకట్‌రెడ్డి అసోసియేట్‌గా పనిచేశారు. హిందీలో ఘన విజయం సాధించిన '2 స్టేట్స్' చిత్రానికి ఇది రీమేక్. ఈ సినిమా ద్వారా హీరోయిన్‌గా శివానిని పరిచయం చేయడం ఆనందంగా ఉంది. కథానాయికగా ఎంట్రీ కోసం శివాని ఎన్నో కథలు విన్నప్పటికీ నటనకు ఆస్కారం ఉన్న ఈ కథను ఎంచుకోవడం విశేషం. బ్యూటిఫుల్ లవ్ అండ్ రొమాంటిక్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కిస్తున్నాం. ఈ చిత్రంలో నటించే నటీనటులు, సాంకేతిక నిపుణుల వివరాలను త్వరలోనే వెల్లడిస్తాం' అని అన్నారు. ఈ చిత్రానికి సంగీతం: అనూప్ రూబెన్స్, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: ఎం.ఎస్.కుమార్.



శివాని

హ్యాట్సాఫ్ టు స్పీల్‌బర్గ్..



రిచా చద్దా

"సరైన టైమ్‌లో ప్రజాస్వామ్య నేపథ్య చిత్రంగా 'ది పోస్ట్'ను దర్శకుడు స్టీవెన్ స్పీల్‌బర్గ్ ప్రేక్షకుల ముందుకు తీసుకురావడం అభినందనీయం' అని బాలీవుడ్ నటి రిచా చద్దా అన్నారు. విశ్వవ్యాప్తంగా సంచలనం సృష్టించిన పెంటాగన్ పేపర్స్ ఇతివృత్తంతో సాగే చిత్రమిది. వియత్నాం యుద్ధానికి సంబంధించి 30 ఏండ్లుగా అమెరికా పోషించిన పాత్ర గురించి ది వాషింగ్టన్ పోస్ట్ దినపత్రికకు చెందిన జర్నలిస్టులు ప్రపంచానికి ఎలా తెలియజేశారనే అంశంతో రూపొందిన చిత్రం 'ది పోస్ట్'. ప్రస్తుతం ఆస్కార్ బరిలోనూ పోటీ పడుతోంది. ఇప్పటికే విడుదలైన అన్ని చోట్లా విశేష ప్రేక్షకాదరణ పొందింది. పొలిటికల్ థ్రిల్లర్ నేపథ్యంలో తెరకెక్కిన ఈ చిత్రం గురించి రిచా చద్దా స్పందిస్తూ, 'ఇదొక అద్భుతమైన సినిమానే కాదు. మన కాళ్ళకు మట్టి అంటి ఇబ్బంది పడుతున్నా, మన వెన్నెముక పని చేయకపోయినా, మన చేతులు అలసిపోయి ఉన్నప్పటికీ.. మన గుండె ఎక్కడుందో మన చేతులు కరెక్ట్‌గా తెలియజేస్తాయి. ఒక్కమాటలో చెప్పాలంటే మనకి మనమేంటో ఎలా అర్థమవుతుందో, ప్రస్తుత ప్రజాస్వామ్య వ్యవస్థను అదే రీతిలో రూపొందించిన స్పీల్‌బర్గ్ అభినందనీయుడు. హ్యాట్సాఫ్ టు స్పీల్‌బర్గ్' అని చెప్పింది. రిచా చద్దా ప్రస్తుతం 'దాస్ దేవ్', '3స్టోరీస్', 'లవ్ సోనియా', 'క్యాబరేట్', 'గూంమ్కేటు' వంటి తదితర చిత్రాల్లో నటిస్తోంది.

ఇన్వెస్టిగేటివ్ జర్నలిస్ట్..



అనసూయ

మోహన్‌బాబు ప్రధాన పాత్రలో నటిస్తున్న చిత్రం 'గాయత్రి'. మంచు విష్ణు, శ్రియా, నిఖిలా విమల్, అనసూయ ముఖ్య పాత్రలు పోషించారు. మదన్ రామిగాని దర్శకత్వం వహించిన ఈ చిత్రాన్ని అరియానా, వివియానా, విద్యా నిర్వాణ సమర్పణలో శ్రీ లక్ష్మి ప్రసన్న పిక్చర్స్ పతాకంపై మోహన్‌బాబు నిర్మిస్తున్నారు. ఈ చిత్రంలోని అనసూయ క్యారెక్టర్ లుక్‌ను మంగళవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా చిత్ర బృందం తెలియజేస్తూ, 'శ్రేష్ట జయరాం అనే ఇన్వెస్టిగేటివ్ రిపోర్టర్‌గా అనసూయ కనిపించనున్నారు. యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా సాగే ఈ చిత్రం ఫిబ్రవరి 9న విడుదల కానుంది' అని తెలిపింది.

యోగా టీచర్‌గా అలరిస్తా..



అమైరా దస్తూర్

'స్వచ్ఛమైన ప్రేమ కథా చిత్రం 'మనసుకు నచ్చింది. ప్రేక్షకులకు సరికొత్త అనుభూతినిస్తుంది' అని అంటోంది అమైరా దస్తూర్. సందీప్ కిషన్, అమైరా దస్తూర్ జంటగా నటించిన చిత్రం 'మనసుకు నచ్చింది'. ఘట్టమనేని మంజుల దర్శకత్వం వహించిన ఈ చిత్రం వచ్చే నెల 16న విడుదల కానుంది. ఈ సందర్భంగా అమైరా దస్తూర్ మంగళవారం మీడియాతో మాట్లాడుతూ, 'మాది ముంబయి. పార్సీ ఫ్యామిలీకి చెందిన అమ్మాయిని. బికాం వరకు చదువుకున్నా. 2013లో హీరోయిన్‌గా ఎంట్రీ ఇచ్చా. 'అనేగన్', 'కుంగ్ ఫూ యోగా', 'మిస్టర్ ఎక్స్' చిత్రాల్లో నటించాను. ఇటీవల విడుదలైన బాలీవుడ్ చిత్రం 'కలాకాండి' సైతం మంచి పేరు తెచ్చిపెట్టింది. గతేడాది ఇందులో నటించే ఛాన్స్ వచ్చింది. మొదట మంజులగారు నన్ను అప్రోచ్ అయ్యారు. కథ బాగా నచ్చింది. స్క్రిప్ట్ విన్నప్పుడు చాలా ఎగ్జైట్ అయ్యాను. మహిళా ప్రాధాన్యత ఉన్న చిత్రమిది. నా పాత్ర ప్రధానంగా సినిమా సాగుతుంది. ఇందులో నేను నిత్య అనే యోగా టీచర్‌గా కనిపిస్తాను. సాధారణ తెలుగమ్మాయిని. తను ఏదీ చేసినా బెస్ట్‌గా ఉండాలనుకుంటుంది. ఈ క్రమంలో తనని తాను, తన ప్రేమను తెలుసుకోవడమనేదే సినిమా. ఫ్రెష్ రొమాంటిక్ లవ్ స్టోరీ ఇది. సందీప్ కిషన్‌తో నటించడం చాలా హ్యాపీగా ఉంది. ఆయన చాలా సరదా మనిషి. సెట్‌లో చాలా జోవియల్‌గా ఉంటారు. తెలుగు మాట్లాడటం కష్టమైనా ఇప్పుడిప్పుడు కొంచెం కొంచెం నేర్చుకుంటున్నా. తమిళం బాగా మాట్లాడతాను. మంజులగారు పర్‌ఫెక్షనిస్ట్. తనకిది తొలి చిత్రమైనా అద్భుతంగా తెరకెక్కించారు. ఈ చిత్రం ఆడియెన్స్‌కు సరికొత్త ఫీల్‌నిస్తుంది. ప్రస్తుతం రాజ్‌తరుణ్‌తో 'రాజుగాడు' చిత్రంలో నటిస్తున్నాను. తెలుగులో సైన్ చేసిన తొలిచిత్రమిదే. చిత్రీకరణ పూర్తి చేసుకుని విడుదలకు సిద్ధంగా ఉంది. నాకు లవ్ స్టోరీస్ అంటే ఇష్టం. ఇకపై కూడా తెలుగులో నటిస్తాను. మంచి పాత్రలొస్తే హ్యాపీగా ఫీలౌతాను' అని చెప్పింది.

సమస్యలపై 'రణం'



మాట్లాడుతున్న కాకి మాధవరావు, పక్కన జాన్‌వెస్లీ, ఉసా, కంచ ఐలయ్య, జ్వలిత, గద్దర్, తదితరులు

నవతెలంగాణ బ్యూరో – హైదరాబాద్

డబుల్ బెడ్ రూం ఇండ్లు, దళితులకు మూడెకరాల భూమి, కేజీ టూ పీజీ, రైతులకు గిట్టుబాటు ధరలు, విద్యార్థులకు స్కాలర్ షిప్పులు, ఫీజు రీయింబర్స్‌మెంట్ తదితర సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ.. సోమవారం రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించిన కలెక్టరేట్ల ముట్టడి కార్యక్రమం జయప్రదమైందని తెలంగాణ సామాజిక ప్రజా సంఘాల ఐక్య వేదిక (టీ మాస్ ఫోరం) తెలిపింది. ఈ నేపథ్యంలో వీటిని పరిష్కరించేందుకు ప్రభుత్వానికి 15 రోజుల గడువునిస్తున్నామని ఫోరం నేతలు చెప్పారు. ఈలోగా వాటిని పరిష్కరించకపోతే మరోసారి కార్యాచరణ ప్రకటించి.. ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని వారు హెచ్చరించారు. మంగళవారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో టీ మాస్ ఫోరం రాష్ట్ర కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి స్టీరింగ్ కమిటీ సభ్యులు, జిల్లాల చైర్మెన్లు, కన్వీనర్లు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు హాజరయ్యారు. అనంతరం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఫోరం నేతలు.. రాష్ట్ర ప్రభుత్వ మాజీ ప్రధాన కార్యదర్శి కాకి మాధవరావు, ప్రొఫెసర్ కంచ ఐలయ్య, గద్దర్, ఉసా, జాన్‌వెస్లీ, జ్వలిత, మన్నారం నాగరాజు, శ్రీరాం నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా మాధవరావు మాట్లాడుతూ.. ప్రస్తుతం అటు దేశంలోను, ఇటు రాష్ట్రంలోనూ నెలకొన్న వివిధ సామాజిక, రాజకీయ అంశాలపై రాష్ట్ర కార్యవర్గంలో విస్తృతంగా చర్చించామని అన్నారు. దీంతోపాటు వాటిని భిన్న కోణాల్లోంచి పరిశీలించి, విశ్లేషించామని తెలిపారు. ఐలయ్య మాట్లాడుతూ.. టీ మాస్ అనేది ఒక రాజకీయ పార్టీ కాదని స్పష్టం చేశారు. ఇది ప్రజా సమస్యలే ప్రాతిపదిగ్గా సామాజిక, ప్రజా సంఘాలతో ఏర్పడ్డ వేదికని తెలిపారు. తెలంగాణలో సామాజిక న్యాయాన్ని సాధించటమే తమ ఫోరం లక్ష్యమని చెప్పారు. ఎన్నికల సమయంతోపాటు ఆ తర్వాత కూడా ఈ అంశాన్ని ప్రధాన అజెండాగా చేస్తామని.. రాజకీయ పార్టీలన్నీ దీని చుట్టూనే తిరిగే విధంగా తమ ఉద్యమాల ద్వారా ప్రభావితం చేస్తామని తెలిపారు. సామాజిక న్యాయానికి కట్టుబడి ఉన్న పార్టీలకు మద్దతిస్తాం.. దాన్ని వ్యతిరేకించే పార్టీలకు వ్యతిరేకంగా పనిచేస్తామని ఆయన స్పష్టం చేశారు. జనాభాలో అత్యధికంగా ఉన్న బీసీల జనాభాకు అనుగుణంగా చట్టసభల్లో రిజర్వేషన్లు సాధించాలని అన్నారు. ప్రభుత్వరంగాన్ని కాపాడుకుంటూనే ప్రయివేటు రంగంలో రిజర్వేషన్ల కోసం పోరాడతామని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలన్నింటిలో ఇంగ్లీషు మీడియాన్ని తప్పనిసరి చేయాలని, ఇంటర్మీడియట్ విద్యను ఎత్తేయాలని డిమాండ్ చేశారు. కులాంతర వివాహాలు చేసుకున్న వారికి తమ ఫోరం రక్షణ కల్పిస్తుందని చెప్పారు. జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ కూడా ప్రజా సమస్యలపై పాదయాత్ర చేస్తున్నారు.. దీనిపై మీరేమంటారు..? అని విలేకరులు అడగ్గా... 'ఆయన కూడా ఒక బీసీయే కదా..? అలాంటప్పుడు మేం నిర్వహించే మహాత్మా జ్యోతిబా ఫూలే, సావిత్రీబాయి ఫూలే, అంబేద్కర్ జయంతులు, వర్ధంతుల్లో పాల్గొంటారా..?' అని ప్రశ్నించారు. టీ మాస్ ఫోరంతో కలిసి పనిచేయటానికి పవన్ సిద్ధంగా ఉన్నారా? లేదా? అనే విషయాన్ని తేల్చాలని కోరారు.

జాన్‌వెస్లీ మాట్లాడుతూ.. మార్చిలో అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు నిర్వహించనున్న నేపథ్యంలో రాష్ట్రంలో 93 శాతంగా ఉన్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు న్యాయమైన వాటా దక్కాలని డిమాండ్ చేశారు. ఇందుకోసం దశలవారీ ఆందోళనల ద్వారా ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తామని తెలిపారు. తెలంగాణాలోని సకల జనులందరికీ సామాజిక, రాజకీయ, ఆర్థిక న్యాయం జరగాలని అన్నారు. రాజ్యాంగ పీఠికలో పొందుపరిచిన సోషలిజం, సెక్యులరిజాన్ని పరిరక్షించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 26న అంబేద్కర్ విగ్రహాల ముందు ప్రతిజ్ఞలు చేయాలని కిందిస్థాయి శ్రేణులకు పిలుపునిచ్చారు. ప్రయివేటు రంగంలో రిజర్వేషన్లపై చట్టం రూపొందించాలని డిమాండ్ చేశారు. గద్దర్ మాట్లాడుతూ.. ప్రజలు, ప్రజా సాంస్కృతిక రంగాలను మేళవించటం ద్వారా రాష్ట్రంలో ఒక సాంస్కృతిక విప్లవాన్ని తీసుకురావాలని సూచించారు. తెలంగాణలో ఫ్యూడల్ పాలన మళ్లీ వచ్చిందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో పోరాటాలకు పదును పెట్టాలని సూచించారు. జ్వలిత మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మహిళల పట్ల వివక్షాపూరితంగా వ్యవహరిస్తున్నాయని విమర్శించారు. తెలంగాణ కేబినెట్‌లో ఒక్క మహిళకు కూడా స్థానం లేకపోవటం శోచనీయమని అన్నారు. ఉసా మాట్లాడుతూ.. సామాజిక, ప్రజా సంఘాలతో ఏర్పడ్డ టీ మాస్ ఫోరం దేశంలోనే ఒక అరుదైన వేదికని చెప్పారు.

ఆరెస్సెస్, ఏబీవీపీ గూండాల దాడిపై ఖండన

నల్లగొండ జిల్లా కేవీపీఎస్ కార్యదర్శి పాలడుగు నాగార్జునపై ఆరెస్సెస్, ఏబీవీపీ గూండాలు దాడి చేయటాన్ని టీ మాస్ ఫోరం తీవ్రంగా ఖండించింది. దీంతోపాటు యాదాద్రి భువనగిరి జిల్లాలో మూడు రోజుల క్రితం దళితులపై దాడి చేసిన గో రక్షక దళ కార్యకర్తల ఘాతుకాన్ని తీవ్రంగా ఖండించింది. ఈ రెండు ఘటనలకు పాల్పడిన బాధ్యులను వెంటనే అరెస్టు చేసి, కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేసింది.

టీ మాస్ రాష్ట్ర చైర్మెన్‌గా ప్రొఫెసర్ కంచ ఐలయ్య



కన్వీనర్‌గా జాన్‌వెస్లీ, కో-కన్వీనర్‌గా జ్వలిత

టీ మాస్ ఫోరం రాష్ట్ర చైర్మెన్‌గా ప్రొఫెసర్ కంచ ఐలయ్య ఎన్నికయ్యారు. కన్వీనర్‌గా జాన్‌వెస్లీ, కో-కన్వీనర్‌గా జ్వలిత ఎన్నికయ్యారు. మంగళవారం జరిగిన ఫోరం రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో వీరిని ఎన్నుకున్నారు.

పిచ్చకుంట్ల వార్తలెవరు చదువుతారు..?

మంత్రి పద్మారావు అనుచిత వ్యాఖ్యలు

- సికింద్రాబాద్‌లో జర్నలిస్టుల నిరసన
- క్షమాపణ చెప్పాలని డిమాండ్

నవతెలంగాణ – అడ్డగుట్ట (హైదరాబాద్)

'మీరు రాసే పిచ్చకుంట్ల వార్తలెవరు చదువుతారు.. మీరు రాసే వార్తలకే అన్నీ జరిగితే.. నేనే జర్నలిస్టును అయ్యేవాడిని.. రాజకీయ నాయకుడిని ఎందుకయ్యేవాడిని' అంటూ ఎక్సైజ్ శాఖ మంత్రి పద్మారావు జర్నలిస్టుల పట్ల అనుచిత వ్యాఖ్యలు చేశారు. మంత్రి వ్యాఖ్యలపై ప్రింట్, ఎల్రక్టానిక్ మీడియా జర్నలిస్టులు నిరసన తెలిపారు. సుమారు 50 మంది మంగళవారం సికింద్రాబాద్‌లోని అడ్డగుట్టలో దీక్షకు దిగారు. సికింద్రాబాద్‌లోని అడ్డగుట్టలో వర్షపు నీటికోసం వేసిన పైపులైను సోమవారం ప్రారంభించడానికి వచ్చిన మంత్రి పై వ్యాఖ్యలు చేశారు. దీనిపై మంగళవారం నిరసన దీక్ష చేశారు. మంత్రి భేషరతుగా క్షమాపణ చెప్పాలని, లేకుంటే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. సీపీఐ(ఎం) నగర కార్యదర్శివర్గ సభ్యులు కెవిఎస్.రాజన్న, టీడీపీ నగర వర్కింగ్ ప్రెసిడెంట్ సారంగపాని, మహిళా కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి భానుప్రియతోపాటు పలువురు నాయకులు జర్నలిస్టులకు సంఘీభావం తెలిపారు. ఈ దీక్షలో విలేకరులు సాగర్‌బాబు(ఆంధ్రజ్యోతి), శ్రీనివాస్ (నవతెలంగాణ), కృష్ణ(10 టీవీ), శివశంకర్ (సూర్య), నరేష్ (ఆంధ్రప్రభ), నర్సింగ్‌రావు (రాజ్‌న్యూస్), గంగాధర్ (హెచ్ఎంటీవీ), సాయి (టీవీ 9), రాజు(సాక్షి), ప్రవీణ్ (ఎన్టీవీ) తదితరులు పాల్గొన్నారు.

పలు సంఘాల ఖండన

మంత్రి పద్మారావు చేసిన వ్యాఖ్యలపై పలు జర్నలిస్టు సంఘాలు తీవ్రంగా ఖండించాయి. జర్నలిస్టుల పట్ల మంత్రి పద్మారావు చేసిన అనుచిత వ్యాఖ్యలు సరైంది కాదని, తెలంగాణ ఉద్యమంలో జర్నలిస్టుల వార్తలే ప్రామాణికంగా మారిన విషయాన్ని ఆయన మరిచారని టీడబ్ల్యూజేయూ నగర అధ్యక్షుడు యోగానంద్ అన్నారు. తన వ్యాఖ్యలు ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.

వంద మున్సిపాలిటీలు!

(మొదటిపేజీ తరువాయి)

తూప్రాన్, నర్సాపూర్, రామాయంపేట వంటి గ్రామాలు పరిశీలనలో ఉన్నాయి. మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్ 40 కొత్త మున్సిపాలిటీలను ఏర్పాటు చేస్తామని ప్రకటించిన విషయం తెలిసింది. అయితే ప్రస్తుతం కొత్త మున్సిపాలిటీల ఏర్పాటు ఉన్న అవకాశాలు మాత్రం 30 వరకు ఉన్నట్టు అధికారులు చెబుతున్నారు. కొత్త మున్సిపాలిటీలు ప్రకటించేందుకు కొన్ని విధి విధానాలు రూపొందించింది. ఆ గ్రామం పరిధిలో వ్యవసాయం కరువై, ఉపాధి కోసం పట్టణాలకు వెళ్లిపోవడం, ఒకటి లేదా రెండు కిలో మీటర్ల పరిధిలో ఉన్న గ్రామాలను కూడా విలీనం చేయనున్నారు. మున్సిపాలిటీలుగా ప్రకటించడం ద్వారా మున్సిపాలిటీలలో మౌలిక సదుపాయాలు కల్పించడం, ప్రణాళిక బద్ధంగా అభివృద్ధి చేయడం, టౌన్‌ప్లానింగ్ చేయడం, పౌరులకు సకల సదుపాయాలు కల్పించడం, కొత్త మున్సిపాలిటీలలో గ్రామాలు విలీనం చేస్తే తమపై తీవ్రమైన పన్ను భారం పడుతుందని, పచ్చని పొలాలు బీళ్లుగా మారుతాయని రైతన్న ఆందోళన చెందుతున్నారు. మరోవైపు ప్రజల్లో దీనిపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించి ప్రజలను సిద్ధం చేస్తున్నది. ఇదిలా ఉండగా గ్రేటర్ హైదరాబాద్ కార్పొరేషన్ పరిధి పెంచాలని మరో ప్రతిపాదన కూడా ఉన్నది. ఓఆర్ఆర్ లోపల ఉన్న గ్రామాలను గ్రేటర్‌లో కలపాలని భావిస్తోంది. దీంతో గ్రేటర్ హైదరాబాద్ కార్పొరేషన్ పరిధి ఓఆర్ఆర్ వరకు విస్తరించనుంది. కాగా, పంచాయతీలను మున్సిపాలిటీల్లో చేర్చితే స్థానిక జనంపై మరిన్ని భారాలు పెరిగే అవకాశాలున్నాయని ప్రజా సంఘాలు అంటున్నాయి.

27,29న ఇంటర్

విద్యార్థులకు పర్యావరణ విద్య పరీక్ష

నవతెలంగాణ బ్యూరో – హైదరాబాద్: రాష్ట్రంలోని ఇంటర్మీడియెట్ ప్రథమ సంవత్సరం విద్యార్థులకు ఈనెల 27, 29 తేదీల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు నైతికత, మానవ విలువలు, పర్యావరణ విద్య రాతపరీక్ష జరగనుంది. ఈ మేరకు ఇంటర్ పరీక్షల నియంత్రణాధికారి సుశీల్‌కుమార్ మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. పర్యావరణ విద్య సబ్జెక్టును 2006లో, నైతికత, మానవ విలువలు రాతపరీక్షను 2014లో ప్రవేశపెట్టామని తెలిపారు. ఈ పరీక్షలకు విద్యార్థులు తప్పనిసరిగా హాజరుకావాలని, అప్పుడే ఉత్తీర్ణత ధ్రువపత్రం అందుతుందని కోరారు. ఈ పరీక్షలోలు ఉత్తీర్ణులు కాకపోతే ఇంటర్ ధ్రువపత్రం విద్యార్థులకు అందించబోమని తెలిపారు. గతంలో ఫెయిలైన విద్యార్థులూ ఈ పరీక్షలు రాయొచ్చని కోరారు. ఈ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థుల నుంచి కాలేజీ యాజమాన్యాలు ఎలాంటి ఫీజు వసూలు చేయొద్దని సూచించారు. విద్యార్థుల హాల్‌టికెట్లు టీఎస్‌బీఐఈ వెబ్‌సైట్‌లో కాలేజీ లాగిన్‌లో ప్రిన్సిపాల్స్ డౌన్‌లోడ్ చేసుకుని ఇవ్వాలని కోరారు.

సృజనాత్మకంగా కొనసాగుతున్న జిజ్ఞాస

నవతెలంగాణ బ్యూరో – హైదరాబాద్

రాష్ట్రంలోని ప్రభుత్వ డిగ్రీ కాలేజీ విద్యార్థుల అధ్యయన నివేదికలు సమర్పించే జిజ్ఞాస కార్యక్రమం సృజనాత్మకంగా కొనసాగుతున్నది. డిగ్రీ విద్యార్థులకు విద్యాభ్యాసంతోపాటు పరిశోధన, మౌలిక లక్ష్యాలు, లక్షణాలు, పద్ధతులు నేర్చుకునేందుకు దోహదపడుతున్నది. ఈనెల 18న ప్రారంభమైన జిజ్ఞాస విజయవంతంగా జరుగుతున్నది. మంగళవారం కామర్స్ విద్యార్థులు 22 అధ్యయన నివేదికలను 27 ఎకనామిక్స్ అధ్యయన నివేదికలను సమర్పించారు. సబ్జెక్టు నిపుణులుగా కామర్స్ విభాగానికి హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ మేరీ జెస్సిక, ఉస్మానియా కోఠి మహిళా కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ సంధ్యారాణి వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌సీయూ ప్రొఫెసర్ లక్ష్మీనారాయణ, ఓయూ రిటైర్డ్ ప్రొఫెసర్ శివారెడ్డి, జిజ్ఞాస సమన్వయకర్త నాన్సీ సెరెనా తదితరులు పాల్గొన్నారు.

డిసెంబర్ నాటికి

మెట్రో రైలు పనులను పూర్తి చేయాలి

- అధికారులకు సీఎస్ ఆదేశం

నవతెలంగాణ బ్యూరో–హైదరాబాద్

మొదటి దశ కింద చేపట్టిన మెట్రో రైల్ పనులను ఈ ఏడాది డిసెంబర్ నాటికి పూర్తి చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్పీ సింగ్ ఉన్నతాధికారులను అదేశించారు. రెండో దశ పనులకు సంబంధించి డిటైల్డ్ ప్రాజెక్టు రిపోర్ట్ (డీపీఆర్)తో పాటు సర్వే ప్రక్రియను సిద్ధం చేయాలని తెలిపారు. మంగళవారం సచివాలయంలో మెట్రో రైల్ పనులపై ఆయన ఉన్నతాధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎస్ మాట్లాడుతూ ప్రయాణికులు ఎలాంటి ఇబ్బందులు పడకుండా రవాణా సదుపాయాలను మెట్రో రైల్ స్టేషన్లకు అనుసంధానం చేయాలని సూచించారు. మియాపూర్– అమీర్‌పేట్, నాగోల్ వరకు 30 కిలోమీటర్ల పరిధి వరకు మెట్రో రైల్ స్టేషన్లకు ఫీడర్ సర్వీస్ కనెక్టివిటీని వెంటనే ఏర్పాటు చేయాలని తెలిపారు. అమీర్‌పేట్–ఎల్బీనగర్, అమీర్‌పేట– హైటెక్ సిటీ, జేబీఎస్– ఎంజీబీఎస్ వరకు ఉన్న మెట్రో రైల్‌లను జూన్ నుంచి ప్రారంభించనున్నట్టు మెట్రో రైల్ ఎండీ ఎన్‌వీఎస్‌రెడ్డి తెలిపారు.

'ఖేలో ఇండియా' శిక్షణకు 81 మంది ఎంపిక

నవతెలంగాణ బ్యూరో– హైదరాబాద్

క్రీడాకారులను ప్రోత్సహించేందుకు కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన 'ఖేలో ఇండియా' పోటీలకు తెలంగాణ నుంచి అండర్ 17 విభాగంలో 81 మంది క్రీడాకారులను ఎంపికయ్యారు. పది రకాల స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జాతీయ స్థాయిలో తొలి 8 స్థానాల్లో నిలిచిన వారిని కేంద్ర క్రీడాశాఖ ఎంపిక చేసింది. రాష్ట్రం నుంచి అథ్లెటిక్స్‌లో ఐదుగురు, విలువిద్యలో ఒక్కరు, రెజ్లింగ్‌లో 14 మంది, వెయిట్ లిఫ్టింగ్‌లో 11 మంది, జూడోలో ఏడుగురు, స్విమ్మింగ్‌లో ముగ్గురు, ఖోఖోలో 12 మంది, బాస్కెట్‌బాల్‌లో 12 మంది, బాక్సింగ్‌లో పది మంది, షూటింగ్‌లో ఒక్కరు ఎంపికయ్యారు. వీరందరికీ ప్రస్తుతం హైద రాబాద్, కరీంనగర్ తదితర ప్రాంతాల్లో శిక్షణ ఇస్తున్నారు. వీరంతా ఢిల్లీలో ఈనెలాఖరులో(రెండు పోటీలు ప్రారంభమయ్యాయి) జరిగే పోట ీల్లో పాల్గొంటారు. జాతీయస్థాయిలో తొలిమూడు స్థానాల్లో నిలిస్తే కేంద్ర ప్రభుత్వం వీరికి రూ.ఐదు లక్షల స్కాలర్‌షిప్ అందజేయనుంది. కాగా రాష్ట్రం నుంచి మరో ఇద్దరు క్రీడాకారులనూ ప్రత్యేక కోటా కింద పంపిస్తున్నారు.

ఇద్దరు ఖాకీలపై వేటు

- హోంమంత్రి నాయిని సీరియస్
- ఇద్దరిని సస్పెండ్ చేస్తూ ఆదేశాలు జారీ

నవ తెలంగాణ, ప్రత్యేక ప్రతినిధి

రాష్ట్ర పోలీసు శాఖ ప్రతిష్ఠను దిగజార్చేలా అధికారులు మొదలుకుని సిబ్బంది వరకు ఎవరు ప్రవర్తించినా కఠిన చర్యలు తప్పవని రాష్ట్ర హోంమంత్రి నాయిని నర్సింహారెడ్డి మంగళవారం హెచ్చరించారు. వివాహేతర సంబంధం కలిగి ఉన్నారనే ఆరోపణలు ఎదుర్కొంటున్న రాష్ట్ర అవినీతి నిరోధక శాఖ అదనపు ఎస్పీ సునీతారెడ్డి, వనపర్తి ఇన్‌స్పెక్టర్ మల్లిఖార్జునరెడ్డిలను సస్పెండ్ చేసినట్టు ఆయన ప్రకటించారు. దేశంలోనే అత్యుత్తమ పోలీసు శాఖగా గుర్తింపు పొందిన బాధ్యతాయుత విభాగంలో కీలక పదవులలో కొనసాగుతున్న ఈ ఇద్దరరు నైతిక విలువలను దిగజారుస్తు వ్యవహరించడం పట్ల ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలాంటి ప్రవర్తనకు ఎవరూ పాల్పడ్డ సహించబోమని ఆయన అన్నారు. అంతకు ముందు తన భార్యతో మల్లి ఖార్జునరెడ్డి అక్రమ సంబంధాన్ని పెట్టుకోవడం, వారిని రెడ్ హాండెడ్‌గా పట్టుకోవడంతో తనపై కక్షపూని ప్రాణాలకు హాని కలిగించే ప్రమాదం ఉందని సునీతారెడ్డి భర్త సురేందర్‌రెడ్డి పోలీసు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశాడు. రెండేండ్ల క్రితమే వీరి గురించి తెలిసి పెద్దల సమక్షంలో మాట్లాడి మందలించడం జరిగిందని, అటు తర్వాత కూడా మల్లిఖార్జున్‌రెడ్డి తమింటికే వచ్చి అక్రమ సంబంధాన్ని కొనసాగించడాని ఆయన ఆరోపించారు. ఇతనిపై కఠినంగా చర్యలు తీసుకోవాలని అధికారులను కోరాడు. సురేందర్‌రెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు సీఐమల్లిఖార్జున్‌రెడ్డిపై కేసు నమోదు చేసుకుని సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలోని కూకట్‌పల్లి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఇప్పటికే సునీతారెడ్డి భర్త, అత్త, మరో ఇద్దరి నుంచి స్టేట్‌మెంట్లను అధికారులు రికార్డు చేశారు.

చిన్న ఉద్యోగం దొరికే పరిస్థితి లేదు

అంతర్జాతీయ కార్మిక సంస్థ

న్యూఢిల్లీ : ప్రపంచ ఆర్థిక వ్యవస్థ మంద గమనంలో ఉందని, ఓ చిన్న ఉద్యోగాన్ని పొందటం కూడా కష్టతరంగా మారుతుందని 'అంతర్జాతీయ కార్మిక సంస్థ' (ఐఎల్ఓ) అభిప్రాయపడింది. ముందు ముందు ఉపాధి, ఉద్యోగాలకు అనుకూల పరిస్థితులు కనపడటం లేదని 'వరల్డ్ ఎంప్లాయ్‌మెంట్ సోషల్ ఔట్‌లుక్' 2018 ఏడాది నివేదికలో ఐఎల్ఓ అభిప్రాయపడింది. రాబోయే రెండేండ్లలో పెద్ద సంఖ్యలో ఉద్యోగాల్లో కోత పడనున్నదని ఈ నివేదికలో పేర్కొన్నారు. అనేక దేశాల్లో ఇప్పటికే ఉద్యోగాల కోత ప్రారంభమైందని, ఆ ప్రభావం 140 కోట్లమంది ప్రజలపై పడిందని, ఆర్థిక మందగమనం 2019నాటికల్లా మరో 3.5 కోట్లమందిని ప్రభావితం చేస్తుందని ఐఎల్ఓ తెలియజేసింది.

ప్రపంచవ్యాప్తంగా అసంఘటిత రంగంలో కార్మికుల సంఖ్య పెరగటం, ఉద్యోగ, సామాజిక భద్రతకు హాని తెచ్చిపెట్టిందని తాజా నివేదికలో ఐఎల్ఓ తెలియజేసింది. ఈ సమస్య ముఖ్యంగా అభివృద్ధి చెందిన దేశాల్లో ఎక్కువగా ఉందని, ప్రతీ నలుగురిలో ఒక్కరికి ఉద్యోగ భద్రత కరువైందని, అభివృద్ధి చెందుతున్న దేశాల్లో 30 కోట్లమంది కార్మిక శక్తిగా ఎదిగిందని ఐఎల్ఓ తెలియజేసింది. ఉద్యోగ భద్రత కరువైనందువల్లే సరైన వేతనాలు అందటం లేదని అభిప్రాయపడ్డారు.

కుల బహిష్కరణ

(మొదటిపేజీ తరువాయి)

రెండు కుటుంబాలనూ బహిష్కరించారు. కుల సంఘానికి రూ.50 వేలు కట్టి...పెద్దల సమక్షంలో మళ్లీ పెండ్లి చేస్తేనే బహిష్కరణ ఎత్తేస్తామని ప్రకటించారు. ఈ ఘటన నిర్మల్ జిల్లా కడెం మండలం చిట్యాల్ గ్రామంలో మంగళవారం వెలుగుచూసింది.

చిట్యాల్ గ్రామానికి చెందిన జంబుర్తి శంకరవ్వ, సత్తన్న(బెస్త సామాజిక తరగతి)దుబాయ్‌కి ఉపాధి కోసం వెళ్లాడు. అతనికి శైలజ అనే కుమార్తె ఉంది. అదే సామాజిక తరగతికి చెందిన జగిత్యాల జిల్లా వాసి శాకపురం నరేష్, ఆమె ఒకరినొకరు ప్రేమించుకున్నారు. ఇంట్లో చెబితే ఒప్పుకుంటారో? లేదో? అన్న భయంతో తొమ్మిది నెలల కింద భీంపూర్ పోలీస్‌స్టేషన్‌లో ప్రేమ పెండ్లి చేసుకున్నారు. ఈ పెండ్లికి చిట్యాల్ గ్రామానికి చెందిన బెస్త సామాజిక తరగతి పెద్దలు అభ్యంతరం తెలిపారు. పంచాయితీ పెట్టించారు. దుబాయ్‌లో ఉంటున్న సత్తన్న తాను తిరిగొచ్చిన తర్వాత పెండ్లి జరిపిస్తాని కుల పెద్దలకు చెప్పినప్పటికీ వినిపించుకోలేదు. ఆ కుటుంబాన్ని కులం నుంచి బహిష్కరించారు. వారితో మాట్లాడినందుకు అదే గ్రామానికి చెందిన మహేందర్, తోకల రాజన్న కుటుంబాలను సైతం వెలేశారు. గ్రామంలో జరిగే కుల దేవతల కార్యక్రమాలకు రాకుండా బహిష్కరిస్తున్నారు. వారితో మాట్లాడిన వ్యక్తులకు రూ.500 జరిమానా విధించారు. దీంతో దిక్కుతోచని బాధిత కుటుంబాలు కులస్తులను సంప్రదించగా రూ.50 వేలు చెల్లించి, మళ్లీ పెద్దల సమక్షంలో పెండ్లి జరిపిస్తే కులంలోకి తీసుకుంటామని తేల్చిచెప్పారు. ఎంత బతిమాలినా వినకపోవడంతో మూడు కుటుంబాలు కడెం పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం ఫిర్యాదు చేశాయి. తమకు న్యాయం చేయాలని వారు పోలీసులను వేడుకున్నారు.

మందకృష్ణకు బెయిల్ మంజూరు

(మొదటిపేజీ తరువాయి)

తీసుకున్నారు. కాగా, తమకు బెయిల్ మంజూరు చేయాలంటూ మందకృష్ణ, ఆయన అనుచరులు సికింద్రాబాద్ కోర్టులో పిటీషన్ వేయగా.. మందకృష్ణ బెయిల్ పిటీషన్‌ను ధర్మాసనం తిరస్కరించింది. ఆయన అనుచరులకు మాత్రం బెయిల్ మంజూరు చేసింది. తాజాగా మందకృష్ణ మళ్లీ బెయిల్ పిటీషన్ వేయడంతో విచారించిన కోర్టు.. షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసింది. దీంతో జనవరి 2వ తేదీ నుంచి జైల్లో ఉన్న మందకృష్ణకు బెయిల్‌పై బయటకు రానున్నారు.

ప్రమాదంలో ప్రపంచీకరణ..

(మొదటిపేజీ తరువాయి)

ప్రధాన సవాళ్లను ఎదుర్కొంటోందని అన్నారు. ప్రపంచీకరణ వ్యతిరేక విధానాలు నుంచి మొదలు కొని టెక్నాలజీలో వేగంగా వస్తున్న మార్పులు, పర్యవరణ సమస్యలు ప్రపంచానికి ప్రమాదకరంగా మారుతున్నాయని అన్నారు. ఇటీవలి కాలంలో కొన్ని దేశాలు ప్రపంచీకరణ స్ఫూర్తికి విఘాతం కలిగించేలా రక్షణాత్మక విధానాలను పాటిస్తుండడాన్ని ఆయన దావోస్ వేదికపై ఆక్షేపించారు. ఇటీవల రక్షణాత్మక దోరణులను అంతకంతకు పెంచుకొంటూ పోతున్న అమెరికా, బ్రిటన్‌ల పేర్లను ప్రస్తావించకుండా మోడీ ఈ వ్యాఖ్యలు చేశారు. రక్షణాత్మక విధానాలు ఉగ్రవాదం కంటే కూడా ప్రమాదకరమైనవని అన్నారు. ఇలాంటి విధానాల వల్ల ప్రపంచీకరణను నివారించడమే కాదని.. దాని సహజ ప్రవాహన్ని పూర్తిగా అడ్డుకోవమేనని అభిప్రాయపడ్డారు. ప్రపంచీకరణ వల్ల ఎదురవుతున్న ప్రతికూల పరిణామాల కారణంగా కొన్ని దేశాలు తాము ఒంటరిగా ఉంటూనే అభివృద్ధి సాధిద్దామనుకొం టున్నాయని.. అయితే ఇది సమస్యకు పరిష్కారం కాదని మోడీ అన్నారు. మార్పును అర్థం చేసుకొని సమయానుకూలంగా చురుకైన, సౌకర్యవంతమైన విధానాలను రూపొందించుకొంటూ ముందుకు సాగడమే సరైన పరిష్కారమని ఆయన పాశ్చాత్య దేశాలకు పరోక్షంగా సూచించారు.

సాంకేతిక మార్పులతో సవాళ్లు..

ప్రపంచ వ్యాప్తంగా సాంకేతికంగా వస్తున్న మార్పులు ఇటు కొత్తకొత్త అవకాశాలతో సరికొత్త నష్టాన్ని అందిస్తున్నట్టుగా మోడీ పేర్కొన్నారు. ప్రస్తుత కాలంలో టెక్నాలజీ మన జీవన గమనాన్ని, పనితీరును, సంభాషణా విధానంతో పాటు ప్రతీ అంశంపైనా ప్రభావం చూపుతోందని అన్నారు. దీనికితో పాటు అంతర్జాతీయ రాజకీయాలు, ఆర్థిక వ్యవస్థలపైనా టెక్నాలజీ పరిణామాలు తీవ్ర ప్రభావాన్ని చూపుతన్నట్టుగా యాన పేర్కొన్నారు. వర్ధమాన ప్రపంచంలో సమాచారం ఒక పెద్ద ఆస్తిగా పరిణమించిదని ఆయన అన్నారు. అయితే ఇది పెద్దమొత్తంలో అవకాశాలను కల్పించడంతో పాటు దాని పెను సవాళ్లను కూడా విసురుతోందని ఆయన అన్నారు.

ప్రజాస్వామ్యంతోనే పటిష్టత..

భిన్నమతాలు, సంస్కృతులు, భాషలు కలిగిన భారతదేశంలో ప్రజాస్వామ్యం అందరినీ ఏకతాటిపై నిలుపుతోందని, దీనికి తామెంతగానో గర్వపడుతున్నామనిప్రధాని నరేంద్ర మోడీ అన్నారు. నాటికి నేటికి భారత ఆర్థిక వ్యవస్థలో అనేక మార్పులు వచ్చాయని తెలిపారు. ప్రపంచ దేశాలు అభివృద్ధి దిశలో పయనించేలా ఈ సదస్సు దోహదపడుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. సమ్మిళిత అభివృద్ధి అనేది 120 కోట్ల మంది భారతీయుల ఆశయమన్నారు. ప్రధానితోపాటు కేంద్ర మంత్రులు అరుణ్ జైట్లీ, సురేశ్ ప్రభు, పీయూష్ గోయల్, ధర్మేంద్ర ప్రధాన్ తదితరులు దావోస్ సదస్సులో పాల్గొన్నారు. తమకు ఎదురవుతున్న అతి పెద్ద సవాళ్లలో తీవ్రవాదం ముఖ్యమైనదని, భారతీయులు ప్రకృతి ప్రేమికులని తెలియజేశారు. పునరుత్పాదక శక్తి వనరులపై భారత్ దృష్టిసారించిందన్నారు.

పర్యావరణాన్ని కాపాడుకుందాం...

పర్యావరణాన్ని పరిరక్షించుకోవటం ప్రపంచం ముందున్న అతిపెద్ద సవాల్ అన్నారు. చిన్న చిన్న దీవులు కనుమరుగవుతున్నాయని, మంచు కొండలు కరిగిపోతున్నాయని, ప్రతీ రోజూ అనూహ్య వాతావరణ మార్పులు చోటుచేసుకుంటున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. కార్బన్ ఉద్గారాల్ని తగ్గించటంపై అందరూ చర్చిస్తున్నారని, సాంకేతిక పరిజ్ఞానంతో దీనిని సాధించాలన్నారు.

అందరికీ అభివృద్ధి ఫలాలే లక్ష్యం..

మానవ శక్తిపై తనకు అపార నమ్మకముందని, సైబర్ సెక్యూరిటీ, అణు భద్రతలపై ప్రపంచం దృష్టి సారించాలన్నారు. 2022 నాటికి 170 గిగావాట్ల పునరుత్పాదక విద్యుత్ సామర్థ్యాన్ని సాధించాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నామన్నారు. ఉగ్రవాదం ప్రపంచానికి అతిపెద్ద సవాల్ అని హెచ్చరించారు. ఉగ్రవాదం విషయంలో ద్వంద్వ వైఖరి సరైందని కాదని అన్నారు. అన్ని దేశాలూ ఉగ్రవాద బెడదను ఎదుర్కొంటున్నాయని తెలిపారు. ద్యావంతులైన యువకులు సైతం తీవ్రమైన భావజాలంతో ఉగ్రవాదానికి ప్రభావితమవుతున్నారని ప్రధాని ఆందోళన వ్యక్తంచేశారు. మూడేళ్ల క్రితం అధికారంలోకి వచ్చిన భాజపా అనేక సంస్కరణలు చేపట్టిందని మోడీ వివరించారు. వ్యాపార అనుకూల ర్యాంకింగ్‌లో భారత్ స్థానం ఇటీవల గణనీయంగా మెరుగుపడిందని తెలిపారు. ఏ ఒక్క వర్గానికో కాకుండా ప్రతి ఒక్కరికీ అభివృద్ధి ఫలాలను అందించాలనేది తమ నినాదమని చెప్పారు. ప్రపంచ ఆర్థిక ప్రగతిలో మరింత క్రియాశీలక పాత్ర పోషించేందుకు భారత్ సిద్ధంగా ఉందన్నారు. తాము అమలు చేస్తున్న వివిధ సంస్కరణలు దావోస్ వేదికగా ప్రపంచానికి తెలియజేశారు.

భారత ఆర్థిక వ్యవస్థలో అనేక మార్పులొచ్చాయి..

1997లో భారత జీడీపీ 400 బిలియన్ డాలర్లు మాత్రమే ఉండేదని, ప్రస్తుతం అది ఆరు రెట్లకు పైగా పెరిగిందన్నారు. నాటికి నేటికి భారత ఆర్థిక వ్యవస్థలో అనేక మార్పులు వచ్చాయని తెలిపారు. ప్రపంచ దేశాలు అభివృద్ధి దిశలో పయనించేలా ఈ సదస్సు దోహదపడుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. పరస్పర ఆధారిత సమాజ అభివృద్ధిలో ఆర్థిక వేదిక సదస్సు చుక్కానీలా వ్యవహరిస్తోందన్నారు. సాంకేతికపరంగా ఇంటర్నెట్, బిగ్‌డేటాలతో ప్రపంచమంతా అనుసంధానమవు తుండగా.. సైబర్ పరిజ్ఞానం చెడు పనులకు వినియోగించకుండా నిరోధించడమే అసలైన సవాల్‌గా మారిందన్నారు. భారత్ ఎప్పుడూ శాంతినే కోరుకుంటుందని మోడీ పునరుద్ఘాటించారు. మన మాట, పని, అన్ని విషయాలను సాంకేతికతే ప్రభావితం చేస్తోందని మోడీ అన్నారు.

'స్వచ్ఛ' కార్యక్రమాల్లో హిజ్రాలు

నవతెలంగాణ–సిటీబ్యూరో

స్వచ్ఛ హైదరాబాద్ కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి జీహెచ్ఎంసీ వినూత్న ప్రయోగాలు చేస్తున్నది. తడి, పొడి చెత్తలను వేరు చేసే అంశంపై అవగాహన కల్పించడానికి గత ఏడాది 'విడిపోయిన కుటుంబాలను కలుపుదాం–చెత్తను విడదీద్దాం' కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఈ ఏడాది హిజ్రాలను సైతం భాగస్వామ్యం చేయాలని నిర్ణయించినట్టు తెలిసింది. స్వచ్ఛ కార్యక్రమాల అమలుకు ప్రచారకర్తలుగా ఉపయోగించుకోవాలని నిర్ణయించింది. ఈ సెల్‌లో జరిమానా అధికారులుగా హిజ్రాలను (చలాన్ వేసేందుకు) నియమించాలని నిర్ణయించినట్టు విశ్వసనీయ వర్గాల సమాచారం. గ్రేటర్ పరిధిలో రోడ్లపైనా, నాలాల్లోనూ చెత్తచెదారం వేసినా, రోడ్ల పక్కన మూత్రవిసర్జన చేసినా, అక్రమ నిర్మాణాలు, భవనాలకు సంబంధించిన వ్యర్థాలను ఎక్కడిపడితే అక్కడ వేసినా ఫైన్ ఆఫీసర్లు జరిమానా వేయనున్నారు. ఈ పెనాల్టీ నగదు రూపంలో కాకుండా ఈ–చలాన్ రూపంలో విధించనున్నారు.

స్వచ్ఛ సర్వేక్షన్‌లో

ఫైన్ ఆఫీసర్లుగా నియమించనున్న హిజ్రాలను ముందుగా స్వచ్ఛ సర్వేక్షన్‌లో ప్రచారకర్తలుగా నియమించనున్నారు. ఫిబ్రవరిలో స్వచ్ఛ సర్వేక్షన్‌లో కేంద్ర బృంద అధికారులు తనిఖీలు చేయనున్నారు. అనంతరం ర్యాంకులు ప్రకటిస్తారు. స్వచ్ఛ సర్వేక్షన్‌లో అగ్రస్థానంలో నిలవడానికి జీహెచ్ఎంసీ విశ్వప్రయత్నాలు చేస్తోంది. అందులో భాగంగా హిజ్రాలను ఉపయోగించుకుంటే ప్రత్యేక ఆకర్షణగా నిలవనుంది.

తమను ఆదరించండి..
మేయర్‌ను కలిసిన హిజ్రాలు

స్వచ్ఛ కార్యక్రమాల్లో తమను భాగస్వాములను చేసి ఆదరించాలని హిజ్రాలు ఈనెల 18న మేయర్ బొంతు రామ్మోహన్‌ను కలిశారు. స్వచ్ఛ హైదరాబాద్ కార్యక్రమంలో తమను భాగస్వామ్యం చేయాలని కోరారు. తమపై సమాజంలో హేయభావం ఉందని, వెలిసినట్టు చూస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తమకు ఒక్క అవకాశం ఇస్తే స్వచ్ఛ హైదరాబాద్ కార్యక్రమంలో పనిచేస్తామని అన్నారు. దీనికి మేయర్ బొంతు రామ్మోహన్ సానుకూలంగా స్పందించారు. హిజ్రాలను భాగస్వామ్యం చేసే అంశంపై చర్చిస్తామని మేయర్ తెలిపారు. దీనిపై మేయర్‌ను ఫోన్ ద్వారా సంప్రదించగా, 'అవును కలిశారు. వికలాంగులు, మహిళలు, సెలబ్రెటీలకు అవకాశమిస్తున్నప్పుడు మాకు ఎందుకు అవకాశమివ్వరని హిజ్రాలు అడిగారు. మేము ఇప్పటికే సమాజంలో వివక్షకు గురవుతున్నట్టు ఆవేదన వ్యక్తం చేశారు. అయితే, హిజ్రాల వినతిపై చర్చించి నిర్ణయం తీసుకుంటాం. వారిని ఎక్కడ ఉపయోగించుకోవాలనే దానిపై నిర్ణయం తీసుకోవలేదు. నిర్ణయం తీసుకున్నాక ప్రకటిస్తాం' అని చెప్పారు.

అందం ఖరీదు @5వేల కోట్లు

(జై)

పెండ్లప్పుడో లేదా ఇంట్లో శుభాకార్యం జరిగినప్పుడో అలంకరణపై దృష్టి పెట్టే పురుషపుంగవులు.. ప్రస్తుతం, అందం విషయంలో తమ పంథాను మార్చుకుంటున్నారని ప్రముఖ గ్లోబల్ ఇన్ఫర్మేషన్ మెజర్మెంట్ సంస్థ 'నీల్సన్' తాజా సర్వేలో వెల్లడించింది. ఇక, అధ్యయనం ప్రకారం.. దేశవ్యాప్తంగా ఉన్న పురుషులు తమ ముఖవర్చస్సు, వేషధారణలపై ముందటితో పోలిస్తే ఎక్కువ శ్రద్ధ తీసుకుంటున్నారని తేలింది. అందం కోసం ప్రత్యేక సమయాన్ని కేటాయించడమే గాకుండా, డియోడ్రెంట్స్, పర్ఫ్యూమ్స్, ఫేస్ క్రీమ్స్, హెయిర్ స్టైలింగ్ జెల్స్, షాంపూలు, ఫేస్ వాష్ లాంటి వివిధ రకాల సౌందర్య సాధనాల కోసం ఏటా ఏకంగా ఐదువేల కోట్ల రూపాయలను ఖర్చు చేస్తున్నారని సర్వే పేర్కొంది. కాగా, అందం కోసం అబ్బాయిలు పడుతోన్న ఈ అవస్థలు అమ్మాయిలను ఆకర్షించడానికోసమే అనుకుంటే పొరపాటే! ఎందుకంటే, సర్వేలో పాల్గొన్న 80శాతానికి పైగా అబ్బాయిలు.. తాము హుందాగా, అందంగా కనిపించాలనుకోవడానికి రెండు కారణాలున్నాయని.. అందం, వస్త్రదారణ తమలో ఆత్మవిశ్వాసాన్ని సడలకుండా ఉంచుతోందన్న భావన ఒక కారణం కాగా, ప్రస్తుత పోటీతత్వ మార్కెట్ లో ఇతర పురుషుల కంటే భిన్నంగా ఉంటూ వృత్తిపరమైన వ ృద్ధిని సాధించడానికి ఫిజికల్ అప్పీయరెన్స్ ప్రముఖ పాత్ర పోషిస్తున్నదని.. అందుకే వేషధారణ పట్ల శ్రద్ధ కనబరుస్తున్నామని చెబుతుండటం విశేషం. కాగా సంవత్సరానికి 5000కోట్లు వీటికే ఖర్చు పెడుతున్నారు.

వాళ్లకు కాసులు కురిపిస్తున్నాయి

దశాబ్దకాలం కిందట.. అబ్బాయిలు అందంగా తయారవ్వాలంటే అమ్మాయిల ఫెయిర్ నెస్ క్రీములే దిక్కయ్యేవి. ఐతే, మారుతున్న కాలానికి అనుగుణంగా మార్కెట్ ట్రెండ్స్ ను గమనించిన ఇమామి, హిందూస్తాన్ యూనీలీవర్, ఎల్ఓరియల్, నివేవా, మారికో వంటి సౌందర్య సాధన కంపెనీలు అబ్బాయిల కోసం ప్రత్యేకంగా ఫెయిర్ నెస్ క్రీమ్స్, డియోడ్రెంట్స్, పర్ఫ్యూమ్స్, హెయిర్ జెల్స్, షాంపూలు, ఫేస్ వాష్ లను తీసుకొచ్చి లాభాలు గడిస్తున్నాయి. ఉదాహరణకు.. 'సెట్ వెట్'తో అబ్బాయిల హెయిర్ స్టైల్ కి కొత్త అర్థం చెప్పిన ముంబయి కి చెందిన మారికో సంస్థ 'బియర్డో' పేరుతో తీసుకొచ్చిన ప్రొడక్ట్ అబ్బాయిల గడ్డాలకు కొత్త సాఫ్ట్ మెరుగులను, ఆకర్షణీయమైన లుక్ ని ఇవ్వడంలో విజయం సాధించి ఏకంగా 45శాతం మార్కెట్ నే కైవసం చేసుకుంది. ఇక, కోల్ కతా కేంద్రంగా నడుస్తోన్న ఇమామీ కంపెనీ అబ్బాయిల ఆన్ లైన్ బ్యూటీ ప్రొడక్ట్స్ లో 30శాతం వాటాతో దూసుకుపోతుండటం గమనార్హం. ఐతే, 2035లోపు భారతదేశ వస్త్రధారణ, సౌందర్య మార్కెట్ 2,27,500కోట్లకు చేరుకోబోతున్నదని అసోచాం సర్వే ఇదివరకే పేర్కొనడం విదితమే!

అబ్బాయిల అందం - ఆసక్తికర అంశాలు

- మిగతా వాటితో పోలిస్తే, అబ్బాయిలు ఎక్కువగా ఫేస్ వాష్ లను కొనడానికే ప్రాధాన్యతనిస్తున్నారట! గత ఏడేండ్ల కాలంలో అబ్బాయిల ఫేస్ వాష్ ప్రొడక్ట్ ల వినియోగం ఏకంగా 60రెట్లు పెరగడమే దీనికి నిదర్శనం.
- ఐదేండ్లలో అబ్బాయిల సౌందర్యసాధనాల మార్కెట్ 42శాతానికి పైగా వృద్ధి చెందిందని అసోచాం అధ్యయనం పేర్కొంది. ఇది అమ్మాయిల సౌందర్య మార్కెట్ వ ద్ధితో పోలిస్తే చాలా ఎక్కువ!
- దాదాపు అన్ని పురుషుల సౌందర్యసాధనాల స్టార్టప్ కంపెనీలు 2017లో లాభాలు ఆర్జించడం విశేషం.

ప్రొడక్ట్ రకం (అబ్బాయిలకోసం)	పెరుగుదల
ఫేస్ వాష్	60 రెట్లు
డియోడ్రెంట్స్	5 రెట్లు
ఫేస్ క్రీమ్	2.5 రెట్లు
పర్ఫ్యూమ్	2.5 రెట్లు
హెయిర్ స్టైలింగ్	1.5 రెట్లు

ఆధారం: నీల్సన్ - డిసెంబర్2017 సర్వే

సెన్సెక్స్ ▲342	నిఫ్టీ ▲118	డాలరుకు రూపాయి విలువ	బంగారం(10.గ్రా)	వెండి (కేజీ)
36,139	11,083	63.78	రూ. 30,866	రూ. 42,000

కోడిగుడ్లు


హైదరాబాద్	368	విజయవాడ	374
ఒక్కగుడ్డుకు	4.30	చెన్నై	397
వరంగల్	370	ముంబయి	410

భారత్‌లో మౌలిక వసతుల కొరత : జైట్లీ



న్యూఢిల్లీ: భారత్‌లో పెట్టుబడులు పెట్టాల్సిందిగా ఆగ్నేయాసియా (ఆసియాన్) దేశాలను ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ ఆహ్వానించారు. భారత్ వాణిజ్య, పెట్టుబడుల విషయంలో అంతర్జాతీయంగా సమైఖ్యమవుతున్న తరుణంలో భారత్‌లోని మౌలిక వసతులు, సేవల రంగాలో పెట్టుబడులు పెట్టాల్సిందిగా ఆయన ఆసియాన్ దేశాలకు పిలుపునిచ్చారు. ఆసియాన్-ఇండియా బిజినెస్ ఇన్వెస్ట్‌మెంట్ మీట్‌లో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. గడిచిన 25 ఏండ్లలో భారత వృద్ధి రేటు ఊపందుకుందని అన్నారు. రానున్న రెండు, మూడు దశాబ్దాల కాలంలో దేశ వృద్ధిని పెట్టుబడిదారులు దృష్టిలో ఉంచుకొని ముందడుగు వేయాలని ఆయన అన్నారు. భారత్‌లో మౌలిక వసతుల రంగంలో కొరత ఉందని ఆయన అన్నారు. దేశీయ ఉత్పత్తి పెరగాలని తాము యోచిస్తున్నట్టుగా ఆయన తెలిపారు. సేవల రంగంలో మెరుగైన అవకాశాలను కల్పిస్తున్నట్టుగా ఆయన వివరించారు. రానున్న రెండు మూడు దశాబ్దాల కాలంలో ఆసియాన్ దేశాల మధ్య మెరుగైన సంబంధాలు కొనసాగగలవని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

శుభం హౌసింగ్‌లో ప్రేమ్‌జీ పెట్టుబడులు



ముంబయి: విప్రో సంస్థ అధినేత ప్రేమ్‌జీ కుటుంబానికి సంబంధించి పెట్టుబడుల సంస్థ ప్రేమ్‌జీ ఇన్వెస్ట్‌మెంట్ శుభం హౌసింగ్ డెవలప్‌మెంట్ సంస్థలో రూ.305 కోట్ల పెట్టుబడులు పెట్టింది. ప్రాథమిక, ద్వితీయ మార్కెట్లలో జరిపిన డీల్స్ ద్వారా హౌసింగ్ సంస్థలో ప్రేమ్‌జీ ఇన్వెస్ట్‌మెంట్ పెట్టుబడులు పెట్టినట్టుగా ఈ సంస్థతో సంబంధం ఉన్న వర్గాలు తెలిపాయి. తక్కువ ధరలకే గృహాలను అందిచే సంస్థల్లో సంపన్నులు పెట్టుబడులు పెడుతుండడానికి ఈ పరిణామం ప్రతీక అని మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి.

రికార్డు స్థాయికి పెట్రోల్ ధరల మంట



న్యూఢిల్లీ: అంతర్జాతీయంగా ముడి చమురు ధరలు తగ్గుతున్నప్పటికీ భారత్‌లో పెట్రోల్ ధరలు అంతకంతకు పెరిగిపోతున్నాయి. మంగళవారం పెట్రోల్ ధరలు రికార్డు స్థాయిలో నమోదయ్యాయి. ఈక్రమంలో లీటర్ పెట్రోల్ ధర ఢిల్లీలో రూ.72.38గా నమోదైనట్టు ప్రభుత్వ రంగ అయిల్ కంపెనీలు వెల్లడించాయి. డీజిల్ సైతం రూ.67.30కి తాకింది. ముంబయిలో ఏకంగా అన్ని పన్నులతో కలిపి రూ.80 మార్క్‌కు చేరువైంది. 2014లో మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం తొలిసారి పెట్రో ధరలు ఈ స్థాయిని తాకడం ఇదే ప్రథమం. అంతర్జాతీయంగా చమురు ధరల ర్యాలీ నేపథ్యంలో.. 2018-19 బడ్జెట్‌లో వీటిపై ఉన్న ఎక్సైజ్ సుంకాన్ని తగ్గించాలని ఆర్థిక మంత్రిత్వ శాఖను చమురు మంత్రిత్వశాఖ కోరింది. ప్రస్తుతం పెట్రోల్‌పై రూ.19.48, డీజిల్‌పై రూ.15.33 చొప్పున కేంద్రం ఎక్సైజ్ సుంకాన్ని వడ్డిస్తోంది. ఇదిలా ఉంటే మోడీ సర్కారు అధికారంలోకి వచ్చాక 2014 నవంబర్ నుంచి 2016 జనవరి మధ్య తొమ్మిది సార్లు ఎక్సైజ్ సుంకాన్ని పెంచింది. ఇదే సమయంలో అంతర్జాతీయంగా ముడిచమురు ధరలు తక్కువగా ఉన్నప్పటికీ.. ప్రభుత్వం ఆదాయం పెంచుకోవడమే లక్ష్యంగా చేసుకున్నట్టు కనిపిస్తుంది. అయితే గతేడాది అక్టోబర్‌లో ఒక్కసారి మాత్రమే లీటరుకు రూ.2 చొప్పున ఎక్సైజ్ సుంకాన్ని తగ్గించింది.

పాశ్చాత్య దేశాల ధోరణి మారాలి



దావోస్: అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థల సాయం లేకుండా తాము ముందుకెళ్లలేమన్న విషయాన్ని పాశ్చాత్య దేశాలు గుర్తించాలని భారత రిజర్వు బ్యాంక్ మాజీ గవర్నర్ రఘురాం రాజన్ అన్నారు. ప్రపంచ ఆర్థిక సదస్సు వార్షిక సమావేశానికి హాజరైన రాజన్ సదస్సులో మాట్లాడుతూ పాశ్చాత్య దేశాల్లో జనాభా పెరుగుతోందన్న విషయాన్ని ఆయా దేశాలు గుర్తించాలన్నారు. వారి ఉత్పత్తులకు అభివద్ధి చెందుతున్న దేశాల నుంచే డిమాండ్ ఎక్కువగా ఉంటుందని గమనించాలన్నారు. అభివృద్ధి చెందుతున్న దేశాల అండ లేకుండా పాశ్చాత్య దేశాలు ఎంతోకాలం మనుగడ సాధించలేవు అని ఆయన అన్నారు. ఆ విషయాన్ని ఆయా దేశాలు గుర్తుంచుకోవాలని సూచించారు. ఆ దేశాలు సాధించే ప్రయోజనాలను కూడా అభివృద్ధి చెందుతున్న దేశాలతో పంచుకొంటే మేలని రాజన్ సూచించారు. పాశ్చాత్య దేశాల దక్పథం వీలైనంత త్వరగా మారాలని వివరించారు. లేదంటే ఈ ముక్కలైన ప్రపంచంలో ఏర్పడే సమస్యలను ఎవరూ పరిష్కరించలేరు అని రాజన్ అన్నారు. ఆదాయ అసమానతల వల్ల ఏర్పడే సమస్యలను పరిష్కరించడానికి సింగపూర్ లాంటి దేశాలు కొన్ని చర్యలు చేపడుతున్నాయని రాజన్ తెలిపారు. మధ్య తరగతి, దిగువ మధ్య తరగతి కలిసి జీవించేలా హౌసింగ్ ప్రాజెక్టులు తీసుకొస్తున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా డ్రైవర్ రహిత కార్ల సాంకేతికతపై రాజన్ ప్రస్తావించారు. టెక్నాలజీ పరంగా అవి మంచివే అయినప్పటికీ.. డ్రైవర్ రహిత కార్లు ప్రపంచవ్యాప్తంగా అందుబాటులోకి వస్తే.. కొంతమంది ఉపాధి కోల్పోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు.

భారత్ సంస్కరణలన్ని కొనసాగించాలి

- ఆర్థికంలో మహిళా ప్రాధాన్యత పెరగాలి : ఐఎంఎఫ్ అధినేత్రి క్రిస్టిన్ లగార్డ్



దావోస్: భారత్ ఆర్థిక సేవల రంగంలో సంస్కరణల పర్వాన్ని కొనసాగించాలని అంతర్జాతీయ ద్రవ్యనిధి అధినేత్రి క్రిస్టిన్ లగార్డ్ అభిప్రాయపడ్డారు. దీనికి తోడు భారత్ తన ఆర్థిక వ్యవస్థలో మహిళలకు తగిన నిజమైన ప్రాధాన్యతను కల్పించడంపై దృష్టి సారించాలని ఆమె సూచించారు. ప్రపంచ ఆర్థిక సదస్సులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె ప్రసంగించారు. భారత్ తన శ్రామిక శక్తిలో మగవారికి సమానంగా మహిళలకు తగిన ప్రాతినిధ్యం కల్పించడం ద్వారా ఆ దేశ ఆర్థిక వ్యవస్థ భారీ స్థాయిలో 27% వృద్ధిని నమోదు చేసే అవకాశం ఉందని లగార్డ్ విశ్లేషించారు. గ్రామీణ భారతంలో మహిళలు అత్యధికంగా వివక్షను ఎదుర్కొంటుండడం పట్ల ఆమె ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సమస్య పరిష్కారానికి తక్షణ చర్యలు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉందని నొక్కి వ్యాఖ్యానించారు. ప్రపంచంలోనే వేగంగా అభివృద్ధి చెందుతున్న దేశాలల్లో భారత్ ఒకటని ఆమె వివరించారు. భారత్ ఈ ఏడాదికి 7.4 శాతం వృద్ధిని నమోదు చేయగలదని లగార్డ్ విశ్వాసాన్ని వ్యక్తం చేశారు. సంస్కరణల పర్వాన్ని భారత్ ఏవిధంగా ముందుకు తీసుకుపోతుందన్న అంశంపైనే ఆదేశ భవిష్యత్తు వృద్ధి అధారపడి ఉంటుందని వివరించారు. 2019లో భారత ఆర్థిక వ్యవస్థ 7.8 శాతం వృద్ధిని నమోదు చేసే అవకాశం ఉందని లగార్డ్ తెలిపారు.

దలాల్ స్ట్రీట్‌లో ధగధగలు

- ఐఎంఎఫ్ అంచనాలతో సానుకూలత
- 36,139 వేలకు చేరిన బీఎస్ఈ సెన్సెక్స్
- 11వేల మార్క్ దాటేసిన ఎన్ఎస్ఈ నిఫ్టీ
- లక్ష కోట్లు పెరిగిన మదుపరుల సంపద



ముంబయి : దేశీయ స్టాక్ మార్కెట్ల పరుగు జోరు కొనసాగుతోంది. వరుసగా ఐదో సెషన్‌లోనూ దలాల్ స్ట్రీట్‌లో ఉత్సాహం ఉరకలెత్తింది. భారత్ మెరుగైన ఆర్థిక వృద్ధిని నమోదు చేయొచ్చుంటూ అంతర్జాతీయ ద్రవ్య నిధి అంచనాలను వెల్లడిచండం, సానుకూల పరిణామాల నేపథ్యంలో ఏర్పడిన మదుపరుల కొనుగోళ్ల మద్దతుతో మార్కెట్ సూచీలు సరికొత్త రికార్డులను అందుకున్నాయి. బీఎస్ఈ సెన్సెక్స్ మరో 341.97 పాయింట్లు లేదా 0.96 శాతం పెరిగి 36,139.98కు చేరింది. ఎన్ఎస్ఈ సూచీ నిఫ్టీ 117.50 పాయింట్లు లేదా 1.07 శాతం రాణించి 11,083.70 వద్ద ముగిసింది. 35,868 వద్ద మొదలైన సెన్సెక్స్ ఇంట్రా ట్రేడింగ్‌లో 35,863 కనిష్ఠ స్థాయికి పడిపోయినప్పటికీ అనంతరం కొనుగోళ్ల మద్దతుతో ఏకంగా 36,170.83 గరిష్ఠ స్థాయిని తాకింది. దీంతో మంగళవారం ఒక్కరోజే మదుపరుల సంపద దాదాపు లక్ష కోట్ల మేర పెరిగింది. లోహ బ్యాంకింగ్ సూచీలు మెరుపులు మెరిపించాయి. 2018-19లో భారత వృద్ధి రేటు తిరిగి పుంజుకోనుందన్న అంతర్జాతీయ ద్రవ్య నిధి సంస్థ (ఐఎంఎఫ్) ప్రకటనతో మార్కెట్లపై విశ్వాసం పెరిగింది. ఈ నేపథ్యంలోనే 2017లో భారత వృద్ధి రేటు 6.7 శాతానికి పరిమితం కానున్నప్పటికీ, 2018లో 7.4 శాతం వృద్ధిని నమోదు చేసే అవకాశాలు ఉన్నాయని ఐఎంఎఫ్ తన వాల్డ్ ఎకనామిక్ అవుట్‌లుక్‌లో అంచనా వేసింది. ఈ పరిణామం భారత మార్కెట్లలో విశ్వాసాన్ని నింపింది. కన్స్యూమర్ డ్యూరెబుల్స్ రంగం మినహా అన్నీ రంగాలు లాభాల్లోనే ముగిశాయి. లోహ సూచీ ఏకంగా 4.29 శాతం, పీఎస్‌యూ 2.15 శాతం, ఆయిల్ అండ్ గ్యాస్ 1.93 శాతం, బ్యాంకింగ్ 1.63 శాతం చొప్పున రాణించి మార్కెట్లకు ప్రధాన మద్దతునిచ్చాయి. కాగా కన్స్యూమర్ డ్యూరెబుల్స్ 0.33 శాతం మేర పడిపోయింది. సెన్సెక్స్‌లో స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా 3.84 శాతం, టాటా స్టీల్ 3.72 శాతం, ఒఎన్‌జిసి 3.6 శాతం, ఐసిఐసిఐ బ్యాంకు 3.06 శాతం, కోల్ ఇండియా 3.04 శాతం చొప్పున అధిక లాభాలు సాధించిన వాటిలో టాప్‌లో ఉన్నాయి. విప్రో 1.78 శాతం, టాటా మోటార్స్ 0.83 శాతం, ఆసియన్ పెయింట్స్ 0.76 శాతం, హెచ్‌డిఎఫ్‌సి బ్యాంకు 0.64 శాతం, టీసీఎస్ 0.32 శాతం చొప్పున కుంగి అధికంగా నష్టపోయిన వాటిలో టాప్‌లో ఉన్నాయి.

జియో నుంచి అదరగొట్టే ఆఫర్లు

- వాడకందారులకు రోజుకు 50 శాతం డేటా అదనం



న్యూఢిల్లీ: రిలయన్స్ జియో వినియోగదారులకు శుభవార్త. దేశీయ టెలికాం రంగంలో చౌక ధరలకే సేవలనందించే విధానాన్ని మరింత ముమ్మరం చేస్తూ రిలయన్స్ జియో సంస్థ మంగళవారం రిపబ్లిక్‌డే ఆఫర్లను ప్రకటించింది. జనవరి 26 రిపబ్లిక్ డే పురస్కరించుకొని వివిధ టారీఫ్‌లపై ప్రస్తుతం రోజుకు 1జీబీ డేటాను వాడుకుంటున్న వినియోగదారులకు మరో 500 ఎంబీ డేటాను అదనంగా అందించాలని సంస్థ నిర్ణయించింది. దీనికి తోడు ప్రస్తుతం రూ.98 ప్యాక్ వ్యాలిడిటీని ప్రస్తుతం ఉన్న 14 రోజుల నుంచి 28 రోజులకు పెంచుతున్నట్టుగా సంస్థ ఒక ప్రకటనలో తెలిపింది. ఈ కొత్త ప్యాక్‌ను అందుకున్న వారికి అపరిమిత కాలింగ్‌ను 2జీబీ డేటాను 28 రోజుల పాటు అందించనున్నట్టు ప్రకటించింది. అంతేకాక వివిధ ప్లాన్లపై రోజుకు 1జీబీ డేటాను అందుకుంటున్న వారికి 1.5జీబీ డేటాను, 1.5జీబీ డేటా ప్యాక్స్‌పై 2జీబీ డేటాను ఆఫర్ చేయనున్నట్టు తెలిపింది. దీంతో రూ. 149, రూ.349, రూ.399, రూ.449 ప్యాక్‌లపై వరుసగా 42జీబీ, 105జీబీ, 126జీబీ, 136జీబీ డేటా.. 28 రోజులు, 70 రోజులు, 84 రోజులు, 91 రోజుల పాటు లభించనుంది. ఈ ప్యాక్‌లపై అంతకముందు రోజుకు 1జీబీ డేటాను మాత్రమే వాడుకొనే వెసులుబాటు ఉండేది.

ఆటలు

ఓటములపై తీవ్రంగా చర్చించాం : కోహ్లి



జోహనెస్‌బర్గ్ : ఫ్రీడం సిరీస్ కోల్పోవటంపై భారత శిబిరంలో తీవ్ర చర్చ జరిగిందని టీమ్ ఇండియా సారథి విరాట్ కోహ్లి మంగళవారం తెలిపాడు. నేటి నుంచే భారత్, దక్షిణాఫ్రికాల మధ్య ఆఖర టెస్టు ఆరంభం కానున్నది. ఈ నేపథ్యంలో కోహ్లి మీడియాతో మాట్లాడుతూ ' ప్రతి ఒక్కరితో ప్రత్యేకంగా మాట్లాడాం. పొరపాట్లు ఎక్కడ జరిగాయి, ఎందుకు జరిగాయి వంటి విషయాలపై కూలంకశంగా చర్చించాం. మైదానంలో పొరపాట్లకు తావివ్వకూడదని నిర్ణయించుకున్నాం. తొలి రెండు మ్యాచుల్లో సానుకూల అంశాలను తీసుకుని మెరుగ్గా ఆడతామని భావిస్తున్నాం. బౌలర్లు అదే విధంగా రాణించాలి. బ్యాట్స్‌మెన్ మెరుగవ్వాలి' అన్నాడు.

ఆసియా చాంపియన్‌షిప్ నుంచి వైదొలగుతా

- అనుమతికై బాయ్‌కు సైనా లేఖ



న్యూఢిల్లీ : వచ్చే నెల నుంచి ఆరంభం కానున్న ఆసియా టీమ్ చాంపియన్‌షిప్ నుంచి వైదొలగటానికి అనుమతి కోరతూ ఏస్ బ్యాడ్మింటన్ ప్లేయర్ సైనా నెహ్వాల్ బాయ్ (బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా)కు లేఖ రాసింది. ఆల్ ఇంగ్లాండ్ చాంపియన్‌షిప్ సన్నాహకాల్లో ఉన్న తాను ఆసియా టీమ్ చాంపియన్‌షిప్‌లో పాల్గొనలేనని లేఖలో పేర్కొన్నది. అయితే బాయ్ అధికారులు మాత్రం సైనాను ఆడటానికి ఒప్పించే పనిలో పడ్డారు. ప్రతిష్టాత్మక ఉబర్‌కప్‌కు అర్హత సాధించాలంటే ఆసియా టీమ్ చాంపియన్‌షిప్‌లో పాల్గొనక తప్పదు. బాయ్ కార్యదర్శి అనూప్ నారంగ్ మీడియాతో మాట్లాడుతూ ' థామస్ కప్, ఉబర్ కప్ టోర్నీలకు ఇది అర్హత టోర్నీ. ఇందులో ఆడకపోతే ప్రపంచ గ్రూప్‌కు అర్హత సాధించలేం. అంచేత సైనాకు లేఖ రాయనున్నాం. దేశ ప్రతిష్టకు సంబంధించిన టోర్నీ కావటంతో ఆమె ఒప్పుకుంటుందని ఆశిస్తున్నాం. గాయం నుంచి కోలుకుని ఆమె ఆల్ ఇంగ్లాండ్ కోసం సిద్ధపడుతోందని తెలుసు. శిక్షణా కార్యక్రమాల్లో స్వల్ప మార్పులు చేస్తే ఇటువంటి కీలక ఈవెంట్లలో పాల్గొనటం పెద్ద సమస్య కాబోదు.' అని తెలిపారు.

ఇండోనేసియా మాస్టర్స్‌కు కిదాంబి దూరం



జకర్తా : సూపర్ టైటిళ్ల వేటగాడు కిదాంబి శ్రీకాంత్ ఇండోనేషియా మాస్టర్స్ బరి నుంచి తప్పుకున్నాడు. గాయం కారణంగా ఈ నిర్ణయం తీసుకున్నట్టు ట్వీటర్ వేదికగా కిదాంబి వెల్లడించాడు. కిదాంబి లేకపోవటంతో పారుపల్లి కశ్యప్‌కు నేరుగా ప్రధాన టోర్నీలో ఆడే అవకాశం లభించింది. ఇక మంగళవారం జరిగిన అర్హత పోరుల్లో భారత షట్లర్లకు నిరాశ ఎదురైంది. అభిషేక్ యెలగర్ సహా శుభంకర్ డే, మహిళల సింగిల్స్‌లో శ్రీ కృష్ణ ప్రియలు తొలి క్వాలిఫైయింగ్ మ్యాచుల్లో ఓడి ఇంటిముఖం పట్టారు.


గాయంతో విలవిల్లాడుతున్న నడాల్

సంచనాలకు వేదికైన ఆస్ట్రేలియా ఓపెన్‌లో యువ ఆటగాళ్లు దిగ్గజాలకు దీటుగా పోటీనిస్తున్నారు. సీనియర్లు ఒక్కొక్కరుగా మెల్‌బోర్న్ వీడుతున్నారు. క్వార్టర్స్‌లో పిరుదుల గాయంతో స్పెయిన్ దిగ్గజం రఫేల్ నడాల్ రిటైర్డ్ హర్ట్‌గా వెనుదిరుగగా.. అన్‌సీడెడ్ ఆటగాళ్ల చేతిలో గ్రిగర్ దిమిత్రోవ్, ఎలీనా స్విటోలినాలు ఓటమి పాలయ్యారు. నడాల్ నిష్క్రమణతో మారిన్ సిలిచ్‌కు సెమీస్ ప్రవేశం సులభమైంది. మిక్స్‌డ్ డబుల్స్‌లో రోహన్ బోపన్న జోడీ క్వార్టర్స్‌లో కాలుమోపింది.

నడాల్ ఔట్

- సెమీస్‌లో మారిన్ సిలిచ్, కరోలినె వోజ్నియాకి
- దిమిత్రోవ్, స్విటోలినా నిష్క్రమణ

గాయంతో రిటైర్డ్ హర్ట్‌గా వెనుదిరిగిన ప్రపంచ నెంబర్ వన్

ఆస్ట్రేలియన్ ఓపెన్ 2018

నవతెలంగాణ-మెల్‌బోర్న్

నడాల్, ఫెడరర్‌ల మహా సంగ్రామాన్ని మరోసారి ఆస్ట్రేలియా ఓపెన్ ఫైనల్లో చూద్దామనుకున్న అభిమానులకు నిరాశ. గాయం నుంచి పూర్తిగా కోలుకోకుండానే మెల్‌బోర్న్ హర్డ్‌కోర్ట్‌లో అడుగుపెట్టిన నడాల్.. పిరుదుల కండర గాయంతో క్వార్టర్స్ పోరు నుంచి తప్పుకున్నాడు. మరో పక్క దిగ్గజాలకు అన్‌సీడెడ్ ఆటగాళ్లు షాకిస్తూనే ఉన్నారు. మంగళవారం జరిగిన క్వార్టర్స్ మ్యాచుల్లో బల్గేరియా అగ్రశ్రేణి ఆటగాడు గ్రిగర్ దిమిత్రోవ్, నాల్గో సీడ్ ఉక్రెయిన్ క్రీడాకారిణి ఎలీనా స్విటోలినాలు అన్‌సీడెడ్ ప్లేయర్ల చేతిలో పరాజయం పాలయ్యారు. ఆస్ట్రేలియా ఓపెన్‌లో భారత్ ఆశల భారం మోస్తోన్న ఏకైక ఆటగాడు రోహన్ బోపన్న. మిక్స్‌డ్ డబుల్స్‌లో బోపన్న జోడీ ప్రీ క్వార్టర్స్‌లో అలవోక విజయంతో క్వార్టర్స్ బెర్త్ ఖాయం చేసుకున్నది.

గాయంతో నడాల్ : స్పెయిన్ దిగ్గజం, టాప్ సీడ్ రఫెల్ నడాల్ కెరీర్‌లో సీజన్ తొలి గ్రాండ్‌స్లామ్ టోర్నీ నుంచి రిటైర్ట్ హర్ట్‌గా వెనుదిరిగాడు. మంగళవారం జరిగిన హోరాహోరీ క్వార్టర్స్‌లో ఆరో సీడ్ మారిన్ సిలిచ్ (క్రొయేషియా) నడాల్ నిష్క్రమణతో సెమీస్‌లో అడుగుపెట్టాడు. తొలి సెట్లోనే 6-3తో నెగ్గి నడాల్ శుభారంభం చేశాడు. అయితే రెండో సెట్‌ను 6-3తో గెలుపొందిన సిలిచ్ నుంచి మూడో సెట్లో నడాల్‌కు గట్టిపోటీ ఎదురైంది. ట్రైబ్రేకర్‌లో పైచేయి సాధించిన స్పెయిన్ బుల్ 7(7)-6(5)తో సెట్‌నెగ్గి ఆధిక్యంలోకి దూసుకెళ్లాడు. 2-6తో కోల్పోయిన నాల్గో సెట్లో నడాల్ గాయం బారిన పడ్డాడు. నిర్ణాయక సెట్‌లో 0-2తో వెనుకంజలో ఉన్న వేళ.. ఇక ఆడట తనవల్ల కాదని రిటైర్డ్ హర్ట్‌గా పోటీనుంచి వైదొలుగుతున్నట్టు ప్రకటించాడు. నడాల్ ఇప్పటివరకూ ఆడిన 250 గ్రాండ్‌స్లామ్ మ్యాచుల్లో రిటైర్డ్‌గా వెనుదిరగటం ఇది రెండోసారి. 2010లో ఆస్ట్రేలియా ఓపెన్‌లో సైతం క్వార్టర్స్‌లోనే నిష్క్రమించటం యాదృచ్చికం. కాగా 2010 టోర్నీ సెమీస్‌లో ముర్రే చేతిలో ఓడిన సిలిచ్ ఆస్ట్రేలియా ఓపెన్ సెమీస్ చేరటం ఇది రెండోసారి.

యువ ఆటగాళ్ల హవా: మొన్న సెర్బియా చిన్నోడు నొవాక్‌కు దక్షిణ కొరియా యువ కెరటం హ్యాన్ చంగ్ షాకిచ్చి సంచలనం రేకెత్తించిన సంఘటన మరువక ముందే.. మూడో సీడ్ గ్రిగర్ దిమిత్రోవ్, నాల్గో సీడ్ ఎలీనా స్విటోలినా అన్‌సీడెడ్ యువ ప్లేయర్ల చేతిలో ఓటమి చవి చూశారు. ఇంగ్లాండ్ కుర్రాడు కైల్ ఎడ్మండ్ 6-4, 3-6, 6-3, 6-4తో దిమిత్రోవ్‌పై గెలుపొందాడు. మహిళల సింగిల్స్‌లో నాల్గో సీడ్ ఎలీనా స్విటోలినాను బెల్జియం చిన్నది ఎలీస్ మీర్టెన్స్ 6-4, 6-0తో చిత్తు చేసింది. రెండో సీడ్ కరొలినె వోజ్నియాకి (డెన్మార్క్) 6-0, 6(3)-7(7), 6-2తో కార్లా సువరెజ్ నవారో (స్పెయిన్)పై గెల్చి సెమీస్‌లో అడుగుపెట్టింది. మిక్స్‌డ్ డబుల్స్‌లో భారత్‌కు చెందిన బోపన్న, టిమే బాబోస్ (హంగేరి) జతగా దూసుకుపోతున్నాడు. వానియా కింగ్ (అమెరికా), ఫ్రాంకో స్కూగోర్ (క్రొయేషియా) జోడీపై 6-4, 6-4తో వరుస సెట్లలో గెలుపొందిన బోపన్న జంట క్వార్టర్స్‌లో కాలుమోపింది. నేడు డిఫెండింగ్ చాంపియన్, స్విస్ దిగ్గజం రోజర్ ఫెడరర్.. తోమాస్ బెర్డిచ్ (చెక్ రిపబ్లిక్)తో క్వార్టర్స్‌లో తలపడనున్నాడు. మహిళల టాప్ సీడ్ సిమోనా హాలెప్ (రొమేనియా), ఆరో సీడ్ కరొలినా ప్లిస్కోవా (చెక్ రిపబ్లిక్)తో సెమీస్‌లో స్థానం కోసం అమీతుమీ తేల్చుకోనున్నది.


కరోలిన వోజ్నియాకి

Dwaraka

జరదేఖో



ఆ ఊరు... వేల ఏండ్ల చరిత్రను తన పొత్తిళ్ళల్లో దాచుకుంది
ఆ ఊరు... బౌద్ధ ప్రవచనాలకు తొలి వేదిక అయ్యింది
ఆ ఊరు... గౌతముడి తపోశ్వాసను గుండెల నిండా పొదుముకుంది
ఆ ఊరు... భారత ప్రభుత్వానికి రాజముద్రను అందించిన ఘనతను సొంతం చేసుకుంది
అదే సారనాథ్... ఉత్తర ప్రదేశ్ రాష్ట్రంలోని వారణాసి నుంచి పది కిలోమీటర్ల దూరంలో ఉంటుంది. 19వ శతాబ్దంలో బ్రిటీష్ వారు జరిపిన తవ్వకాల్లో సారనాథ్ బయటపడింది. నేను సారనాథ్ సందర్శన కోసం ముందుగా ప్రణాళిక వేసుకుని వెళ్ళలేదు. అధికారిక పనిలో భాగంగా వారణాసి వెళ్ళాను. ఓ రోజు షెడ్యూల్ ఖాళీగా ఉండటంతో దగ్గరలో పర్యాటక ప్రాంతాలు ఏమున్నాయా అని నెట్ లో సెర్చ్ చేస్తుంటే... సారనాథ్ అనే అద్భుత ప్రాంతానికి పక్కన ఉన్నాననే విషయం అర్ధం అయింది. అంతే సంభ్రమాశ్చ ర్యాలతో వెంటనే బయలు దేరాను. బుద్ధుడి జీవితంలోని నాలుగు కీలక ఘట్టాల్లో ఒక దానికి వేదిక ఈ ప్రాంతమే. మిగిలినవి కపిలవస్తు, బుద్ధగయ, కుశీనగరం. కపిలవస్తు బుద్ధుని జన్మస్థలం కాగా, బుద్ధగయలో బోధి వక్షం కింద జ్ఞానోదయం పొంది బుద్ధుడిగా మారగా, కుశీనగరం పరినిర్వాణం జరిగిన ప్రాంతం. మౌర్యుల కాలం నుంచి గుప్తుల కాలం వరకు ఎంతో వైభవాన్నిచవి చూసిన సారనాథ్‌నే ఉసీపట్నం, ఉసీనగరం, ఇస్పితానా, మగదవ అని కూడా పిలిచే వారు. ఉసీ నగరం అంటే ప్రాకత భాషలో రుషులు జన్మించిన స్థలం అని అర్థం.

తొలిబౌద్ధ ప్రవచనానికి వేదిక



బౌద్ధ ప్రవచనాలకు తొలి వేదిక...


వాస్తవంగా ఇది జింకల వనం కావటంతో మగదవ అనే పేరు కూడా చలామణిలో ఉండేది. 2500 ఏండ్ల క్రితం తన ముప్ఫై ఐదవ ఏట సిద్ధార్థుడు ప్రస్తుతం బీహార్ రాష్ట్రంలో ఉన్న గయలోని బోధి వక్షం కింద తీవ్ర మైన తపోదీక్ష చేశాడు. జ్ఞానోదయం అయిన ఏడు వారాల తర్వాత తాను సంపాదించిన జ్ఞానాన్ని నలుగురికి చెప్పాలని అనుకున్నాడు. బుద్ధుడు సంపాదించిన జ్ఞానంతో తనతో పాటు తపస్సు చేసి వెళ్ళిపోయిన ఐదుగురు సహచరులే సరైన వ్యక్తులని గ్రహించాడు. అందుకోసం వారిని వెతుక్కుంటూ గయ నుంచి వారణాసికి బయలు దేరాడు. దారిలో గంగానదిని దాటవలసి వచ్చినప్పుడు పడవ లేకపోవటంతో గాలిలో నడుచుకుంటూ వెళ్ళాడని స్థానిక గాథలు చెబుతున్నాయి. వారణాసికి సమీపంలో ఇప్పుడు సారనాథ్‌గా పిలుస్తున్న ప్రాంతంలో ఆ ఐదురుగు సహచరుల బందం కనిపించింది. వారికి తొలి బోధన చేశాడు బుద్ధుడు. అలా ప్రపంచంలోనే తొలి బౌద్ధ ప్రవచనానికి సారనాథ్ నేల వేదిక అయింది.



స్థానికులతో వ్యాసకర్త

తపోశ్వాసకు సాక్షిగా...

ఈ సందర్భమే ధర్మచక్ర పరివర్తనంగా పేరు గాంచింది. నాలుగు ఆర్య సత్యాల్నీ, దుఖం నుంచి విముక్తిని వ్వగల అష్టాంగ మార్గాన్నీ ప్రతిపాదించాడు. ఈ ఐదుగురు శిష్యుల తోనే బౌద్ధమతంలో తొలి సంఘం ఏర్పడింది. తొలి ప్రవచనం తర్వాత బుద్ధుడు ఇక్కడి మూలగంధ కుటీరంలో కొంత కాలం గడిపారంటారు. అప్పుడు సంఘం సభ్యుల సంఖ్య ఐదు నుంచి అరవైకి చేరింది. ఇప్పుడు శిధిలావస్థలో కనిపిస్తున్న ఈ కట్టడాలు అప్పట్లో బౌద్ధమతానికి కేంద్రంగా విరాజిల్లాయి. ఈ ఆరామాల్లో 1500 మంది బౌద్ధులు నివసించటానికి అన్ని రకాలసదుపాయాలుండేవి. ఇంతటి చారిత్రక ప్రాధాన్యత ఉన్న ఆ నేల పై తిరుగు తుంటే తెలియని ఉద్వేగం నాతో పాటే ప్రయాణించింది. దీనికి తోడు జపాన్, చైనా, శ్రీలంక, బర్మ, టిబెట్, థాయ్ లాండ్, కరియా, మయన్మార్, కంబోడియా వంటి బౌద్ధం పాటించే దేశాలు తమ తమ వాస్తుశైలుల్లో ఇక్కడ బౌద్ధ మందిరాలు, ఆరామాలు నిర్మించారు. అన్నీ బౌద్ధ దేవాలయాలే. కాని ఒక్కోటి ఒక్కోరకమైన శైలి. ఆయా దేశాల జెండాలు రెపరెపలాడుతూ ఉంటే సర్వ మానవాళి ఒకటే కదా అనిపించి అబ్బుర పడిపోయాను. ముందుగా సింహళులు నిర్మించిన బౌద్ధ దేవాలయానికి వెళ్లాను. ధర్మపాలుడు అనే శ్రీలంక బౌద్ధ భిక్షువు దీన్ని నిర్మించారు. ఆవరణలో పచ్చగా పరుచుకున్న బోధి వక్షం స్వాగతం పలుకుతున్నది. గయకు వెళ్లి గౌత ముడి తపోశ్వాసకు సాక్షిగా ఉన్న బోధి వక్షాన్ని చూడలేకపోయామనే లోటును తీర్చిన అనుభూతి కలిగింది.



బుద్ధస్థూపం

అత్యున్నత బుద్ధ ప్రతిమ...

ఎందుకంటే గయలోని బోధి వక్ష శాఖను సారనాథ్ స్థూపాన్ని నిర్మించిన చక్రవర్తి అశోకుడు తన కుమార్తె సంఘమిత్ర ద్వారా శ్రీలంక దేశానికి పంపి అక్కడ నాటించారు. కాండీలో అవినాశిగా ఆ చెట్టు వర్ధిల్లుతోంది. తర్వాతి కాలంలో ఈ చెట్టు కొమ్మను తెచ్చి ఈ దేవాలయంలో నాటారు. అంటే గయ బోధి వక్ష వారసత్వం ఈ చెట్టు కొనసాగిస్తున్నట్లే కదా. ధర్మచక్ర పరివర్తన ఘట్టం ప్రతిఫలించే విధంగా ఈ చెట్టు నీడన బుద్ధుడు, ఐదుగురు శిష్యులకు బోధిస్తున్న విగ్రహాలు ఏర్పాటు చేశారు. ఆ దశ్య రూపాన్ని చూడటం గొప్ప అనుభూతిని ఇచ్చింది. ఊహలు రెక్కలు విప్పుకుని చరిత్ర పుటల్లోకి ఎగిరి వెళ్లాయి. అక్కడి నుంచి థాయిలాండ్ బౌద్ధ మందిరానికి వెళ్లాను. అఫ్ఘనిస్తాన్‌లో తాలిబన్లు బామియన్ బౌద్ధ విగ్రహాన్ని ధ్వంసం చేసిన తర్వాత ఆ లోటును పూడ్చటం కోసం థాయ్ ప్రభుత్వం సారనాథ్‌లో భారీ విగ్రహాన్ని ప్రతిష్టించింది. సుమారు 80 అడుగుల ఈ విగ్రహమే మన దేశంలోని అత్యున్నత బుద్ధ ప్రతిమ. అక్కడి ప్రధాన స్థూపం వైపుకు అడుగులు వేశాను. చాలా వరకు అంతా శిథిలావస్థకు చేరి ఉంది. ఈ ప్రాంగణంలో ప్రధానంగా మూడు స్మారకాలు న్నాయి. ఒకటి అశోక చక్రవర్తి నిర్మించిన స్థంభ అవశేషాలు, ధర్మచక్ర స్థూపం, మూలగంధ కుటిగా చెప్పే బుద్ధుడి ప్రవచన వేదిక. అంతెత్తున ఉన్న ఆ స్థూపాన్ని చాలా సేపు చూస్తూ ఉండి పోయాను. ఆ గోడలను తాకితే తెలి యని అనుభూతి ఏదో నాలోకి ప్రవహించింది. ఆ గోడల పై బంగారు వర్ణంలో మెరుపులు ఆశ్చర్యానికి గురి చేశాయి.



బోధివృక్షం

పురావస్తు మ్యూజియం...

అక్కడి నుంచి ఆ పక్కనే ఉన్న పురావస్థు శాఖ మ్యూజియంలోకి వెళ్ళాను. ఇక్కడే మన రోమాలు నిక్కబొడుచుకునే, తల సగర్వంగా ఎత్తుకోవాలనిపించే నాలుగు సింహాల శిల్పం ఉన్న అశోక స్తంభం కనిపించింది. స్తంభం శిధిలావస్థలో ఉన్నా శిఖరాగ్రాన్ని మ్యూజియం లో భద్రపరిచారు. బానిస సంకెళ్లు తెంచుకున్న తర్వాత భారత ప్రభుత్వ జాతీయ ముద్ర కోసం ఈ నాలుగు సింహాల శిల్పాన్నే స్ఫూర్తిగా తీసుకుంది. సింహాల కింద పీఠం మధ్యలో ఒక చక్రం ఉంటుంది. ఈ చక్రాన్నే మన జాతీయ పతాకంలో పెట్టారు. వేల ఏళ్ల క్రితం ఓ శిల్పి చేతిలో నాలుగు సింహాల శిల్పం రూపు దిద్దుకున్నప్పుడు లేశ మాత్రంగా అయినా ఊహించి ఉంటారా... ఈ శిల్పం భారత ప్రభుత్వ జాతీయ చిహ్నంగా గొప్ప గౌరవాన్ని అందుకుం టుందని, కోట్లాది భారతీయులకు గర్వ కారణం అవుతుందని అన్న ఆలోచనలు నన్ను ముసురు కున్నాయి. ఇక్కడి వీధుల్లో, షాపుల్లో బుద్ధుడి విగ్రహాలతో పాటు నాలుగు సింహాల అశోక స్తంభం కూడా విరివిగా కనిపిస్తాయి. బేరమాడి కచ్చితంగా కొనుక్కోని తెచ్చుకోవాల్సిందే. అరుదైన జ్ఞాపకాలు కదా. ఈ చారిత్రక నగరికి మరో ప్రాధాన్యత కూడా ఉంది. జైనులకు కూడా ఇది పుణ్య క్షేత్రమే. బౌద్ధ స్థూపం నుంచి ఒక కిలోమీటర్ దూరంలో సింఘపూర్ అనే గ్రామం ఉంది. ఇప్పుడది సారానాథ్‌లో భాగంగానే ఉందనుకోండి. పద కొండవ జైన తీర్థం కరుడు శ్రేయన్స్నాథ్ జన్మ స్థానం. అందుకే ఇక్కడకు జైనులు కూడా పెద్ద ఎత్తున వస్తుంటారు.


- రెహానా
9492527352



పురావస్తుమ్యూజియం



పచ్చని లోగిలి 'కుద్రేముఖ్'



చల్లటి వాతావరణం, దట్టమైన ప్రదేశం, కనుచూపు మేర పచ్చదనం 'కుద్రేముఖ్' సొంతం. కర్ణాటక రాష్ట్రంలోని చిక్‌మంగళూరు జిల్లాలోని ప్రసిద్ధి గాంచిన పర్వతశ్రేణి ప్రాంతం కుద్రేముఖ్. ఈ పర్వతాలను ఒక పక్క నుండి చూస్తే గుర్రపు ముఖం ఆకారంగా కనిపించడంతో ఈ పర్వతా లకు కుద్రేముఖ్ అనే పేరుతో పిలుస్తారు. కన్నడ భాషలో కుద్రే అనగా గుర్రం, ముఖ్ అనగా ముఖం. కాబట్టి ఈ ప్రాంతానికి ఆ పేరు వచ్చి నట్లు తెలుస్తోంది. దట్టమైన అడవుల మధ్య, వైవిధ్య వృక్ష, వన్యమగ సంపద ఉన్న ఈ పర్వత శ్రేణులకు చేరుకునే రహదారి ఎప్పుడూ ప్రకృతి రమణీయంగా ఉంటుంది. తుంగ, భద్ర, నేత్రావతి నదుల జన్మస్థానం ఈ పర్వతశ్రేణుల మధ్య ఉండటం వల్ల కాలంలోనైనా ఈ ప్రాంతం పచ్చదనంతో కలకలలాడుతుంటుంది. ఈ ప్రాంతంలోని శిఖరపు ఎత్తులు 100 మీటర్లనుండి 1892 మీటర్ల వరకు ఉంటాయి. వీటి ఉత్తర, తూర్పు భాగాలు కొండ గొలుసుల మాదిరి ఏర్పడి పచ్చికబయళ్ళతో పచ్చని తివాచీ వలె కనిపిస్తాయి.

కుద్రేముఖ్ నేషనల్ పార్క్...

600 కి.మీ విస్తీర్ణంలో ఉన్న కుద్రేముఖ్ ప్రాంతం పశ్చిమ కనుమలలో ఉన్న సతత హరిత అరణ్యాలలో అతిపెద్ద సంరక్షిత స్థలం. ఈ ప్రాంతం జంతు వైవిధ్యం ఉండి ప్రపంచం మొత్తం మీద సంరక్షిత స్థలాలుగా ఎన్నుకొనబడిన 25 ప్రదేశాలలో కుద్రేముఖ్ ఒకటిగా ప్రఖ్యాతి గాంచింది. కుద్రేముఖ్ లో ప్రధాన ఆకర్షణ కుద్రేముఖ్ నేషనల్ పార్క్. ఈ పార్క్‌ను 1987 లో నేషనల్ పార్క్ గా ప్రకటించారు. ఇక్కడ కనిపించే వన్యమృగాలలో ముఖ్యమైనవి మలబార్ సివెట్, వేట కుక్కలు, స్లాత్ ఎలుగు బంటి, మచ్చలతో ఉన్న జింకలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయి. చిరుతలు, సింహాలు, కోతులు, అటవి పందులు, అడవి కుక్కలు వంటి జంతువులకు ఈ పార్క్ నిలయం.

కుద్రేముఖ్ శిఖరం...

కుద్రేముఖ్ సందర్శించే పర్యాటకులు కుద్రేముఖ్ శిఖరాన్ని కూడా తప్పక చూసి ఆనందించాల్సిందే! ఇది సముద్ర మట్టానికి 1894 అడుగుల ఎత్తున ఉంది. ట్రెక్కింగ్ లేదా అటవీ పరిశోధన చేయాలనుకునేవారికి కుద్రేముఖ్ శిఖరం ఎంతో అనువుగా ఉంటుంది. కుద్రేముఖ్ శిఖరం నుండి అందమైన అరేబియా సముద్రం చూసేందుకు వీలుగా ఉంటుంది. పర్యాటకులు సింహాలను కొండ ముచ్చులను చూసి ఆనందించవచ్చు.

కాదంబి జలపాతాలు...

కుద్రేముఖ్‌ను సందర్శించడానికి వచ్చిన పర్యాటకులు తప్పకుండా చూడాల్సిన ప్రదేశంలో ముఖ్యమైనవి ఇక్కడి జలపాతాలు. ఈ ప్రాంతానికి దగ్గరగా ఉన్న ప్రసిద్ధ జలపాతం 'కాదంబి జలపాతం'. ఇది చిక్‌మంగళూరు లోని కుద్రేముఖ్ నేషనల్ పార్క్ సమీపంలో ఉంటుంది. పర్యాటకులకు ఇది ఎంతో ఆహ్లాదాన్నిస్తుంది. దీంతో పాటు కలసకు 32 కి.మీ.ల దూరంలో ఉన్న మరో జల పాతం హనుమాన్ గుండి జలపాతం. ఈ జలపాతం నుంచి జాలువారు తున్న నీటి ప్రవాహం వల్ల 100 అడుగుల ఎత్తుగల సహజ సిద్ధమైన శిలలు ఏర్పడ్డాయి. కొండలు అధిరోహించాలని ఆసక్తి ఉన్నవారికి ఈ ప్రదేశం చక్కటి గమ్యస్థానం.

కుద్రేముఖ్ పర్యటనలో వసతి సౌకర్యానికి పెద్దగా ఇబ్బంది ఉండదు. కర్నాటక రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ కుద్రేముఖ్ కు అనేక వోల్వో, ఎయిర్ కండిషన్ బస్సులను కూడా నడుపుతోంది. కార్కాల నుండి 50 కి.మీ. మంగుళూరు నుండి 130 కి.మీ. బెంగుళూరు నుండి 350 కి.మీ. ఇక్కడ ఉండటానికి ఫారెస్టులాడ్జి లు, గెస్ట్ హౌస్‌లు మొదలైనవి ఉంటాయి. కుద్రేముఖ్ శిఖరాన్ని చూడాలనుకునే పర్యాటకులకు అన్నిరకాల వసతులు, ట్రెక్కింగ్‌కు అవసరమైన పరికరాలు తక్కువ ఖర్చుతో అందజేస్తారు.

- సంహిత




వెనిస్ ఆఫ్ ఈస్ట్...



ప్రకృతితో మమేకం అవుతూ, ప్రకృతిని ఆస్వాదిస్తూ, కాస్తంత సమయాన్ని గడపాలని అనుకున్నవారు అలప్పురా బీచ్‌కు వెళ్ళాల్సిందే! ఈ పడవ ప్రయాణం ద్వారా చల్లటి పిల్ల గాలుల్ని, ప్రజల జీవనశైలిని, ప్రకృతి అందాలను ఆస్వాదించవచ్చు. చిన్నగా ఉండే కంట్రీ బోటు నుంచి లగ్జరీ హౌస్ బోట్ వరకు పర్యాటకులకు అందుబాటులో ఉన్నాయి. బీచ్ వెంబడి ఎన్నో ఆసక్తికరమైన దృశ్యాలను గమనించవచ్చు. అందమైన వరి పొలాలు, కొబ్బరితోపులు, మధ్యమధ్యలో చేపలు పట్టుకునే వారు ఇలా ఎన్నో అపూర్వమైన జ్ఞాపకాలను ఆవిష్కరిస్తూ సాగిపోయే ప్రయాణం.

అలప్పుర బీచ్‌ను వెనిస్ ఆఫ్ ఈస్ట్‌గా పిలుస్తారు. ఇది కేరళ రాష్ట్రంలో ఒక ముఖ్యమైన స్థానాన్ని దక్కించుకున్నది. ఇది బోటు రేసులకు, బ్యాక్ వాటర్ విహారానికి, సముద్ర ఉత్పత్తులు, పీచు పరిశ్రమకు ప్రసిద్ధి చెందినది. ప్రముఖ పిక్నిక్ స్పాట్‌గా కూడా దీన్ని చెప్పుకోవచ్చు. బీచ్‌లోని అతి పురాతనమైన లైట్ హౌస్ పర్యాటకులను విశేషంగా ఆకట్టుకుంటుంది. అలప్పురలో మరో అద్భుతమైన అనుభవం హౌస్‌బోట్ క్రూసీ. పాతకాలంలో కెట్టువల్లం అని పిలవబడే పడవలను సందర్శకుల కోసం ప్రత్యేకంగా హౌస్‌బోట్లుగా మార్చిన వాటిని అలప్పుర బ్యాక్ వాటర్స్‌లో మనం గమనించవచ్చు. ఈ బీచ్‌ను ఒకప్పుడు బియ్యం, సుగంధ ద్రవ్యాలను తీసుకెళ్లేందుకు ఉపయోగించేవారు. ప్రస్తుతం హౌస్ బోట్లల్లో అన్ని రకాల సదుపాయాలు ఉన్నాయి. హోటళ్ల తరహాలో ఫర్నిష్డ్ బెడ్ రూమ్‌లు, మోడ్రన్ టాయిలెట్లు, కోజీ లివింగ్ రూమ్‌లు, కిచెన్, బాల్కనీలు కూడా ఉంటాయి. ఇక్కడికి వెళ్ళడానికి కొచ్చిన్ ఇంటర్నేషనల్ ఎయిర్ పోర్టు మార్గం ఉంటుంది.



పర్యటనల వల్ల విశాల దృక్పథం అలవడుతుంది. అంధ విశ్వాసాలు తొలగిపోయి శాస్త్రీయ స్పష్టత ఏర్పడుతుంది

- మార్క్ ట్వేయిన్

చేనేత నగరం...



హర్యానాలో ప్రసిద్ధ పర్యాటక కేంద్రం పానిపట్. ఇది స్మారక కట్టడాలకు నిలయం. పానిపట్ ను 'ధర్మక్షేత్ర', 'చేనేత నగరం' అని కూడా పిలుస్తారు. పానిపట్ నుంచి విదేశాలకు చేనేత ఉత్పత్తులు ఎక్కువగా జరుగుతాయి. పానిపట్ చుట్టూ పర్యాటక ప్రదేశాలు చాలా ఉన్నాయి. వాటిలో పానిపట్ మ్యూజియం, పురాతన శిల్పకళ, చేనేత వస్త్రాలు, పానిపట్ చరిత్రను తెలిపే శిథిలమైన పురాతన కోటలు. పానిపట్‌లో ఆధ్యాత్మిక క్షేత్రాలు కూడా చాలా ఉన్నాయి. మొఘల్ చక్రవర్తి బాబర్ నిర్మించిన కాబూలి షా మసీదు, తోట, ట్యాంక్ చాలా అద్భుతంగా ఉంటుంది. హుమాయున్ నిర్మించిన రాతి వేదిక ఇప్పటికీ చెక్కుచెదరకుండా ఉంది. ఈ వేదికను "చబుత్ర" అని పిలుస్తారు. ఇవే కాకుండా బు-ఆలీ షా కలబందర్, కళా అమ్బ, సాలార్ గుంజ గేట్ సమాధిని కూడా సందర్శించవచ్చు. పానిపట్ వాతావరణం శీతాకాలంలో చాలా చల్లగా, వేసవి కాలంలో వేడిగా ఉంటుంది. పానిపట్ ను చూడటానికి ఎక్కువగా విదేశీ పర్యాటకులు వస్తుంటారు. ఇక్కడికి విమానం, రైలు, రోడ్డు మార్గాల ద్వారా చేరుకోవచ్చు.

మరిన్ని క్రీడా వార్తలు 10వ పేజీలో..

గత 20 ఏండ్లుగా ఎంతో మంది దిగ్గజాలు ఇక్కడికొచ్చారు, వెళ్లారు. ఎవ్వరూ సిరీస్ సాధించలేదు. కానీ కోహ్లిసేన ఆ పని చేసింది. విదేశాల్లో గత జట్లు చేయలేని పని కోహ్లిసేన చేస్తోంది'
- శ్రీలంకపై సిరీస్ విజయానంతరం కోచ్ రవిశాస్త్రి వ్యాఖ్యలు.

పాతికేండ్లుగా దక్షిణాఫ్రికాకు భారత్ జట్లు పలుమార్లు వెళ్లాయి. ఓ సారి డ్రా అయితే, మరోసారి సిరీస్ వదులుకున్నారు. ఎన్నడూ వైట్‌వాష్ కాలేదు. కానీ కోహ్లిసేన ఇప్పుడు వైట్‌వాష్ ముప్పు ముంగిట నిలిచింది. కోచ్ శాస్త్రి అన్నట్టుగా కోహ్లిసేన విదేశాల్లో కొత్త రికార్డులు నెలకొల్పినా.. ఇక్కడా ఆ కోరుకోని కొత్త రికార్డు సాధించవద్దని సగటు అభిమానులు ఆశిస్తున్నారు. 0-2తో ఇప్పటికే సిరీస్ కోల్పోయిన టీమ్ ఇండియా పరువు కోసం వాండరర్స్‌లో బరిలోకి దిగుతోంది. దక్షిణాఫ్రికాతో మూడో టెస్టు నేటి నుంచే ఆరంభం.

వైట్‌వాష్ తప్పిస్తారా?

- సఫారీతో ఆఖరి టెస్టు నేడు ఆరంభం
- వాండరర్స్‌లో భీకర పేస్ పిచ్ సిద్ధం
- తీవ్ర ఒత్తిడిలో టీమ్ ఇండియా


మధ్యాహ్నం 1.30 నుంచి సోనిటెన్‌లో
విరాట్ కోహ్లి

నవతెలంగాణ-జోహానెస్‌బర్గ్

దక్షిణాఫ్రికా గడ్డపై 1992-93 నుంచి ఆడుతోన్న టీమ్ ఇండియాకు సఫారీ నేలపై మంచి రికార్డు లేదు. కానీ ప్రత్యేకించి జోహానెస్‌బర్గ్‌లోని వాండరర్స్ స్టేడియంలో మనోళ్లకు మంచి రికార్డు ఉంది. 2003 ప్రపంచకప్ ఫైనల్స్ సహా 2007 టీ20 ప్రపంచకప్ విజయం సైతం భారత్ ఇక్కడే దక్కించుకున్నది. ఇక్కడ ఆడిన నాల్గు టెస్టుల్లో భారత్ ఒక్కసారీ ఓడిపోలేదు. ఓ విజయం సహా మూడు డ్రాలతో వాండరర్స్‌లో అజేయ రికార్డు సాధించింది. ఇప్పుడా రికార్డుకు కోహ్లిసేన ముప్పు తీసుకొచ్చినట్టే కనిపిస్తోంది!. తర్కానికి అందని తుది జట్టు కూర్పు ఎంపిక, వ్యూహాత్మక తప్పిదాలతో ఇంటా బయటా సారథిగా విమర్శలు ఎదుర్కొంటున్న కోహ్లికి వాండర్సర్ టెస్టు ప్రతిష్టాత్మకంగా మారింది. ఇక సిరీస్ సాధించినా 3-0 విజయం టెస్టుల్లో అగ్రస్థానానికి మరింత చేరువ చేయగలదని సఫారీ భావిస్తోంది. క్లీన్‌స్వీప్‌తో ఉపఖండంలో ఎదురైన పరాభవానికి ప్రతీకారం తీర్చుకునేందుకు ఎదురుచూస్తోంది.


అజింక్య రహానె

కూర్పుపైనే కండ్లు : వాండరర్స్‌లోనూ తుది జట్టు కూర్పుపైనే అందరి కండ్లూ నెలకొన్నాయి! అజింక్య రహానె, భువనేశ్వర్ కుమార్‌లు ఆడతారనే సంకేతాలు వెలువడుతున్నా.. ఆఖరు నిమిషం వరకూ ఏదీ అంచనా వేయలేని పరిస్థితి. ఒకవేళ వీరిని తీసుకుంటే ఎవరిపై వేటు వేస్తారనే చర్చ పైకొస్తుంది. ఇక పూర్తి పేస్ పిచ్‌పై స్పిన్నర్ లేకుండానే బరిలోకి దిగే అవకాశం లేకపోలేదు. సిరీస్‌లో కోహ్లి మినహా బ్యాటింగ్ ఆర్డర్‌లో ఎవ్వరూ రాణించలేదు. దీంతో వాండరర్స్‌లోనైనా ప్రధాన బ్యాట్స్‌మెన్ ఫామ్‌లోకి వస్తే టీమ్ ఇండియా విజయావకాశాలు మెండుగా ఉంటాయి. పేస్ పిచ్‌పై మరోమారు భారత బౌలర్లు ప్రధాన భూమిక పోషించనున్నారు. భువనేశ్వర్, ఉమేశ్ యాదవ్, ఇషాంత్ శర్మ, మహ్మద్ షమి, బుమ్రాలలో ఎవరు తుది జట్టులో ఉంటారో కోహ్లి చెప్పే వరకూ వేచి చూడాల్సిందే!. వికెట్ కీపర్ పార్థీవ్ పటేల్ స్థానంలో దినేశ్ కార్తీక్ తుది జట్టులోకి రానున్నాడు.

అగ్రస్థానం వైపు అడుగులు! : 3-0తో సిరీస్ సాధిస్తే ఐసీసీ టెస్టు ర్యాంకింగ్స్‌లో దక్షిణాఫ్రికా ఇప్పటికిప్పుడు నెం.1 కాకపోవచ్చు. కానీ అగ్రస్థానంలోని భారత్‌తో పాయింట్ల అంతరం అమాంతం తగ్గుతుంది. దీంతో సఫారీలు వాండరర్స్‌లో విజయంపై కన్నేసి బరిలోకి దిగుతున్నారు. సిరీస్‌లో రెండు జట్లకు వ్యత్యాసంగా నిలిచిన ఏబీ డివిలియర్స్ ఇక్కడా కీలకం కానున్నాడు. దక్షిణాఫ్రికా బ్యాటింగ్ ఆర్డర్‌లో ఐదుగురు అర్ధ సెంచరీలతో ఫామ్‌లో ఉండటం వారికి సానుకూలాంశం. పేస్ పరిస్థితుల్లో స్పిన్నర్ లేకండానే దక్షిణాఫ్రికా రంగంలోకి దిగనున్నది.

20.45 భారత టాప్-6 బ్యాట్స్‌మెన్ సగటు 20.45. కోహ్లి మినహా ఎవ్వరూ కనీసం అర్ధ సెంచరీ చేయలేదు. అత్యంత చెత్త రికార్డు ఇది.

0 వాండరర్స్‌లో భారత్‌పై దక్షిణాఫ్రికా ఒక్క టెస్టులోనూ నెగ్గలేదు. నాల్గు టెస్టుల్లో భారతే ఓ విజయం, మూడు డ్రాలు చేసుకున్నది. భీకర పేస్ పిచ్‌పై మన రికార్డు అద్భుతంగా ఉండటం విశేషం!.


స్మిత్

తానా తందానా కాదు, తర్కం బోధించాలి!

- కోహ్లి దీర్ఘకాలిక కెప్టెన్ చాయిస్ కాలేదు
- భారత సహాయక సిబ్బందిపై స్మిత్ విమర్శ

జోహానెస్‌బర్గ్ : విరాట్ కోహ్లి నాయకత్వ పటిమపై, సహాయక సిబ్బందిపై దక్షిణాఫ్రికా సక్సెస్‌ఫుల్ మాజీ కెప్టెన్ గ్రేమ్ స్మిత్ తీవ్ర విమర్శలే చేశాడు. ప్రముఖ చరిత్రకారుడు, పాలకుల కమిటీ మాజీ సభ్యుడు రామచంద్ర గుహ ఇటీవలే ఓ వ్యాసంలో కోహ్లిపై విరుచుకుపడిన సంగతి తెలిసిందే. భారత్‌ను దగ్గర నుంచి చూస్తోన్న స్మిత్ నుంచి ఈ వ్యాఖ్యలు ఆలోచింపజేస్తున్నాయి. 'నేను విరాట్‌ను చూసినప్పుడు, అతడికి నిర్మాణాత్మక సవాళ్లు విసిరి, ఎదిగేలా చేసే వ్యక్తి కోచింగ్ సిబ్బందిలో ఉంటే బాగుండు అనిపించింది. ఎత్తుకు పైఎత్తు వేయగల సామర్థ్యం కోహ్లి సొంతం. అతడికి ఆట పట్ల మంచి అవగాహన ఉంది. మైదానంలో ఎవ్వరూ చేయలేని కొన్ని ప్రమాణాలు నెలకొల్పాడు. కానీ నిర్మాణాత్మక ఆలోచనశీలుడైన ఓ వ్యక్తి అతడి వ్యూహ బృందంలో ఉండి ఉంటే.. అతడికితో మాట్లాడి, ఆలోచన రేకెత్తించేలా చేసి, కొన్నిసార్లు భిన్న ఆలోచనల్లో నిర్మాణాత్మక సవాళ్లు విసరగలడు. అలాంటి పరిస్థితుల్లోనే కోహ్లి గొప్ప నాయకుడు అవగలడు' అని స్మిత్ అభిప్రాయపడ్డాడు. ఈ సమయంలో భారత క్రికెట్ దిగ్గజం సునీల్ గవాస్కర్ సైతం పక్కనే ఉండటం గమనార్హం. ఇక కోహ్లి భారత్‌కు దీర్ఘకాలిక కెప్టెన్ చాయిస్ అనుకోవట్లేదని స్మిత్ పేర్కొన్నాడు.

Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State, Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State Editor : S.Veeraiah.Tel Tel/2014/59462.